ఆంధ్ర సచిత్ర వారపత్రిక

15-7-83
150 పైసలు




LIFEBUOY
for health
LIFEBUOY
SOAP
లైఫ్‌బాయ్
ఎక్కడో
ఆరోగ్యం అక్కడ
లైఫ్‌బాయ్‌తో స్నానం చేస్తే పరిశుభ్రంగా ఉంటారు మీరు.... ఆరోగ్యమైన తాజాదనపు అనుభూతి పొందుతారు. లైఫ్‌బాయ్‌తో జీవితం ఆరోగ్యప్రదం. గుర్తుంచుకోండి....
లైఫ్‌బాయ్
మురికిలోని క్రిములను
వదలగొడుతుంది
LINTAS-L75-2317 TL
హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి


విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్
LAKSHMI PUBS.
గూఢచారి నెం.1
నిర్మాత: టి.త్రివిక్రమరావు M.A.,
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కోడి రామకృష్ణ
సహనిర్మాత: టి.ప్రద్యుమ్నరావు B.Com.,
మాటలు: సత్యానంద్
పాటలు: వేటూరి
సంగీతం: చక్రవర్తి
కెమెరా: పి.లక్ష్మణ్
కళ: భాస్కరరాజు
కూర్పు: బాలు
నృత్యం: సలీం
లక్ష్మీ ఫిలింస్
సీడెడ్: వి.యం.సి.



శ్రీ శ్రీ

మహాకవి శ్రీశ్రీ నిష్క్రమణంతో ఆంధ్ర భాషా సరస్వతి చిన్నబోయింది! కవితా ప్రపంచానికే కన్నుపోయింది!!

వెనిగళ్ళ రాంబాబు (రేపల్లె)

ఏటిజోరు

24–6–83 వారపత్రిక ప్రచురించిన రెండు కథలలో మిన్నగా వున్న ఒక్క కథ "ఏటిజోరు" కథలోని సారాంశము అన్నదమ్ముల అనురాగం. తల్లిబిడ్డల ప్రేమాను బంధం. ప్రేమ, అనురాగం. కాని, భార్యపై అసహ్యం వీటన్నిటిని ఏకబిగిని రంగరించి చక్కని శైలితో రచనను చేసిన రచయిత వెంకటేశ్వరరావుగారు అభినందనీయులు.

ఇటీవల మీరు వారపత్రికలో కథలను బహు తక్కువ స్థాయికి చేర్చి, సీరియల్స్‌కు బహు చోటు యిస్తున్నారు ఇది చాలా విచారకరం

శ్రీరంగపట్నంను గురించి ప్రచురించిన వ్యాసం కనులకు కట్టినట్లుగా వుంది.

షేక్ మస్తాను (ముమ్మలనేనివారిపాలెం, రేపల్లె)

'శిష్యపర్వతం'

3–6–83 వార పత్రికలో వచ్చిన కథ 'శిష్య పర్వతం'— ఆధ్యాత్మిక చింతన వున్నవారికి ఆసక్తిదాయకమైన, మోక్షదాయకమైన— కథ.

రాపోలు పరమేశ్వరరావు (కొత్తరెడ్డిపాలెం)

ముఖచిత్రం

17–6–83వ సంచికలో వెలువడిన నటి "జయసుధ" ముఖచిత్రం చూస్తూనే మమ్మల్ని అలరించింది జయసుధగారిని చూస్తూనే ఎందుకోగాని నటి "సుజాత" గారు గుర్తుకొచ్చారు. కనుక నటి సుజాతగారిని బహు అందముగా చిత్రించి ఆంధ్రపత్రికను వెలువరింపకోర్తాను

బి. వి. బి బి. సంజీవరావు (భుసావల్)

*   *   *

3–6–83 నాటి సంచిక ఆంధ్ర సచిత్ర వారపత్రిక అనేకంటె సెక్సీ పత్రిక అంటె బాగుంటుందేమో, అలాగుంది ముఖచిత్రం అయ్యో! అంత సెక్సీగా వేశారేమిటండీ పదిమందిలో గొప్పగా పట్టుకుతిరిగే మేము, ఈ వారము ఎవరికి కనిపించకుండా చదువుకున్నాము దయచేసి ఆవిధంగా ముఖచిత్రాలు వేయవద్దని మా ప్రార్థన

చింతకింది శంకర్, వ॥ బుచ్చయ్య (బొంబాయి)

మనవి

కొంత కాలం కింద ఆంధ్ర సచిత్ర వార పత్రిక నిర్వహించిన విద్యార్థి లోకం వ్యాస రచన పోటీలో పాలుగొన్నవారందరికీ కానుకలు పంపే ఏర్పాటులు చేశాము చిరునామాలు మారటంవలన, ఇతర కారణాలచేత కొందరికి ఇవి చేరటం ఆలస్యం అవుతోందని తెలుస్తోంది

పోటీలో పాలుగొన్నవారు తమ చిరునామాలు మారితే మాకు తెలుపుతూ రాయగోరుతున్నాము

– సంపాదకుడు

"హసిత వదన ముదిత
పుష్పాలంకృత సబిత
నయనా సందకర శోభిత
ప్రేరేపించెను భావుకత"

(24–6–83 సంచిక ముఖచిత్రం ప్రేరణతో)

ఆవుల రమణారెడ్డి (జమ్మలమడుగు)

కెమెరా కొనేశా!

3–6–83 ముఖచిత్రం 'సిల్కస్మిత' ఎక్సెలెంట్ నేనూ మంచి ఫోటోగ్రాఫర్‌ను అయ్యి, అటువంటి భంగిమలు కళ్ళారా చూసి, చిత్రాలు తియ్యాలని కోరికతో, వెంటనే కెమెరా కొనేశా!

వై. రామారావు (కాకినాడ)

చక్కని అనుభూతి

చాలాకాలంగా ప్రేమకథలు, సీరియల్స్ చదివి విసుగెత్తిన మాకు 'అతడు అడవిని జయించాడు' సీరియల్ ద్వారా చాలా చక్కటి అనుభూతిని కల్గించింది

బాబుగారి 'ఇ'వేమన పద్యాలు గురించి సమాజంలో జరిగేవి చాలా చక్కగా పద్య రూపంలో వర్ణిస్తున్నారు డాక్టర్ జయ్‌దుబాషీ గారి 'న్యూఢిల్లీలేఖ' రాజకీయల్లో జరుగుతున్న కుళ్ళును పట్టి మాకు తెలియజేస్తున్నారు

గుమ్మనూరు పూర్ణశ్రీ (ఆదోని)

వ్యాసాలు

17–6–83 ఆంధ్ర సచిత్ర వారపత్రిక (జయసుధ ముఖచిత్రం) ఆకర్షణీయముగా ఉండి మమ్మల్ని ఆకట్టుకుంది ముఖ్యంగా డా గుమ్మనూరు రమేష్‌బాబుగారి వ్యాసం "మహిమలను అంగీకరించడం శాస్త్రీయమేనా ?" విజ్ఞానాన్ని ఇచ్చేలా ఉంది

సి ప్రతాప్, సి ప్రకాష్ (విశాఖపట్నం)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 15–7–'83
రుధిరోద్గారి నామ సం. ఆషాఢ శు పంచమి
సంపుటము 75 సంచిక 46
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు.	1-50
ఆరు మాసాల చందా	రు.	42 90
పోస్ట్‌లో ఏడాది చందా	రు.	85 80


ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి మంజరి
(ఫొటో జి కె సరసింహం)

కథలు :

లోకంపోకడ * ఉత్తేమెన్



గాంధీ - బిర్లా - నెహ్రూ - తాతా - స్వరాజ్యం - సోషలిజం - సి. ఐ. ఏ. - భగవద్గీత



జి. డి. బిర్లా

ఇంకేదయినా దేశమయితే ఘనశ్యామ్‌దాస్ బిర్లా కావలిస్తే ఆ దేశానికి అధ్యక్షుడు కాగలిగి ఉండేవాడు. భారతదేశంలో ఆయన వ్యాపారులలో ఒక కురు వృద్ధుడుగా ఉండి పోయాడు.

మహాత్మాగాంధీకి సన్నిహితంగా ఉన్న వారిని ఎవరినీ కాంగ్రెసు రాజకీయవాదులు— నెహ్రూతో సహా — క్షమించలేరు. నెహ్రూకి ఒక్క బిర్లా అంటేనే కాదు కృపలానీ, బజాజి, కలేల్కార్, సుశీలానయ్యర్ లాంటి అసలయిన సిసలయిన గాంధీ వాదులంటే కూడా ఇష్టం లేదు. ఇక్కడ ఒక యదార్థాన్ని గమనించాలి. పయి వారంతా గాంధీగారిని బట్టే కాంగ్రెసులో చేరారు. అంతే కాని, కాంగ్రెసులో ఉన్నారు కాబట్టి గాంధీ వాదులు కాదు. వీరంతా కాంగ్రెస్ వారిలో ఒక ఉపశాఖకి చెందిన వారుగా పరిగణింపబడే వారు. ఏదో ఒక సాకుమీద పార్టీ నుంచి బయటికి పంపించబడిన వారే.


బిర్లా విషయం చాలా చిక్కులతో కూడినది. బిర్లా కాంగ్రెసుకి చాలా ఆప్తుడు — ఆయనేగా అసలు దానిని పోషించినది. కాని ఆయన కాంగ్రెసు వాడు కాడు. తను కాంగ్రెసు వాడిని కానని ఆయన బాహాటంగానే చెప్పేవాడు. ఒకసారి ఆయన లిన్‌లిత్‌గో ప్రభువుతో ఇంటర్‌వ్యూ కోరాడు. కోరినప్పుడు ఆ వైస్‌రాయి కార్యదర్శితో "నేను గాంధీ మనిషిని కాని కాంగ్రెసువాడిని కాన"న్నాడు. [ఆయన ఈ వివరణ ఎందుకు చెయ్యవలిసి వచ్చిందంటే, లిన్‌లిత్‌గో ఇంటర్‌వ్యూ ఇవ్వనన్నాడు] గాంధీ నాకు తండ్రి వంటివాడు, ఆయన రాజకీయాలతో నాకు సంబంధం లేదని బిర్లా అన్నాడు. అందుకనే ఆయనంటే ఇటు కాంగ్రెస్‌వాళ్లకీ నమ్మకం ఉండేదికాదు [వాళ్లకి ఈయన అంత డబ్బు ఇచ్చినా], అటు బ్రిటిషు వాళ్లకీ నమ్మకం ఉండేదికాదు [బిర్లా యుద్ధ సమయంలో వారితో సహకరించాడు]. బిర్లాకి ఈ సంగతి తెలుసు. "నా మీద నమ్మకం లేకపోతే ఇక మళ్లీ మిమ్మల్ని చూడను" అని లిన్‌లిత్‌గోతో అన్నాడు, అన్నట్లే వైస్‌రాయిని ఆయన భారతదేశంలో ఉన్నంత కాలమూ చూడలేదు.

బిర్లాతోవచ్చిన చిక్కేమిటంటే ఆయన గాంధీవాది కూడా కాడు. ఆయనకి గాంధీ ఆర్థిక సిద్ధాంతాలంటే నమ్మకం లేదు — గ్రామాలలో చిన్న పరిశ్రమలు ఉండాలన్న సిద్ధాంతం అన్నమాట. అలాగే, వ్యాపారులు ధర్మకర్తలన్నా గాంధీ సిద్ధాంతమన్నా బిర్లాకి నమ్మకం లేదు. బిర్లా ఒక పెట్టుబడిదారుడు. తను పెట్టుబడిదారుడినేనని స్పష్టంగా చెప్పేవాడు. అందుకనే నెహ్రూకి రెండు విధాలుగా చెడినవాడయ్యాడు : ఒకటి, బిర్లా గాంధీవాది కాడు కాని గాంధీగారికి ఆప్తుడు; రెండు, ఆయన సోషలిస్టు కాడు. నిజానికి నెహ్రూ మాత్రం గాంధీ వాదా ? కాడు, ఊరికే నాటకం ఆడేవాడు. బిర్లా గాంధీవాది అయితే ఆయన కేమిటి ? కాకపోతే ఆయనకేమిటి ? పోనీ పెట్టుబడిదారుడా ? అమ్మో ! నెహ్రూ లాంటి "ఫాషన్‌బుల్ సోషలిస్టు" ఎలాగ సహిస్తాడు ? కొందరు ఆడవాళ్లు కొన్ని "ఫాషన్ పత్రిక"ల కోసం కళ్లు కాయలు కాచేట్లు కాచుకుని ఉంటారు. నెహ్రూ అలాగే "న్యూస్టేట్స్‌మెన్" పత్రిక కోసం ప్రతి వారం ఆత్రంగా ఎదురు చూసేవాడు.

స్వరాజ్యం వచ్చింది. కాంగ్రెసు వాళ్లు బిర్లాని వదిలించుకున్నారు. ఆయన వాళ్లకి ప్రయోజనకారిగా కనిపించలేదు. గాంధీగారు చనిపోగానే ఘనశ్యామ్‌దాస్ బిర్లా అనే మనిషి అసలు లేడు—అన్నట్లే ప్రవర్తించారు. 1947 ఆగస్టు దాకా "జి. డి." (బిర్లా) నాయకత్వంకింద మార్వాడీలుగా పిలువబడేవాళ్లు కాంగ్రెసుకు రు. 20 కోట్లు దాకా ఇచ్చారని అంచనా. ఇంత దానాలుచేసి ప్రతిఫలం కోరుతారేమో బిర్లా, తదితరులని నెహ్రూ అనుమానించి ఉండాలి. "జి.డి." అతని కుటుంబానికి అతి వేగంగా దూరం అయిపోయాడు, తీన్‌మూర్తి భవన్‌కి వాళ్లని పిలవనేలేదు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం ఆయనా, ఆయన పార్టీ బిర్లాని డబ్బు అడిగేవాళ్లనుకోండి — అది వేరే సంగతి. మొయినిహాన్ (మాజీ అమెరికా రాయబారి, భారతదేశంలో) అనలేదూ — శ్రీమతి గాంధీ కేరళలో ఎన్నికల కోసం అమెరికా గూఢచారి సంస్థ (సి. ఐ. ఏ.) వద్ద నిధులు తీసుకున్నారని ? అటువంటప్పుడు, నెహ్రూ లేదా ఆయన అనుచరులూ "జి.డి."ని డబ్బు అడగటంలో వింత ఏమిటీ ?

"జి.డి." ఉక్కు కర్మాగారం ఒకటి పెడదామని అమెరికావాళ్లతో బేరాలు మొదలు పెట్టాడు. దీనిని పసిగట్టి నెహ్రూ అమెరికా వాళ్లతో ఇక్కడ ప్రయివేటు రంగంలో ఉక్కు కర్మాగారానికి అవకాశం లేదని చెప్పాడు. నెహ్రూకి తాతా సంస్థవాళ్లు స్నేహితులు. తాతాలు జాతీయోద్యమంలో పాలుగొనలేదు. వాళ్లకన్నా పెద్ద మిత్రులు లేరు బ్రిటిషు వాళ్లకి భారతదేశంలో. అయినాసరే, నెహ్రూ వాళ్లని తనకి చేరువ చేసుకున్నాడు స్వాతంత్ర్యం తరువాత. "జి. డి." ఎవరు ? వట్టి దేశవాళీ వ్యాపారి. ఒక "నేటివ్". తాతా వాళ్లంటే వో తెల్లజాతి తల్లులు, భార్యలు

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి


కలవాళ్లు నెహ్రూకి తెల్ల చర్మం అంటే ఎంత మోజో తెలియని వాళ్లెవరు ?

"జి డి." కి సంబంధించినంతదాకా ఆయనకి మరొక బలహీనత ఉంది ఆయన ఒక హిందువు (హైందవుడు) కేవలం ప్రమాదవశాత్తు తను ఒక హిందువుగా పుట్టాననని ఒకసారి అన్న నెహ్రూకి తాతాలు హిందువులు కాకపోవటం నచ్చటంలో ఆశ్చర్యం ఏముంది ? "జి డి." ఒక్క గాంధీగారి ఆశ్రమాలని మాత్రమే కాదు గాంధీగారి ధర్మనిధులని కూడా పోషించాడు, ఇంకా ఎన్నో హైందవ ధర్మనిధులకి కోట్లు దానం చేశాడు, ఆలయాల పునరుద్ధరణకి విరాళాలు ఇచ్చాడు, తనే చక్కటి ఆలయాలని కట్టించాడు వ్యాపారమూ, మతమూ కలిస్తే తప్పేమిటనేవాడు "జి.డి" "అసలయిన హిందువు ఎప్పుడూ సమగ్రంగా జీవిస్తాడు గాని జీవితాన్ని గదులుగా విభజించడు గదా ?" అనేవాడు ఆయన "(భగవత్) గీత ఏమన్నది ? ప్రతి ఒక్కరూ తన ధర్మాన్ని పాటించాలి ఒక సంపన్నుడి ధర్మం తన సంపదని కాపాడుకోవటమే కదా ? వ్యాపారుల ధర్మం ధనార్జనలే ఆర్జించిన ధనంతో అందరి క్షేమానికీ కృషి చెయ్యాలి ఈ కృషి చేసేప్పుడు రాజకీయాలతో అవసరం వస్తే వాటికి దూరంగా ఉండిపోవాలనుకోవటంలో అర్థం ఏమిటి ?

"జి డి" సామ్రాజ్యం ఇంత పెద్దదయిందంటే దానికి కారణం ఆయన హైందవ సంప్రదాయమే — సందేహం లేదు బిర్లా సంస్థలు పెద్దవేకాదు సజీవంగా అభివృద్ధి చెందేవి కూడా బిర్లాల కంపెనీలు తాతాల కంపెనీలకన్నా చురుకుగా పనిచేస్తాయి అయితే, బిర్లాల కంపెనీలు తాతాల కంపెనీలంత పాతవి కావు అసలు స్వాతంత్రోద్యమానికి తాతా ఎంత తోడుపడ్డారు? బిర్లాలు తమకి నష్టం వచ్చినా లెక్కచెయ్యకుండా జాతీయోద్యమాన్ని బలపరిచారు. "జి డి" కోట్ల సహాయమే గాంధీగారి బ్రిటిషు — వ్యతిరేకోద్యమం బాగా పని చెయ్యగలిగింది "జి డి"కి దేశభక్తి మెండు. ఆ దేశభక్తే ఆయనకి అంత శక్తిని ఇచ్చింది. 1930 ప్రాంతంలో "జి డి" సర్వాంతర్యామిలాగ ప్రవర్తించేవాడు బ్రిటిషు వారికీ, మహాత్మా గాంధీకి మధ్యవర్తిగా పని చేశాడు, దేశం అంతటా కర్మాగారాలూ, కార్యాలయాలూ నెలకొల్పేవాడు, లండన్‌లో చర్చిల్‌ని, బాల్డ్విన్‌ని కలుసుకునేవాడు, కేంద్ర శాసన సభ్యుడిగా ప్రసంగాలు చేసేవాడు, తన కుటుంబ సమస్యలని గాంధీగారికి చెప్పేవాడు

"జి డి"ది నిండు జీవితం ఆయన భగవద్గీతలో చెప్పినట్లు జీవించాడు ఘనశ్యామ్‌దాస్ బిర్లా ఒక్కడికే ఇదంతా సాధ్యమయ్యేది ★





ఉగాదిని తలచుకుంటేనే చాలు—నా గుండెల్లో అమృతపు చినుకులు కురుస్తై. పండగ పరిమళాన్ని పంచుకోబోయే ఆందంతోనూ కాదు పిండివంటల రుచితో జిహ్వని సంతృప్తి పరుస్తానే కోరికతోనూ కాదు

అవును—ఉగాదిని తలచుకుంటే అవ్యక్త రాగాన్ని పాడుకుంటుంది మనస్సు ఉగాది వస్తున్నదంటే మా ఉమాపతి గుర్తుకువస్తాడు ఉమాపతి గుర్తుకు రాగానే—అరచేతిలో శ్రీ రాసి కళ్ళకద్దుకున్న భావన కలుగుతుంది

గిలక్కాయరంగును చూసి తనలో తాను నవ్వుకునే పసిపిల్లవాడిలా, ఉమాపతి గుర్తుకొస్తే నాలో నేను నవ్వుకుంటాను మురిసిపోతాను ఆనందంతో గుండెలు పండించుకుంటాను, అతను చెప్పిందీ, చేసిందీ కళ్ళముందు ఆడుతుంది

ఉమాపతి గురించి చెప్తాను

* * *

మెడ చుట్టూ చేతులు వేసి 'నా మాట వినరూ' అంటూ గోముగా మరో సారి తన కోరికని కొసరింది, శారద

అంతకు ముందు ఇలాంటి విన్నపాలు, విన్యాసాలూ చాలా జరిగినై

''సరే—అలాగే వెళ్దాం కానీ '' అన్నాను నేను మెత్తబడతానని తనకెలాగూ తెలున్నట్లు గర్వంగా, నా వైపు వో చూపు పారేసి—'గుడ్‌బాయ్' అని మనస్సులో నాకొక 'కాంప్లిమెంట్' ఇచ్చుకుని – లోపలికిపోయి కాఫీ పట్టుకొచ్చింది

కాఫీ తాగుతూ ఉమాపతి రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాను.

''ప్రియమైన అన్నయ్యకు : నమస్సులతో,

నా నుంచీ నీకు ఇలా ఉత్తరం రావడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయమే ఉగాదికి రెండు రోజులు ముందుగా నేను మన వూరు చేరుతున్నాను ఆనాటికి నువ్వు వదిన్నీ, పిల్లల్నీ తీసుకుని తప్పకుండా అక్కడికి రావాలని నా కోరిక ఏదో రాసేనని అనుకోవద్దు ఈ ఉగాది మన జీవితాలకి కొత్త మలుపు కాబోతోంది. నా కోరికని మన్నిస్తావనే నమ్మకంతో — వుంటాను

తమ్ముడు — ఉమాపతి''

మన ఊరు !

ఒక్కసారి మనస్సు గతంలోకి పరుగెత్తింది ఇరవై తొమ్మిదేళ్ల క్రితం —

అవును, అప్పట్లోకి అది మా ఊరు అక్కడ పుట్టి, పదిహేనేళ్లు ఆ గాలీ, నీరూ అనుభవించాను ఆ మట్టిలో ఆడుకున్నాను. చెర్లో ఈతలు కొట్టాను చెట్లమీద కోతి కొమ్మచ్చులాడాను; వినాయకుడి కోసం కొమ్మలు విరిచేను, ఉగాది కోసం వేపమండలు వంచాను, వేణుగోపాలుడి గుడి ముఖమండపంలో కూర్చుని చదువుకున్నాను; చదువుకుంటూ పద్యాలు

రాశాను, పద్యాలు రాస్తూ చదువుకున్నాను పడమటి పొలానికిపోయి తాటిచెట్లెక్కి— కాయలు కొట్టి— పందేలు పెట్టి— ముంజెలు తిన్నాను ఈతగెలలు కోసి, గుంటలు తవ్వి పాతేసి పండ బెట్టి— పంచుకున్నాను సెలవల్లో అడపాదడపా— బాబాయితోపాటు -- అచ్చిరాని సేద్యంలో చెమటలు కక్కాను.

అప్పుడు — అది నా ఊరు !

ఇరవై తొమ్మిదేళ్ళు ! — ఎంత సుదీర్ఘమైన విరామం ! ఇన్నేళ్ళకిన్నాళ్ళకి మళ్ళి దాన్ని నాకు గుర్తుచేసి, అక్కడికి రమ్మని ఉమాపతి ఆహ్వానం !

నేనా వూరువదిలేసి వచ్చేనాటికి ఉమాపతి లొట్టికాయ, పసినాపకు ఆరేళ్ళు నిండాయేలేదో— అంతే ! బాబాయికి ఒక్కగానొక్క నలుసు. 'ఆ ఇంటిచాలే అంత. ఒక్కడు లేదా ఇద్దరు. అందరికీ అంతే' అనుకుంటూ వుండేవాళ్ళూ — వూరివాళ్ళ — నన్నూ, వాణ్ణీ చూపుతూ !

అమ్మకూ, పిన్నికీకూడా కళ్ళు చెమర్చడం— నాకు గ్రాయకం వచ్చిన తర్వాత నేను అడపాదడపా — ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా — గమనిస్తూనే వుండేవాణ్ణి

నేను ఎనిమిదిలో వుండగానే నాన్నపోయాడు. ఆ లోటేమిటో వెంటనే తెలిలేదు.

ఊళ్ళో స్కూల్లోనే ఎస్సెల్సీ అయింది.

అప్పుడు కళ్ళు తెరిచి చుట్టూచూస్తే — ఎన్నెన్నో రంగులవలలు, చేదు నిజాలు !

రాత్రి — అన్నాలయ్యి ఆరు బయట పడుకున్నప్పుడు నిమ్మళంగా విషయం నా ముందు పెట్టింది అమ్మ —''ఇంతటితో చదువు మానేయమంటున్నాడు, మీ బాబాయి.''

నేను వులిక్కిపడ్డాను. లేచికూర్చున్నాను. ఏదో చెప్పబోయాను. మాట తడబడింది. చివరికి 'అదేవిటీ — కాలేజీలో చేరదామనుకుంటుంటే' అని మాత్రం అన్నట్టు గుర్తు

అమ్మ లేచి నా పక్కమీదికివచ్చి కూర్చుంది. నిమ్మళంగా నా తల నిమిరింది. ఆమె కళ్లల్లో నీళ్ళ తిరిగినై. ''కాలేజీ అంటే మాటలా. పట్నంపోయి వుండాల బోల్డంత ఖర్చు. డబ్బు కావద్దూ'' అంది.

కుప్పకూలినట్లయింది నా పని. ఎస్సెల్సీలో స్కూలు ఫస్టుని. మాష్టర్లంతా 'తప్పకుండా కాలేజీలో చదివి పైకి రావాలి నువ్వు' అనే ఆశించారు, దీవించారు, చాలా పుస్తకాలు బహుమతులుగా యిచ్చి మెచ్చుకున్నారు. ఆకాశంలో పోయే విమానాన్ని చూసి చెయ్యి వూపుతూ నిలబడి, ఆ ఆకారం; శబ్దం కనుమరుగు కాగానే ఇంట్లోకి పోవాల్సిందేనా ?

రాత్రంతా — ఆలోచన నులకమంచంమీద పొర్లుతూనే వుంది. వెలిసిపోయిన గుడ్డలా అయింది మనస్సు. అమ్మ ముందు ఏడుపు సరేసరి.

వేగుచుక్క పొడిచింది

అప్పుడన్నది అమ్మ, ''నీకంత గట్టిగా చదువుకోవాలనే వుంటే, మన భాగం అంతా అమ్మేసి పట్నం వెళ్ళిపోదాం బాబాయితో మాట్లాడుతాలే, ఊరుకో''

నా మొహాన్న తొలివెలుగు తోచింది.

మధ్యాహ్నం ఈ చర్చ అంతా ముళ్ళ కంచెలాగా తయారైంది మేం చేయబోయే పనిని ఎవరూ సమర్థించలేదు. ''వాడు పసివాడు వాడికేదో చదువుకోవాలనే వుంటుంది కానీ, నువ్వూ వాడికి వంతపాడి, ఇట్టా వెనకా ముందూ చూసుకోకుండా— కుండా కూడా— వదిలేసి పోతానడం ఏం బాగాలేదు'' అని అమ్మని నానా చీవాట్లు పెట్టారు— చనువున్న నలుగురూ

అమ్మ ఒక్కటే మాటమీద వుంది ''వాడు చదువుకుంటానంటున్నాడు చెప్పించడం నా ధర్మం''

బాబాయికి కోపమొచ్చింది ''అవును చదువుకుని ఏం చేస్తాట్ట, చంకనాకుతాడు? ఆ చేసేదేదో ఇప్పుడు చదివినదాన్తోనూ ఏడవ్వచ్చు ఇంకా ఎందుకుట— ఆ కాలేజీ చదువులు ?''

పొగలొంచీ, నిప్పు కణకణలాడింది, మంటా లేచింది.

అమ్మ నాకేసి చూసింది— ఏం చెప్తావన్నట్టు

చుట్టూ చూశాను అందరి చూపులూ నా మీదే వున్నై నాలో ఏదో మొండి ధైర్యం, తెగింపూ వచ్చేసినై ''ఏమీ చెయ్యలేకపోయినా సరే. ఎందుకూ పనికిరాకపోయినా— సరే, ఈ వూరంతటికీ మొట్టమొదట్నే బియ్యే నవుతాను. సరేనా'' వాతావరణంలో పిడుగుపడింది !

అంతా నివ్వెరపోయారు బాబాయికి అంతా అచేతనంగా వుంది.

నేను మామూలు మనిషిగానే నిలబడి వున్నాను. నా గుండె గుండెలోనే వుంది. కళ్ళ ముందు ఏదో విజయచిహ్నం మెదలాడ సాగింది

—రెండున్నర ఎకరాల— మాగాణీ—పేరుగల భూమినీ నాలుగున్నర వేలకీ, ఐదెకరాల మెట్టనీ ఒక వెయ్యికీ— బాబాయి, తానే తీసుకున్నాడు

అమ్మ నన్ను తీసుకుని పట్నం వచ్చేసింది నేను కాలేజీలో చేరేను

నేను—కోరుకున్నట్లుగా—బియ్యేని కాగలిగేను. అమ్మ నా కోసం తన ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టకుండా—కుట్టుమిషన్‌మీద పని చేసింది తాను ఒకపూట తిని నాకు రెండు పుటలా అన్నం పెట్టింది. తానూ రెండు పూటలా తిన కలిగిననాడు—నాకు మూడో పూటకూడా పెరుగు ముద్దలు పెట్టింది

గవర్నమెంట్ నౌకరీలో చేరాను

అమ్మ బాబాయికి ఉత్తరం రాసింది అవును—తన కొడుకు ఆ వూరంతకీ మొదటి పట్టభద్రుణ్ణవుతానన్న కలని పండించుకున్నాడు ! అందుకు, ఆమె-కళ్ళని ఆనందంతో చెమర్చుకుంది

బాబాయి ఉదాసీనంగా ఊరుకున్నాడు అమ్మ బాధపడింది నేనే ఆమెకు నచ*చెప్పేను, ధైర్యం చెప్పేను

పెళ్లీ పేరంటం జరిగాయి అప్పుడూ బాభాయి అయిపులేదు

శారద రామసీతని ప్రసవించిన వొక నెలకో యేమో అమ్మ పోయింది నేను బాబాయికి ఉత్తరం రాసి పోస్ట్‌లో వేశాను ఎన్నాళ్ళకూ ఎలాంటి సమాధానమూ రాలేదు ఇప్పుడు రామసీత బీకాం పూర్తి చేసింది ఆమె పెళ్ళికి సంబంధాలు చూస్తున్నా నేను !

—తుండుతో కళ్ళొత్తుకుని, మొహం తుడుచుకున్నాను



ఒకరిద్దరిలో ఒకరు

శారద వచ్చింది. ఖాళీ కప్పును తీసుకుని వంటింట్లోకి వెళ్తూ, ''సెలవు సంగతీ అదీ చూసుకోండి. సీత, సునీత, రాజు, చంద్రం కూడా మనతో వస్తామని ఉబలాటపడుతున్నారు అందరమూ కలిసే వెళ్దాం'' అంది.

ఉమాపతి రాసినట్టే—ఉగాదికి రెండ్రోజుల ముందు—మా వూరు చేరుకున్నాము ఉమాపతీ— అప్పటికి నాలుగునాళ్ల క్రితమే వచ్చేశాడట అతని భార్య సుందరి. వాడికీ ముగ్గురు పిల్లలు—

శారదా, సుందరీ క్షణాల్లో కలిసిపోయేరు పిల్లలు సరేసరి

ఊరిని తలచుకుంటే నాకే ఆశ్చర్యం వేసింది. ఊసరక్షేత్రాల్లా వుండే పొలాలు కళ కళ్లాడుతూ పచ్చగా మారినై, తోటలూ వచ్చినై. రకరకాల పళ్లూ, కాయలూ, అరటీ వేస్తున్నారట కొంత మంది పత్తిమీద రాబడి బాగానే తీస్తున్నారట బస్‌రోడ్ నుంచీ ఊళ్లోకి తార్రోడ్డు పడింది పక్కగా అటూ ఇటూ గలగల పారుతున్నై — పంటకాలవలు. వీధి దీపాలూ, రేడియో సెంటరూ, కాలేజీ బిల్డింగూ, మిల్క్‌చిల్లింగ్ సెంటరూ — అన్నీ నాకు రంగుల కలలో చిత్రాల్లా తోచినై

ఉమాపతి ఇల్లూ అలాగే కొత్త అందాల్ని సంతరించుకుంది కాంక్రీటు భవనం. అన్ని వసతులూ వున్నై. ప్రాంగణమంతా శుభ్రంగా వుంది

బాబాయ్, పిన్నీ — లేరనే లోటు తప్ప— ఆ యింట్లో మరో లోటే కనపళ్లేదు.

— డాబామీద పడుకుని కబుర్లాడు కుంటున్నాం, నేనూ, ఉమాపతీ

''ఇదంతా సాగర్ పుణ్యమే అన్నయ్యా. సాగర్ నీళ్లొచ్చి మన ప్రాంతాన్నంతా ఒక్కసారి మాయాబజార్లా మార్చేసినై రెండేళ్ల నుంచీ పల్లపు భూమిలో పాతిక బస్తాలు కనీస దిగుబడి వుందిప్పుడు. మెట్టలో పసుపు వేస్తున్నాం. ఎకరం పాతికవేలు పలుకుతోంది — పొలం ధర. ఢిల్లీలో వుంటున్నా, ఇక్కడి వ్యవహారాలకోసం నేను వచ్చిపోతూనేవున్నాను, అడపాదడపా ముఖ్యమైన పనులన్నీ మా మావగారు చూసుకుంటున్నారు. ఈ ఇల్లు కట్టడపు పనంతా ఆయనే చూశారు''

నేను ఆలోచనతో, ఆశ్చర్యంతో పరధ్యా నంగా వున్నట్లు గమనించినట్లున్నాడు ఉమాపతి చెప్పడం ఆపేడు.

గోవుల్ని మళ్లించిన అర్జునుడిలా తోచేడు నాకు ఉమాపతి

పండగ వెళ్లిపోయింది, ఎంతో సరదాగా, సంబరంగా. అందరికీ ఖరీదైన కొత్తబట్టలు! ఊళ్లో చదువుకున్నవాళ్లంతా నా పిల్లల్నీ, ఉమాపతి పిల్లల్నీచూసి ముత్యాల్లా వున్నారని మురిసిపోయారు. శారదా, సుందరీ వాళ్లందరూ చూడచక్కని అక్కాచెల్లెళ్లు!

తండ్రుల చాలు రాకుండా, సంతానవంతులైనందుకు వో పెద్దాయన నన్నూ ఉమాపతినీ అభినందించాడు — బజార్నపోతుంటే ఆపి, మాట్లాడి!

పంచమినాడు మా తిరుగు ప్రయాణం. ఉమాపతికి ఇంకా సెలవుంది

ఆ రోజు — మధ్యాహ్నం భోజనాలై హాల్లో కూర్చున్నాం.

బయటనుంచి ఎండకాస్తున్నా, అక్కడ చాలా ప్రశాంతంగా, చల్లగావుంది ఏవో మాటలు సాగుతున్నై. ఉమాపతి లేచి లోపలికి వెళ్లాడు. క్షణాల తర్వాత గదిలోనుంచీ బయటికి వచ్చేడు ఉమాపతి.

''ఈ వూరు విడిచి వెళ్తూ వెళ్తూ అన్నావుట నువ్వు. 'ఏమీ చెయ్యలేకపోయినా, ఈ వూరంతకీ మొట్టమొదటి బియ్యేనవుతా'నని. నాన్న అంటూ వుండేవాడు నీ మాటలు ఆయనలో గొప్ప మార్పునే తెచ్చినై అది తలచుకుంటూనే ఆయన నన్ను ఈ వూరంతకీ మొట్టమొదటి ఇంజనీరుని చేశారు ఆ విధంగా నేన్నీకు ఎంతో ఋణపడి వున్నాను'' ఉమాపతి స్వరం మారింది కృతజ్ఞతలోపాటు, ఆరాధనా భావమూ కదలాడింది

నేను విస్తుపోయాను. గట్టిగా కళ్లు మూసుకున్నాను. క్రమంగా—మేధస్సులో ఎక్కడో దీపం — దీపం వెలుగు — ప్రకాశవంతమౌతున్నట్లైంది.

నిముషాల తర్వాత అన్నాడు, ఉమాపతి — ''రెండేళ్ల నుంచీ పొలంమీద ఫలసాయం లెక్క కట్టివుంచాము ఇదిగో ఇదంతా మీది ఇవి మీ భూమి తాలూకు డాక్యుమెంట్స్'' రెండు కవర్లు నా చేతిలో వుంచేడు.

జరిగిందీ, జరుగుతున్నదీ ఏమిటో నాకు తెలియడం లేదు

''ఇదంతా మీ మరదలి నిర్ణయం కాదని మాకు మనస్తాపం కలిగించరనే నమ్మకం వదినా, నీకూ ఇదే నా మాట''

ఛాయస్ లేని ప్రశ్నాపత్రం అందుకుని, పరీక్ష హాల్లో దిక్కులు చూస్తున్న విద్యార్థి పరిస్థితిలా వుంది — నా అవస్థ!

అమ్మ కళ్ల ముందు నిలిచింది — ఆనాటి నా నిర్ణయానికి వెన్నెముక!

సుందరి ఎదురుగా నిలబడివుంది—ఈనాటి ఉమాపతి నిశ్చయానికి ప్రాతిపదిక!

ఎప్పుడో చదివిన వాక్యం గుర్తొచ్చింది, 'ప్రపంచంలో పురుషుడు సాధించిన ప్రతి మంచి పని వెనుకా ఒక స్త్రీ సహకారం, త్యాగం, సహనం ఇమిడివున్నై' అవును —

అందుకనే ఉగాదులు నా గుండెల్లో అమృతపు చినుకులు కురుస్తై!! ★



ఎందుకంటే ఫారెక్స్ పాపాయిల సత్వరమైన మరియు సంపూర్ణమైన పెరుగుదల కోసం అధిక పుష్టికరమైన ఘన ఆహారం.

మీ పాపాయి పెరుగుదల కోసం ప్రొటీన్‌తో సమృద్ధమైనది ఫారెక్స్

ప్రొటీన్ కొరత నుండి పాపాయిని రక్షించడానికి బ్రాండ్ చేయబడిన ఘన ఆహారంలోని ప్రొటీన్ పరిమాణం మరియు ఘన ఆహారం తయారు చేసి ఇచ్చే తీరుకు సంబంధించిన కొన్ని ప్రమాణాలను విశ్వ ఆరోగ్య సంస్థ నిర్ధారించినది. నిర్దేశించిన రీతిలో ఫారెక్స్ ఘన ఆహారం తయారు చేసి ఇస్తే అది మీ పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రొటీన్‌ను సమృద్ధంగా కల్గి వుంటుంది.

ఆరోగ్యవంతమైన రక్తం కోసం అదనంగా ఐరన్ కల్గి వున్నది ఫారెక్స్

"తల్లి నుంచి పెద్ద ఐరన్ నిల్వతో సహా పుడతాడు పాపాయి. అయితే పుట్టిన తర్వాత ఈ నిల్వ క్రమేపీ తరిగి పోతుంది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు అందుకే పాపాయికి ఐరన్ గల ఆహారాలు కావాలి."

—డా. సుభాష్ సి. ఆర్య.

పాపాయి రక్తానికి, రోగ-ప్రతి రోధక శక్తిని ఎక్కువ చేయడానికి, అతి సామాన్య ఆరోగ్యం మరియు పెరుగుదల కోసం అత్యంత ముఖ్యమైన ఐరన్ అదనంగా కల్గి వున్నది ఫారెక్స్.

పాపాయి పళ్లు మరియు ఎముకలకు అతి ముఖ్యమైన కాల్షియం మరియు ఫాస్ఫరస్ సరియైన నిష్పత్తిలో కల్గి వున్నది ఫారెక్స్

పళ్లు మరియు ఎముకలు చక్కగా ఏర్పడటానికి మీ పాపాయికి కావాలి కాల్షియం మరియు ఫాస్ఫరస్. కాని, 2:1—ఈ నిష్పత్తిలో ఈ రెండూ కలిసి వుంటేనే పాపాయికి ఎక్కువ లాభం చేకూరుతుంది. ఈ అత్యావశ్యక తత్వములను ఆదర్శ ప్రాయమైన నిష్పత్తిలో కల్గి వున్నది ఫారెక్స్. అది మీ పాపాయి ఎక్కువ ఆరోగ్యవంతమైన ఎముకలు మరియు ఎక్కువ దృఢమైన పళ్లు నిశ్చయంగా పొందేలా చేస్తుంది.

ఎంతో సులభంగా జీర్ణమవుతుంది ఫారెక్స్

మీ పాపాయి సున్నితమైన జీర్ణ శక్తికి అనువుగా ప్రత్యేకంగా ముందుగానే పచనం చేయబడినది ఫారెక్స్.





డాక్టర్లు సిఫార్సు చేస్తారు

ఫారెక్స్®

గ్లాక్సో ఉత్పాదన

CASGLF-40-244 TEL

ఆదర్శ దర్శనీయకేంద్రం పుట్టపర్తి తపోవనం




శ్రీ సత్య సాయిబాబా

పుట్టపర్తి అనంతపురం నుంచి 50 కి.మీ. దూరంలోఉంది. కొన్ని ఏళ్ల క్రితం అదొక పల్లెటూరు. బొత్తిగా ఊరూ పేరూ లేనిది. అయితే సత్యసాయిబాబా చలువవల్ల అదొక మనోహర తపోవనమై మధురానుభవాన్ని పంచుతోంది. అనామకంగాఉన్న ఒక సాధారణ కుగ్రామం సకల కళాకేంద్రమై విద్యానిలయమై ఆధ్యాత్మిక ఋష్యాశ్రమమై విశ్వవ్యాప్తంగా ఆదర్శ ప్రాయమై అలరారుతున్నదంటే అది సామాన్య మైన విషయంకాదు. రెండు మూడు దశాబ్దాల నుంచి పుట్టపర్తి పేరు ప్రజలనోట నానుతోంది. ప్రపంచ పర్యంతమూ నేడు ప్రశాంతి నిలయంగా సత్యసాయీ నివాసకేంద్రంగా ఎంతగానో మన్నన లందుకొంటోంది. దేశ విదేశీయులు ఎంతో మంది రోజూ వస్తూ ఉంటారు. మహిమలు చూపే స్వామిగా మాత్రమే సత్యసాయిబాబాకు స్థానం లేదు. ఆత్మజ్ఞానాన్ని జీర్ణించుకొన్న గొప్ప మేధావి ఆయన. కారుణ్యానికి మారు పేరాయన. సకల మానవ సమానతకు సజీవ రూపమతడు. ప్రాక్ పశ్చిమ దేశాల విద్యా ప్రబంధాల్ని ఆయన చదవకపోయినా, అత్యున్నత మైన డిగ్రీలు ఆయనకు లేకపోయినా, మనిషిని మనిషిగా చూచే గొప్ప లక్షణం అతనిలో ఉంది. అందుకే అతడు మహనీయుడు. మహిమలు అశాస్త్రీయమని, బూటకమని అనడం మూర్ఖత్వం. కళ్లెదుట కనిపిస్తున్న ఆధారాలను కాదని, వివరించే శక్తి లేనంతమాత్రాన మోసమని అనడం హేతువాదం కాదు. నిస్సంశయంగా అది మూర్ఖత్వం. సమాజ హితైష కార్యక్రమాలెన్నింటికో ఊపిరిపోస్తూ మానవ సేవే మాధవసేవ అని స్పష్టంగా నమ్మి అన్ని రకాలవారినీ సమాదరించే వ్యక్తి మహార్షే!

కరువు కాటకాలతో తాండవించే పుట్టపర్తి నేడు స్వామి చలువవల్ల యాత్రాస్థలమైంది. ప్రకృతి విహార కేంద్రమైంది. ఒక నిర్దుష్ట మైన పథకాన్ని అనుసరించి రూపొందిన ప్రశాంతి నిలయం అలనాటి రామ పర్ణశాలలో నెలకొన్న నైర్మల్యాన్ని అందిస్తుంది. ఎంతో మనశ్శాంతిని మహాహ్లాదమైన సౌఖ్యాన్ని చేరవేస్తుంది. క్రమశిక్షణ, సంఘీభావంతో కూడుకొన్న ఆ ఆశ్రమ జీవితం ఎంతో హాయిని గొలుపుతుంది. అన్నపానాదులు మొదలుకొని నిత్యం దైనందిన కార్యక్రమాలన్నీ ఒక క్రమపద్ధతిలో కొనసాగించే ఆ జీవనం ఆదర్శవంతమై మార్గదర్శకంగా ఉంటుంది. ఎన్నో దేశాలవారు ఎన్నో జాతులవారు సహపంక్తిలో కూర్చొని భుజించడం, విశ్వవ్యాప్తంగా ఉన్న అతి సున్నితమైన మానవ ప్రవృత్తి ఎంత ఉదారమైనదో, ఎంత విశాలమైనదో విదితమౌతుంది. స్త్రీపురుషులు వేరువేరుగా ఉండి ఆశ్రమ జీవితం గడపడం నియతికీ నిర్దుష్టతకూ తార్కాణం. స్త్రీని గౌరవించాలన్న ప్రతిపాదనకు ఆచరణ రూపం.

నియమబద్ధమైన ఆ జీవితం సత్ఫలితాన్నే ఇస్తుంది. అక్కడ మతాల భేదం లేదు. కులాల ప్రసక్తి రాదు. అందరిదీ మానవజాతి. అందరికీ ఒకడే దేవుడు. బౌద్ధులు, జైనులు, హైందవులు, మహమ్మదీయులు,కిరస్తానీయులు, జోరాస్ట్రియన్‌లు అందరూ ఉన్నారు. ఎవరి దేవుణ్ణి వారు కొలుచుకోవచ్చు. అన్ని మతాలూ అన్ని మతసారాలూ ఒక్కటేనన్న సత్యాన్ని ఒక ధర్మ స్తంభం తెలియజేస్తూ ఉంటుంది. ప్రేమ రాహిత్య స్వార్థ జీవితం వ్యర్థమని నిస్వార్థంతో నిండుకొన్న ప్రేమమయమైన జీవితమే పరమాత్ముని ఆశయమని స్పష్టంచేసే ఎన్నో శిలాఫలకాలు కళామతల్లి విశ్వ స్వరూప మనదగిన భజన మందిరం చుట్టూ ఉన్నాయి. సత్యం, ప్రేమ, జ్ఞానం, శాంతి, భక్తి, యోగ్య జీవితం మానవజన్మకు సాఫల్యతను చేకూరుస్తాయని సాయీ ప్రబోధం. ఎందరో ప్రవక్తలున్నారు. ఎవరికివారు వారి వారి మతాలే

పుట్టపర్తి ఆశ్రమ దృశ్యం



శ్రేష్ఠమైనవని అన్నారు. కాని అన్ని మతాలూ ఒకటే, అందరి దేవుళ్ళూ ఒకరేనని తెలియజెప్పిన అవధూతలు ఏ కొందరో ఉన్నారు. అట్టివారిలో సాయిబాబా ఒకడు కావడం మన భారతదేశం చేసుకొన్న అదృష్టం. ఎన్నోఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగే పూర్ణచంద్ర ఆడిటోరియమ్ భారతీయ కళానైపుణ్యానికి, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక. భాషా భేదం లేదు. వేషధారణపై ఆంక్షలులేవు. ఎంత విశాల దృక్పథం! సనాతన ధర్మదేవత అంతర్యమిదే కదా! భారతీయ పరమావధూతల అంతరం అంతేకదా! ప్రపంచ జాతుల్లో ఏ జాతికీ లేనంత భావ వికాసం హృదయాగత నివేశం మన భారత జాతికుండడం గర్వకారణం. భాగ్యోదయ జగత్తులో మన జాతి చరిత్ర మకుటాయమానం కావాలి. దుష్టనీచ భావాలకు స్వస్తి చెప్పాలి.


పుట్టపర్తి ధర్మబోధనలకే పరిమితం కాలేదు. అదొక ప్రముఖ విద్యా కేంద్రం కూడ! అత్యున్నత విద్యను ప్రసాదించే సత్యసాయి విశ్వవిద్యాలయమక్కడే ఉంది. పరిశోధనలకు అనువైన వాతావరణం కూడ నెలకొని ఉంది. రసాయనిక శాస్త్రంలో జీవరసాయనాన్ని వడబోస్తారు. భౌతికశాస్త్రంలో అధి భౌతిక మానవ దృక్పథాన్ని వివరిస్తారు. వృక్షశాస్త్రంలో జీవులకు ప్రకృతికీ మధ్యనున్న స్వారస్యాన్ని ఏకోదర సంబంధ బాంధవ్యాన్ని స్పష్ట పరుస్తారు. జంతుశాస్త్రంలో మనుష్యులకు జంతువులకూ ఉన్న అభేదాన్ని వ్యక్తపరుస్తూనే మనిషి జన్మకున్న ఉత్కృష్టతను విశిష్టతను ప్రకటిస్తారు. ఆర్థికశాస్త్రమే కాదు హార్దిక శాస్త్రాన్ని కూడ ప్రబోధిస్తారు. మానవ శాస్త్రమే కాదు మానవతాశాస్త్రాన్ని కూడ తేటతెల్లపరుస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే అలనాటి గురుకులాన్ని జ్ఞప్తికి తెస్తుంది. గురు శిష్యుల మధ్యకూడ ఎంతో అతీతమైన అనుబంధం ఉంటుంది. ముఠా తగాదాలు, కలుషిత రాజకీయాలు ఇక్కడ కనిపించవు. విద్యార్థులలో అస్థిరత, అశాంతి అన్న పదాలకు ఇక్కడ తావులేదు. ఇక్కడి విద్యాలయం ఒక దేవాలయం. కళాభారతి వారి ఆరాధ్య దైవం. దీనికి తార్కాణగా సత్యసాయి విశ్వవిద్యాలయ భవన ప్రాంగణంపై తీర్చి దిద్దబడిన వీణాపాణి, విశ్వజనీన మానవ అంతర్వాణి ఉన్నది. ప్రాచీన భారతంలోని ఋష్యాశ్రమాల మాదిరే ఇక్కడ కూడ మనుష్యులతో పాటు పశుపక్ష్యాదులు కూడ విహరిస్తూ ఉంటాయి. సౌహార్దత, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తూ ఉంటుంది. విద్యాలయ ఆవరణలోనే సారంగాలు పరుగులు పెడుతూ ఉంటాయి. వీటి కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించినారు. నెమళ్ళు, చిలుకలు మొదలుకొని ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు ఉపకరించే కుందేళ్ళు, గినీ దేశపు పందుల (ఇవి ఎంతో ముచ్చటగా ఉంటాయి!) వరకు ఉన్నాయి. నరజన్మకు మోక్షమిచ్చిన వానరాలు కూడ ఉన్నాయి. ఇవి చూపరుల నెంతగానో ఆకర్షిస్తూ ఉంటాయి. పరిపాలనా భవనం సమ్మోహనాస్త్రమే!


ఇలా అనామకంగా ఉన్న పుట్టపర్తి సకల కళారసస్ఫూర్తి కావడం దైవానుగ్రహమే. దీనికి మూలకారకుడు సత్యసాయిబాబా అన్నది నిర్వివాదాంశం. ఈ మహామనీషికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. లక్షల సంఖ్యలో భక్తులున్నారు కేవలం భక్తులు దానమిచ్చిన వాటితోనే పుట్టపర్తిని కళాకేంద్రంగా, విద్యాకేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా మలచడం ఎంతో గొప్ప విషయం. ఇంతే కాదు దేశవ్యాప్తంగా సత్యసాయి




అధ్యాత్మిక రససాగరంలో ఓలలాడే సాయీ భజన మందిరం

సత్య సాయీ సారంగోద్యానవనం







యోగ్య జీవితానికి మార్గదర్శికలు


.... పుట్టపర్తి

సేవా కేంద్రాలు, విద్యాకేంద్రాలు ఎన్నో ఉన్నాయి అనంతపురంలో మహిళలకు ప్రత్యేకంగా ఉన్నత విద్యానిలయముంది. ఇలా అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తి మహాపురుషుడు కాక మరేవౌతాడు? అతని వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ఎంతగా దుష్ప్రచారం చేసినా, ఆయన చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలను ఎవరూ మరచిపోరు. మంచిని, చిత్తశుద్ధిని, సేవాతత్పరతను, కార్యదక్షతను గుర్తించే ప్రజల హృదయాల్లో సత్యసాయి స్థానం పదిలం. ఆయన మూలకంగా వెలుగులోకి వచ్చిన పుటపర్తి భావి తరాల వారికి తరగిపోని వారసత్వపు సంపద. అది శాశ్వతం. ఆ విధంగా సత్యసాయిబాబా చిరంజీవి. ఆయనకు నివాళి అర్పించడం మన కనీసపు బాధ్యత

— డా॥ గుమ్మనూరు రమేష్ బాబు *

చూపరులపాలిట సమ్మోహనాస్త్రం
విశ్వవిద్యాలయ పరిపాలనాభవనం





daCunha/GCM/76/TL/82



(గత సంచిక తరువాయి)

పద్మగంధి నిర్విణ్ణురాలయింది. తన కుమార్తెతో మనసు విప్పి మాట్లాడు కోవాలన్న ఆమె ఆకాంక్ష తీరలేదు. అది యిక తీరుతుందన్న ఆశ యిక యీ జన్మలో లేదన్న విషయం కూడ తేలిపోయింది. తన స్థితి ఏమిటో తాను చేయవలసింది ఏమిటో అర్థం కాక అలాగే రాపడి నిలచిపోయింది పద్మగంధి.

ఏకవీర తన స్వామితో విహరిస్తూ ముచ్చటిస్తోంది.

"స్వామీ ఏమిటిది ?"

"ఏకవీరా యిది జన్మ బంధం."

"యిలా ఎందుకు కల్పించేవు ?"

"నీవు జీవివి కనుక. జీవికి చావు పుట్టుకలు తప్పవు. పుట్టుక ఉన్న ప్రతి వస్తువుకూ ఒక మాతృ స్థానం ఉంటుంది. అది అన్నిటికన్న పవిత్రమయినది. సృష్టిలో మరపురాని తీయదనం అది."

"దాని పేరే అమ్మ కదూ! అద్భుతమయివ బంధాన్ని కల్పన చేసేవయ్యా." మధురంగా నవ్వేడు స్వామి. ఏకవీర ఆ నవ్వులోని మాధుర్యాని ఆస్వాదించి పదేపదే తన్మయురాలు అయింది.

"యిప్పుడు నా కర్తవ్యం ఏమిటి స్వామీ ! యీ 'అమ్మ'ను నేనేమి చేసుకోను. నాకు అమ్మ అయినా, నాన్న అయినా, ప్రియుడు అయినా, సోదరుడు అయినా అన్నీ నీవే కదూ !"

"అన్నీ నేనే అయినా అమ్మ స్థానం అమ్మది."

"అది నీకన్నా మధురమయినదా ?"

"చెప్పేను కదా ! సృష్టిలో తీయనిది."

"మరి నీవు కూడ యీ తీయదనం ఆస్వాదించేవా ?"

స్వామి మళ్ళీ మధురంగా నవ్వేడు.

"ఏకవీరా ! నీవు ఎరుగవా ? నేను సృష్టికి అతీతుడను కానా ? ఈ సృష్టికి సృష్టికర్తను. పాలకుడను. లయకర్తను."

"అయితే ఆ 'అమ్మ'ను, ఆ మాధుర్యాన్ని, ఆస్వాదించవలసిన 'కాను' అనే దాన్ని, అన్నింటినీ నీవే సృష్టించావన్నమాట ! యిదంతా నీకు ఆటగా ఉన్నది కదూ !"

"సత్యమే చెప్పావు ఏకవీరా ! యీ సృష్టి యావత్తూ నా క్రీడా వినోదమే. కాని అర్థవంతమయినది. అర్థరహితమయినది కాదు."

"కాని నన్ను ఆ క్రీడకు దూరంగా లాగుతున్నావు ఎందుకూ !"

"అమ్మదొంగా ! గొప్ప అభియోగమే చేశావు. నేనేమీ ఎరుగను సుమా" అన్నారు స్వామి.

"స్వామీ ! యిదివరలో తాతగారిని చూస్తే ఏదో ఆత్మీయత నన్ను వివశురాల్ని చేసేది. యిప్పుడా అనుభూతి నుండి పారిపోవాలనీ, యీ జీవితంలోని ప్రతి క్షణాన్నీ నీతో గడపాలనీ మనసు ఉవ్విళ్ళూరుతోంది. అమ్మ అనే శబ్దం విన్నప్పుడు కూడ నాకు కలగవలసిన పులకింత, ఆ స్వైమరపు కలుగలేదు. నీ జ్ఞాపకాల మాధుర్యం ముందు అది కూడ అల్పమే అనిపిస్తోంది. యిలా ఎందుకు జరుగుతోంది."

"ఏకవీరా ! నీ జన్మకు ఒక పరమార్థం ఉన్నది. అందుకే ఇలా జరుగుతోంది" అన్నారు స్వామి.

"ఏమిటి స్వామీ అది. నేనేమి చేయాలి"

"ధర్మప్రతిష్ఠాపన. సమయం వచ్చినప్పుడు వివరిస్తాను" అంటూ అదృశ్యమయ్యేరు స్వామి.

కాస్సేపు ఆ తన్మయత్వంలో మునిగి ఆ తరువాత కనులువిప్పి ఎదురుగాఉన్న పద్మగంధిని చూచింది ఏకవీర. పద్మగంధి సంతోషంతో పొంగిపోయింది.

"అమ్మా ! నన్ను గుర్తించేవా ?" అన్నది పద్మగంధి.

"నీవు నాకు యీ జన్మ యిచ్చిన తల్లివి" అన్నది నిర్లిప్తంగా.

"నేను పాపంచేసి నిన్ను కన్నాను తల్లీ ! నన్ను క్షమించగలవా ?"

"పాపపుణ్యాలకు సరిహద్దు ఎక్కడ ?" అంటూ ప్రశ్నించింది ఏకవీర. ఆమె మాటలు వినాలన్న తాపత్రయమేకాని, అర్థాలు వివరించ గల పాండిత్యం పద్మగంధికి ఎక్కడిది ?

"అయితే నన్ను క్షమించేవా తల్లీ."

"క్షమ ! క్షమ అనే రెండక్షరాలు నీ మాతృస్థానాన్ని పదిలపర్చగలిగితే, ఆ రెండక్షరాలనూ నేను నీకు సునాయాసంగానే యివ్వగలను కాని జరగవలసింది అదికాదమ్మా. నీకు కలిగిన పశ్చాత్తాపమే నీ పాపాన్ని క్షమించగలదు. కడిగివేయగలదు." అన్నది ఏకవీర.

ఆమె మాటలు పద్మగంధికి స్వైమరపు కలిగిస్తున్నాయి.

"అమ్మా ఏకవీరా ! నీతో ఒక విషయం చెప్పాలి. తల్లిగా అది నా బాధ్యతమనుకుంటున్నాను" అన్నది పద్మగంధి.

జరిగిన కథ — 11 : పద్మగంధి ఒక బిక్షకత్తె వేషంతో ఓరుగల్లులోని ఒక పాంథశాలకి చేరుతుంది. తను, పరదేశి కలసి గోపాల దేవునికి బుద్ధి చెప్పాలనుకుంటుంది. త్రిపురాంతకుడు గోపాలదేవునికి బాగ బుద్ధి చెపుతాడు. ఆహవమల్లు జైనస్వామి ఆదేశానుసారం జైన సభలు ప్రారంభించను ఏర్పాట్లు చేయడ నికి మొగలిచెర్లలో విడిది చేస్తాడు. మొగలిచెర్లలో ఏ హరిజనుడు ఏకవీరదేవి ఆలయానికి వెళ్ళరాదని ఆజ్ఞ జారిచేస్తాడు వెంకన్నదొర. గోపాలదేవునికి స్పృహ పోగొట్టి పద్మగంధితో పాలంపాట చెర్వుకి బయలుదేరాడు త్రిపురాంతకుడు. వారిద్దరు రామప్ప ఆలయంలో జైనస్వామిని కలుస్తారు. జైనస్వామి పద్మగంధిని గుర్తిస్తాడు. ఏకవీర ఏడుకొండలవాడే తన సర్వస్వం అని భావించడం చూచి శ్రీదేవుని మనసు వికలమైంది. శ్రీదేవుడు స్వామిని నిందించగా ఏకవీర శ్రీదేవుడ్ని గాయ పరుస్తుంది. జైనస్వామి పద్మగంధిని జైనం స్వీకరించమని కోరగా తిరస్కరిస్తుంది. త్రిపురాంతకుడు తన ఛురికను వసంతునిపై విసిరి పద్మగంధితో పారిపోతాడు. పద్మగంధిని కాపాడే బాధ్యత తనపై ఉందని భావిస్తాడు త్రిపురాంతకుడు. ఏకవీర తాను దర్శించిన ఆ స్వామి రూపును మహాదేవుడికి వర్ణించి చెపుతుంది. పద్మగంధి వెంకన్నదొర ఇంటికి వస్తుంది. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో తన కూతురు బలిగాకుండా కాపాడుకోడానికై ఆమె జన్మ రహస్యం వెంకన్నదొరకు చెపుతుంది. అది విని ఆశ్చర్యపోతాడు వెంకన్నదొర. ఏకవీర కృష్ణస్వామి, పద్మగంధిలకు జన్మించిన పుత్రిక అని హరిజనులతో అబద్ధం చెపుతాడు. ఈ సంగతి తెలుసుకొని కృష్ణస్వామి విచారపడి పద్మగంధిని పిలిపించి ఆమె కూతురుని ఆమె కప్పగిస్తాడు.

"ఏమిటది ?"

"రానున్న హిందూ జైన కురుక్షేత్రంలో నిన్ను ఒక పావుగా బలి యిచ్చేందుకు కుట్ర జరుగుతోంది. నిన్ను కాపాడుకోవాలన్న స్వార్థంతోనే నేను యింత అలజడిని సృష్టించేను."

"అమ్మా ! ఎంత అమాయకురాలివి నువ్వు. విధి ఎటులాగితే అటు పరుగెట్టే జీవితాలు మనవి. నీవు చేయగలిగింది అంటూ ఏమీ వుండదు. మన జీవితాలను రక్షించినా, శిక్షించినా అది మానవతాతీతమయిన శక్తివల్లనే



జరుగుతుంది. అహంకారమనే పొరలు నిజాన్ని చూడనీయవు. ఆ అహంకారాన్ని స్వామికి సమర్పించు. జీవితమంటే ఏమిటో నీకు బోధ పడుతుంది. అప్పుడిహ యీ లాలసలకు తావు లేదు. లాలసలేనిచోట, స్వార్థంలేని చోట దుఃఖానికి తావులేదు. అదే ఆనందమయలోకం" అంటూ పద్మగంధికి మార్గం నిర్దేశించింది ఏకవీర. శ్రద్ధగా ఆమె మాటలను వింటున్న పద్మగంధికి తనచుట్టూ ఏదో వెలుగు ప్రజ్వరిల్లుతున్నట్లుగా అనుభూతి కలుగుతోంది. ఆమెకు ధైర్యం కలిగింది.

"అమ్మా నీవు నా కుమార్తెవే అయినా దేవతవు. స్వామి యీ లోకానికి ప్రసాదించిన వరానివి. నీవు నిర్దేశించిన మార్గం లోకానికి వెలుగుబాట తల్లీ ! నా కర్తవ్యం నాకు బోధపడింది. యిప్పుడు నిన్ను నా కుమార్తెగా ప్రేమించటంకాదు – గురువుగా పూజిస్తాను" అంటూ కన్నకూతురు పాదాలకు ప్రణమిల్లింది ఆ పిచ్చితల్లి.

తిరుచరణాలు

సృష్టిలో అసాధ్యమంటూ ఏదీ లేదని నిరూపించిన దైవం బహుశా మౌనంగా యీ దృశ్యాన్నిచూచి నవ్వుకుని ఉంటాడు.

కాలపేటికలో, చరిత్ర పుటల్లో యీ అద్భుతమయిన సత్యం దాగింది. కన్నకూతురు ఔన్నత్యానికి తలవొంచి, ఆమె పాదాలకు నమస్కరించి లేచిన ఆ పిచ్చితల్లి మనసులో అనుమానాలన్నీ క్షాళనమయ్యాయి.

తన డబ్బువల్లా, తను పడే ఆరాటంవల్లా రక్షణపొందే స్థాయిని దాటి తన బిడ్డ మహోన్నతంగా ఎదిగిపోయిందన్న విషయం ఆమెకు బోధపడింది. ఇక జైనస్వామి రాకకు ఎదురుచూడవలసిన అవసరం ఉన్నదనికూడ ఆమెకు అనిపించలేదు.

"అమ్మా నాకు శలవు. నీవు నా గర్భవాసాన జన్మించావు. కాని నాకన్న చాల గొప్పగా ఎదిగి పోయావు. సాక్షాత్తు స్వామి పాదాలకు అర్పించేందుకు వికసించిన కుసుమానివి నీవు. నేను ధూళి దూసరితమైన వ్యర్థ కుసుమాన్ని. యిక యీ జీవితంలో ఆశించవలసిందీ, ఎదురు చూడవలసిందీ ఏమీలేదు తల్లీ ! నేను వెళ్ళిపోతున్నాను" అన్నది పద్మగంధి చివరిసారిగా కుమార్తె వద్ద శలవు తీసుకుంటూ.

"అమ్మా నీవు ఎక్కడకు పోతున్నావు ?"

"ఇక నేను ఎక్కడకు పోయినా ఒకటే తల్లీ ! యీ పృథ్వి మొత్తం భగవంతుని ఆరామమని నీవు నాకు బోధించావు. ఎక్కడున్నా నన్నీ విషయాన్ని గురించి ఆలోచించుకోవలసిన అవసరం నాకు రాకుండా చేశావు. నా కళ్ళు తెరిపిడిపడ్డాయి. కాళ్ళు ఎటు నడిపిస్తే అటు పోతాను. నీవు యీ ఆశ్రమంలోనే ఉండు. స్వామి సేవలతో నీ జీవితాన్ని పునీతం చేసుకో తల్లీ" అంటూ ముందుకు నడిచింది పద్మగంధి. ఏకవీర ఆమె నిష్క్రమించేవరకూ అక్కడే నిలబడి చూచింది. కన్నతల్లి కనుమరుగు అవుతూంటే ఆమెకు స్వామి మాటలు గుర్తుకువొచ్చేయి.

"పుట్టుక పున్న ప్రతి వస్తువుకూ ఒక మాతృస్థానం ఉంటుంది. అది అన్నిటికన్న పవిత్రమయినది. సృష్టిలో మరపురాని తీయదనం అది."

ఏకవీర నేత్రాలు సజలాలు అయ్యాయి. ఆ కన్నీటి పొరలమధ్య తల్లి దూరమై అదృశ్యమైపోవటం ఆమె గమనించనేలేదు.

ఆమె ఆశ్రమంలోకి వెళ్ళేసరికి అక్కడంతా పెద్ద గుంపుగాచేరి ఉన్నారు. వారంతా మొగిలిచర్ల పురజనులే. వారందరికీ ముందు పండితులు నిలిచి ఉన్నారు. కృష్ణస్వామి వారికి అభిముఖంగా నిలిచి ఉన్నారు. వారి ముఖాల్లో ఏదో ఉద్వేగం, ఆవేశం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. కృష్ణస్వామి ముఖంలో ఆవేదన.

"మీరు యింతగా దిగజారుతారని మొగిలిచర్లలో ఎవరూ అనుకోలేదు. మీకు గురుస్థానం యిచ్చి గౌరవించాము. ఒక వేశ్యా పుత్రికను తెచ్చి ఆశ్రమాన్ని అపవిత్రం చేశారు. ఆమెకు తండ్రి మీరు కాదన్న విషయం రుజువు అయ్యే వరకూ యీ యజ్ఞానికి కర్త మీరు అయ్యే వీలులేదు" అని వాదిస్తున్నాడు పశుపతి. ఆయనకు వంత పాడటం ప్రారంభించేడు మహాదేవుడు.

కృష్ణస్వామి హృదయం వ్యధాకలయింది. తనమీద అభాండం వేసినందుకు కాదు. యజ్ఞానికి విఘ్నం కలుగుతోందని ఆయన ఆవేదన.

"దీనికి మీరిచ్చే సమాధానం ఏమిటి ?" పశుపతి అరిచేడు కోపంతో ఊగిపోతూ. ప్రజలంతా కృష్ణస్వామి సమాధానంకోసం ఎదురు చూడసాగేరు.


మహాదేవునికి యీ విషయంలో నమ్మకం లేదు. కాని ఒక హార్త సాక్కి అది ఊరంతా పాకింది. యిప్పుడు మంచి అయినా, చెడుఅయినా సమాధానం చెప్పుకోవలసిన అవసరం కృష్ణస్వామికి ఏర్పడింది ఆయన సమాధానం యిచ్చే వరకూ ఏ నిర్ణయానికీ రావటానికి వీలులేదని తలపోశారాయన.


అందరి అరుపులూ అయ్యేక కృష్ణస్వామి మౌనానికి స్వస్తిచెప్పి మాట్లాడటం ప్రారంభించేరు.

"అసత్యానికి ఆకర్షణ అధికం. అది లోకరీతి. దాని ఆకర్షణ వల్లనే అది అధికమయిన ప్రాచుర్యం పొందుతుంది. కాని యీ లోకంలో అది ఎక్కువకాలం నిలువలేదు. కారణం దానికి పునాది లేకపోవటమే ! ఒక వేళ వెంకన్నదొరచేసిన అభియోగం యధార్థమే అయితే— నేను మీరు విధించే శిక్షకు బాధ్యుడను కాగలను. కాని మీరంగరూ ఒక విషయం ఆలోచించాలి.

వచ్చే పౌర్ణమినాటికి యజ్ఞం పరిసమాప్తి కావాలి. పూర్ణాహుతి జరిగేసమయానికి రాణీ రుద్రాంబ యిక్కడకు విచ్చేస్తారు. రాజ్యంలో జరిగే మంచి చెడుల్లో రాజులకు భాగస్వామ్యం ఉంటుంది. కాబట్టి శిక్షించే అధికారం వారికుటుంది. వారే దీని విషయంలో సత్యాసత్యాలను తేల్చగల సమర్థులు.

కాబట్టి అంతవరకూ మీరు ఓపికపట్టండి ఈ లోగా మీరు త్వరపడితే యజ్ఞానికి విఘ్నమవుతుంది. ఆ తరువాత అభియోగం అసత్యమని తేలినా ఓటమి మన పక్షానే ఉంటుంది. ఇది చాల చిక్కు సమస్య. మీరు జాగ్రత్తగా ఆలోచించాలి" అన్నారు కృష్ణస్వామి. అది చాల మందికి చక్కని దారి అనిపించింది. కాని పశుపతి మహా ఆవేశంతో ఉన్నాడు. ధర్మహాని జరిగిందన్న ఆలోచనవల్లనే ఆయనకు అంత ఆవేశం కలిగింది. అందువల్ల కృష్ణస్వామి దృష్టిలో పశుపతి ఇంకా





గొప్పవాడే అయ్యేడు. కాని కేవలం ఆవేశ పరుడు అని పించలేదు.

"యీ యజ్ఞమే జరిగితే అగ్నికూడ అపవిత్ర మవుతుంది. ముందు మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి..." అంటూ ఏదో చెప్ప బోయేడు పశుపతి.

"అక్కరలేదు ..." అంటూ ఒక గంభీర మయిన కంఠం వినిపించింది. ఆ మాట అన్నది సమున్నత కాయుడయిన మధ్య వయస్కుడు. అతడు అప్పుడే ఆశ్రమంలోకి ప్రవేశించాడు. అతడు మొగిలిచర్ల నివాసికాడు. ఓరుగల్లు నివాసి.

అందరూ అతడికేసి గ్రుచ్చి చూడసాగేరు. అతడు వొచ్చి కృష్ణస్వామి పాదాలనుతాకి ఆయన ప్రక్క నిలబడి అన్నాడు.

"మీలో కొందరికి తెలియకపోవచ్చు. నా పేరు త్రిపురాంతక దేవుడు. నేను ప్రభుత్వో ద్యోగిని" అన్నాడు.

"అయితే యిప్పుడు నీవు చెప్పవచ్చింది ఏమిటి ?" ప్రశ్నించేడు పశుపతి కంఠంలో మార్దవాన్ని కనిపించనీయకుండా.

"అగ్నికి సైతం అపవిత్రతను అంటగట్టే మీకు నేను చెప్పగలిగిన సలహా అంటూ ఏమీ లేదు. కాని నేను అదృష్టవశాత్తూ ఒకప్పుడు ఒక దృశ్యాన్ని చూచాను. యిప్పుడు యీ సమయంలో మీరందరి సమక్షంలో ఆ దృశ్యాన్ని వివరించి చెప్పటం అవసరమని అనుకుంటు న్నాను" అంటూ పద్మగంధిని తాను ఓరుగల్లు పాంధశాలలో చూచినప్పటి నుండి తిరిగి మొగిలి చర్ల వచ్చేవరకూ జరిగింది అంతా పూసగ్రుచ్చి నట్లు వివరించించేడు త్రిపురాంతకుడు.

జనంలో వెంకన్నదొర మీద ఆగ్రహం వ్యక్తంకాసాగింది. ప్రజలను పక్కదారి మళ్లిం చేందుకు ఆయన కృష్ణస్వామి మీద చేసిన అభియోగం వారి కోపానికి కారణ మయింది.

పశుపతికి సంతోషం కలిగింది. ధర్మ చర్చ వచ్చినప్పుడు తాను ధర్మ పక్షాన నిలచి మాట్లాడి వుండవచ్చు. ఆ మాట్లాడింది కటువుగానూ వుండి వుండవచ్చు కాని తాను దైవసమానంగా భావించి పూజించే కృష్ణస్వామి వ్యక్తిత్వంమీద, పవిత్రత మీద క్రమ్మిన మేఘాలు మంచు మబ్బుల్లా విడిపోయేసరికి ఆయనకు సంతోష మయింది.

చివాలున వచ్చి కృష్ణస్వామి పాదాలను తాకి లేచేడు.

ప్రజలకు అభిముఖంగా తిరిగి ప్రసం గించేడు.

"యీ విషయం మీద తక్షణమే పంచాయతీ జరిపించి వెంకన్నదొర మీద మనం చర్య తీసుకోవాలి" అన్నాడాయన.

కృష్ణస్వామి అందుకు తన అసమ్మతిని వ్యక్తం చేసేడు.

"మనం ఎవరి మీదా ప్రతీకారం తీర్చుకో వలసిన అవసరంలేదు. నిజమనేది నిప్పువంటిది. అది ఎప్పటికయినా బయటపడి తీరుతుంది. మనకు కర్తవ్యం ముఖ్యం. యిప్పుడు మనం శాంతి యజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తిచేసుకోవలసి ఉంది.

యజ్ఞమంటే ఖర్మ. శాంతి యజ్ఞమంటే శాంతి కొరకు మనం చేస్సే కృషి. ప్రజా హృదయాలు శాంతికి నెలవులు కావాలి. అలా కావాలంటే ధర్మనిష్ట ఉండాలి. ధర్మాన్ని మలిషి పాటించాలంటె అతడు అన్నార్తుడు కాకుండా ఉండాలని మన హిందూ ధర్మం గుర్తించింది. అందుకే చెప్పారు. అన్నాద్భవతి భూతాని, పర్జన్యాదన్న సంభవః; యజ్ఞాద్భవతి పర్జన్యో; యజ్ఞం కర్మ సముద్భవః" అని. కర్మ వల్ల సృష్టిసుసంపన్న మవుతుంది. కర్మ అంటే యజ్ఞం. దీనివల్ల భగవంతుని సృష్టికి మనిషి సమగ్రతను తెచ్చిపెట్టుకున్నవాడు అవుతాడు. కాబట్టి యజ్ఞం అనేది ధార్మికం గానూ, లౌకికంగానూ కూడ చాల అవస్య ఆచర ణీయం.

యిక ముందుకూడ దీనికి అనేక విఘ్నాలు ఎదురుకావచ్చు. నాటిని మనం మన సత్యసంక ల్పంతో అధిగమించాలి. పురోగమించాలి. అలా అని మనం ఎవరికివారే హృదయంలో ప్రతిజ్ఞ చేసుకోవాలి." అంటూ ముగించేరు కృష్ణస్వామి

ప్రజాహృదయాలమీద ఆ మాటలు పన్నీటి జల్లులే అయ్యాయి. మొగిలిచర్ల గ్రామ ప్రజలకు ఒక విషయం స్పష్టమయింది కృష్ణస్వామి సంకల్పించిన శాంతి యజ్ఞం జరగ కుండా చూచేందుకు వెంకన్నదొర అడ్డదారులు త్రొక్కటానికి సిద్ధమయ్యేడు అని.

అందరూ ఎవరిదారిన వారు వెళ్ళిపోసాగేరు కొంతసేపటికి ఆ ప్రదేశంలో ఎవరూలేరు ఒక్క నారాయణతప్ప.

గ్రామ ప్రజలందర్నీ రెచ్చగొట్టి కృష్ణస్వామి మీదకు పంపే ప్రయత్నంలో వెంకన్నదొర నారాయణనుకూడ కృష్ణస్వామి సమక్షానికి పంపేడు. యీ కథ తన పక్షానికి సుఖాంత మవుతుందని భావించేడాయన. కాని అగింతుకంగా శ్రీకారం అవిఘ్న కారణమయింది అని అన్ని శాస్త్రాలూ పురాణాలూ శ్రీకారంతో ప్రారంభం అయినాయి. కాని గీత విషయం చూడావా? అలా కాదు. అది మన ధర్మానికి నిఘంటువు వంటింది. అది కూడ శ్రీకారంతోనే ప్రారంభం అయివుండవలసింది. కాని కృష్ణపరమాత్మ సంకల్పం వేరు. ఆయన ధర్మరక్షణకై అవతరిం చేడు. అందుకే తన గీతను "ధర్మక్షేత్రే కురుక్షేత్రే ......" అంటూ ధర్మనే శబ్దంతో ప్రారంభించేడు.

ధర్మనే శబ్దం శ్రీకారం కన్న మహత్తర మయింది నాయనా! అది లోకాలను కాపాడు తుంది. ఆ విషయాన్ని ధృవీకరిస్తూ పరమాత్మ మళ్ళీ చెప్పాడు. నీ స్వధర్మాన్ని నీవు ఆచరించమని. పరధర్మం ఎలాంటిదో తెలుసా! నీవు ఓరుగల్లు వెళ్ళవలసిన వాడివి దక్షిణ ముఖంగా బయలుదేరి వెళ్ళటం వంటిది. ఓరుగల్లు నీకు ఉత్తరాభి ముఖంగా ఉన్నది. దక్షిణంగా వెళ్ళి నీవు ఓరుగల్లు చేరగలవా? చేరలేవు. భూమి గుండ్రంగా ఉన్నది. కనుక చేరగలుగుతానని వాదించినా ఎప్పటికి చేర గలుగుతావు. ఒక జీవితకాలం చాలుతుందా!

ముక్తికి స్వధర్మమే అవశ్యంగా ఆచరించి

తిరుచరణాలు

యీ త్రిపురాంతకుడు వొచ్చి కథను యిలా అడ్డం త్రిప్పగలుగుతాడని ఊహించలేకపోయేడు.

అందువల్లనే అప్రమత్తుడై నారాయణను ఆయన సమిక్షానికి పంపేడు. నారాయణకు కృష్ణస్వామిని చూడందే ప్రొద్దుకూడా జరగదు. కాని యిటీవల పరిణామాలవల్ల అతడు కృష్ణస్వామికి దూరమయ్యేడు. యిప్పుడు యిదొక చక్కని అవకాశం అయింది.

నారాయణ హృదయం చంద్ర దర్శనంతో ఉప్పొంగే జలధిలా అయింది. అందరూ వెళ్ళిపోయేక కృష్ణస్వామి పాదాలకు అల్లుకుని కన్నీటితో అభిషేకించేడు. మనసులోని బరువు దించినట్లు అయింది.

"ఏమిటి నారాయణా యిది. లే. లేచి కళ్ళు తుడుచుకో."

"స్వామీ? మీరు నన్ను క్షమించేరా!"

"నారాయణా! నీవేమి తప్పుచేశావని?"

"మీమీద అవిశ్వాసంతో మలినపడ్డాను."

"అది నీ ఆంతరంగికమైన విశ్వాసం. ఆత్మను అమ్ముకొనమని హైందవం ఎన్నడూ ఎవరికీ చెప్పదు నాయనా!"

నారాయణ లేచేడు. కన్నీరు తుడుచుకుని లేచేడు.

"మీకు వెంకన్నదొర ఏదయినా అపకారం తలపెట్టగలడని భావించేను. అందువల్ల దారి తప్పేను. సంశయాత్మా వినశ్యతి అని గీతలో చెప్పేరుగా స్వామీ! నాకు అదేగతి పట్టింది."

"యిప్పుడు నీకు నమ్మకం కలిగిందా?"

"పరిపూర్ణమయిన విశ్వాసం హృదయమంతా నిండిపోయింది స్వామీ!"

"ఎలా?" అని ప్రశ్నించేరు కృష్ణస్వామి.

"యీ దృశ్యం చూచేక" అన్నాడు నారాయణ. ఆతని ఆంతర్యాన్ని ఊహిస్తూ మౌనం ధాల్చేరు కృష్ణస్వామి.

"స్వామీ! యధార్థానికి నేను యిప్పుడు యీ అపప్రథనుండి మీరు యింత సునాయాసంగా బయట పడగలుగుతారని అనుకోలేదు. కాని భగవంతుని అభయ ముద్ర మీమీద ఒక రక్షణ కవచాన్ని పరచింది" అంటూ తన సంతోషాన్ని వ్యక్తీకరించేడు.

"నాయనా! హిందూధర్మంలోని ఆత్మ అదే. ధర్మోరక్షతి రక్షితః। ధర్మమే రక్షిస్తుంది. ధర్మాన్ని మనం కాపాడుకోవాలి. ధర్మం మనలను కాపాడుతుంది. యిది అవినాభావ సంబంధం. మానవునికి ఎంత శక్తి ఉన్నదో అంతకు వేయింతల శక్తి ధర్మానికి ఉన్నది. హిందూ ధర్మానికిధాత అయిన శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన తత్త్వ గీత యిదే. సమస్త శాస్త్రాలు, అష్టాదశ పురాణాలూ అన్నీ శ్రీకారంతో ప్రారంభం అవుతాయి. అది శుభప్రదమయింది.

తీరవలసిన ధర్మం నాయనా!'' అంటూ తను చెప్పవలసిన ధర్మ ప్రసంగాన్ని ముగించేడు కృష్ణస్వామి.

చేతులు ముకుళించి వింటున్న నారాయణకు జన్మ పునీతమయినట్లు అనుభూతి కలిగింది.

''స్వామీ! అజ్ఞానంవల్ల నేను అధర్మానికి—అధర్మం అని తెలిసీ భయపడ్డాను. ధార్మికమయిన శక్తి సంపత్తును అర్థం చేసుకోవటంలో పొర పడ్డాను. అజ్ఞానిని. యిక వేయి శక్తులు అడ్డగించినా నన్ను నా ధర్మం నుండి తప్పించలేవు'' అంటూ ప్రతిజ్ఞ లాంటి ప్రసంగం చేసేడు నారాయణ.

కృష్ణస్వామి క్షణం కనులు మూసి అంతర్ముఖుడయ్యేడు. నా మీద వచ్చిన యీ అపప్రథ యిలా కొందరి ధర్మ దీక్ష దృఢతరమయేందుకు ఉపకరించిందా? యిదంతా నీ సంకల్పమే కదా స్వామీ! అంటూ అంతరంగంలోనే చేతులు ముకుళించేరు కృష్ణస్వామి.

* * *

శాంతి యజ్ఞము సమారంభ మయినది అది నాల్గవరోజు. అనగా వైశాఖ శుక్లత్రయోదశికి మరునాడు. యజ్ఞ వేదికను, యజ్ఞ మంటపమును శ్రీదేవుడు అపురూపముగా అమర్చినాడు.

కృష్ణస్వామి సంతోషమునకు మేరలేదు. హవిస్సు అహరహమ్ము వేల్చబడుతున్నది. గోమాత కొనిరాబడింది. లక్ష్మికి పసుపురాసి, కుంకుమాంకితను చేసి పూలమాలలతో అలంకరించినది ఏకవీర. అది ఖర్మ. అనగా యజ్ఞము. మానవ మనోరథము. సృష్టికి విపులీకరించబడిన సంపూర్ణార్థ మిది.

మాతా రుద్రాణాం దుహితా వసూనాం
స్వసాదిత్యా నామమృత స్యనాభిః॥
ప్రణువో చంచికితుషే జనాయ
మాగా మనాగా మదితిం వధిష్ట

(ఋగ్వేదం 8–101–15) యిత్యాది ఋగ్వేద మంత్రాలతో లక్ష్మికి గోపూజలు జరిగినాయి. మనోజ్ఞమయిన ఆ దృశ్యాన్ని చంచలాలైన నేత్రాలతో అచంచలంగా చూడసాగింది పద్మ. ఆశ్రమంలోని లేడికూన! దానికి తన సహచారిణి అయిన లక్ష్మికి యింతటి ఘనమైన గోపూజ జరగటం మహదానంద దాయక మయింది.

దానికి అసూయ లేదు. ఆ పూజ తనకు జరగలేదన్న దుగ్ధ మొదలే లేదు. ఆనందాతిరేకంతో పరవశ అయింది.

గోరూపిణి అయిన దేవి రుద్రులకు మాత. వసువులకు దుహిత. ఆదిత్యులకు స్వస. అమృతమునకు ఆవాస స్థానము. నిరపకారియు (నిరపరాధి) అదితియు అగు యీ గోరూప ధారిణీ దేవిని హింసింపకుడని జ్ఞానియగు జనునకు చెప్పుచున్నాను — అని ఆ ఋగ్వేద మంత్రార్థము.

కృష్ణస్వామి ఆ అర్థాన్ని ఊహించి తన్మయులయ్యేరు. గోదేవతకు హైందవం ఎంత ప్రాముఖ్యాన్ని యిచ్చింది. యిది నిజంగా ఎంత మధురోహ అనుకుని ఆయన పులకించేరు. పశ్చాత్ పురస్తా దధరాదు దక్తాత్ కవిః కావ్యేన పరిపాహిరాజన్ । సచేస బాయమజరో జరిమ్ణే ఓగ్నేమర్తాగేం అమర్త్యన్త్వంనః॥ (ఋగ్వేదం 10–87–21) అనే మంత్రంతో అగ్ని కీర్తనం జరిగి అగ్ని ఆసూతుడయ్యేడు.

అక్కడి ఋత్విక్కులు, ఘనాపాఠులు, వశిష్ఠులు, సదస్యులు అందరూ దేవతాకమై వర్చస్యులయ్యేరు. వారిలో మూర్తీభవించిన దైవికమైన వర్చస్సువల్ల ఆశ్రమం పునీత మయింది. మొగిలిచర్ల చరిత్ర ధన్యమయింది. జానపదులు జీవితాలు కీర్తిదాయకాలైనాయి.

ఈ సందడిలో ఏకవీరను అంతగా పట్టించుకున్నవారు లేరు. ఆమెకు కావలసినది ఏకాంతం. కనుక యిది మంచి అవకాశమే అయింది. ఆమె ఏకాదశి నాటినుండి ఒకటి రెండుసార్లు తప్ప మామిడికొమ్మ దిగిందిలేదు. తన్మయురాలై ఉంది. స్వామితో ఏకాంత జీవితాన్ని గడపటం ఆమెకు లాలస అయింది.

మొగిలిచర్ల పురప్రముఖులంతా యజ్ఞానికి విచ్చేసి ఆ రమణీయ దృశ్యాలను, పవిత్ర వేదమంత్ర పఠనాలనూ చూచి పులకించిపోయేరు. ఆ గ్రామ ప్రజలకు అదే లోకమయింది.

అది చతుర్దశి. రేపే పూర్ణాహుతి. సాయంకాల మయ్యేసరికి శివదేవయ్య కృష్ణస్వామి ఆశ్రమానికి విచ్చేశారు.

మహామంత్రులకు అభ్యుదయం కలగాలని ఆశీర్వదిస్తూ ఆయనను వెంటపెట్టుకుని లోపలకు నడిచేరు కృష్ణస్వామి. వాస్తవానికి వారిద్దరి మనసులూ మైత్రీ పురస్సరంగా గాఢాలింగనం చేసుకోవాలని మనసులో ఉవ్విళ్ళూరేరు. కాని యజ్ఞదీక్షలో ఉన్న కృష్ణస్వామికి అది అసాధ్యం. ఆయన కంకణాలను (దీక్షను) విడిచి అవభృథ స్నానం చేసే వరకూ స్త్రీనికాని, పురుషునికాని స్పృశించరాదు అన్నది నియమం

ఆశ్రమంలోకి వెళ్ళేక కృష్ణస్వామి ఇడా చక్రాలను దోసిలిలో ఉంచుకుని ఆయన ముందుకు దోసిలి చాపేరు. కృష్ణస్వామి చూపిన ఇడా చక్రాలను చూడగానే శివదేవయ్య సంభ్రమంతో లేచి వాటికి మోకరిల్లి, స్పృశించకుండా కళ్ళకు అద్దుకున్నారు. ఆయన ముఖం ప్రజ్వలిత మయింది. వర్చస్సు శరీరమంతా పాకినట్లు అయింది. ఓజస్సు నిద్రలేచి చరచరా శరీరమంతా పాకినట్లు అయి ఒక విధమయిన మధురానుభూతిని కలుగజేసినట్లు అయింది. కృష్ణస్వామి ఆయన సంభ్రమాన్ని ఆయనలో వొచ్చిన మార్పునీ గమనించి తిరోముఖులయ్యేరు. వాటిని యథాస్థానంలో ఉంచి కృష్ణాజినంమీద ఆశీనులయ్యేరు. మహామంత్రి శివదేవయ్యగారు కూడ మరొక పులిచర్మంమీద ఆశీనులయ్యేరు.

''రాణి రుద్రాంబకు కుశలమే కదా! ప్రయాణం సవ్యంగా సాగిందా'' అంటూ కుశల ప్రశ్నలు ప్రారంభించేరు కృష్ణస్వామి.

''రాణీవారూ, అయ్యమ్మ — రుమ్మక్క (రాణి రుద్రాంబ కుమార్తెలు)లు కూడ వొచ్చేరు. రాణివారు మహదానందంతో ఉన్నారు. ఇటీవలి రాజకీయపు ఒత్తిడులవల్ల కలిగిన చికాకులన్నీ ఆమె మొగిలిచర్లకు రాగానే మటుమాయ మయ్యాయి. ప్రశాంతచిత్తంతో ఆమె పరిస్థితులను పరిశీలిస్తున్నారు'' అన్నారు శివదేవయ్య.

కృష్ణస్వామికి యీ వార్త వినటంతోనే మహదానంద మయింది. ''త్రిపురాంతక దేవుడు ఈ రెండు దినాలుగా నాకు కనిపించనే లేదు'' అంటూ అర్థవంతమయిన చూపులు శివదేవయ్య మీదకు మళ్ళించేరు కృష్ణస్వామి. ఆ చూపులకు అర్థమేమిటో శివదేవయ్యగారు యిట్టే గ్రహించగలరు. రుద్రాంబకు కట్టుదిట్టమయిన రక్షణ వలయంకావాలి. ప్రజలలో కావలసినంత పలుకుబడి సంపాదించుకోలేని ప్రత్యర్థి వర్గాలు నిరాశతో యుద్ధానికిగాని, హఠాత్తుగా దాడి చేయటానికిగాని తలపడవచ్చు.

అలా జరిగితే తగిన వ్యూహాన్ని అప్పటికప్పుడు రచించుకుని నారిని విజయవంతంగా ఎదుర్కొనాలి. అందుకు సమర్థుడు త్రిపురాంతక దేవుడే!

యీ రెండు దినాలనుండి త్రిపురాంతకుడు కనిపించకపోవటం పట్ల కృష్ణస్వామికి యధార్థానికి ఎటువంటి అపార్థమూలేదు. అతడికి తన కర్తవ్యం ఏమిటో బాగా తెలుసు. అతడు ఆ పనిలోనే నిమగ్నమయి వుంటాడని ఆయన

కొత్త వ్యాపారం!

పశ్చిమజర్మనీలో ప్రతి 22 సెకన్లకు ఒక దొంగతనం జరుగుతున్నదని హిర్మన్ వాక్ తెలియచేసాడు. అందుకని ఈయన ఇండ్లను కాపలాకాచే కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాడు. శలవు రోజుల్లో ధనవంతులు బయట ఊళ్లకి వెళ్ళినపుడు ఈ సంస్థ ఉద్యోగులు వారి ఇళ్లను కాపలా కాస్తుంటారు. దీనికి వారానికి 840 రూపాయలు చెల్లించాలి. ఈ ఉద్యోగులు, సాధారణంగా రిటైరయిన పోలీసులే. వీరికి ఇంట్లో రెండు గదులు ప్రత్యేకంగా ఇస్తారు. ఈ కాపలా ఉద్యోగి భార్యను, కుక్కను తోడుతెచ్చుకుంటాడు, చెట్లకు నీళ్ళుపోస్తాడు. జంతువుల సంరక్షణ చేస్తాడు. ఈ ఉద్యోగి ఇరుగు పొరుగువారితో మర్యాదగా ఉండాలి. హెర్మన్ వాక్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది!



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎమ్. ఆర్. – వచ్చునూరు

నా వయస్సు 22 సంవత్సరములు. నాకు దాదాపు మూడుసంవత్సరముల నుండి మలములో చిన్న చిన్న తుమ్మిపురుగులు కన్పించు చున్నవి. ఇవి 1 సెం. మీ నుండి 1.5 సెం.మీ పొడవు కలిగివుండి తెల్లగా చివరలు మొనదేలి వున్నవి.

★ ఈ పురుగుల పేరు ఆక్సీయూరిస్ వర్మికులారిస్, వీటిని తొలగించటానికి పైపరజీన్ సిట్రేట్ లేక అడిపేట్ వాడటం మంచిది. ఈ మాత్రలను రోజుకి మూడు వంతున ఒక వారం పాటు వరుసగా వాడాలి. కుటుంబంలోని సభ్యులందరూ ఒకేసారిగా ఈ మందు వాడటం మంచిదని కొందరి అభిప్రాయం. గోళ్లు కత్తిరించుకోవటం, మలవిసర్జన సమయంలో పాదరక్షలు ధరించటం, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవటం ఈ క్రిములు మరలా రాకుండా తీసుకో తగిన జాగ్రత్తలు.

యన్. పి. – విద్యాధరపురం

నా వయస్సు 25 సంవత్సరములు. 4 సంవత్సరముల క్రితం వళ్ళంతా దద్దుర్లు, జ్వరము వచ్చినది. వేగవరం లెప్రసి సెంటర్‌లో నాకు లెప్రసి అని చెప్పారు. డెప్సాన్ 100 ఎమ్. జి. వాడాను. తగ్గకపోతే లేమ్‌ప్రిన్ క్యాప్స్యూల్స్ వాడాను. మూడునెలలు వాడాక తగ్గినది. అప్పటినుండి డెప్సాన్ వాడుతున్నాను. 5,6 నెలలు నుండి పిరుదులపై, మొలలో తెల్లని మచ్చలు వచ్చినవి, డాక్టరు బొల్లి మచ్చలు అని చెప్పారు.

★ జ్వరం, దద్దుర్లు వచ్చినంత మాత్రాన లెప్రోసీ అని అర్థంకాదు. మీరు నిపుణులైన వైద్యులవద్ద (లెప్రోలజిస్టు) పరీక్ష చేయించుకొని రోగ నిర్ధారణ చేయించుకోవటం అవసరం. ఒక వేళ లెప్రా రియాక్షన్‌వల్ల ఇలా జరిగినా, మూడు నెలలపాటు ఆ రియాక్షన్ ప్రాబల్యం ఉండడం అరుదు.

మీకు మొలలో వచ్చిన మచ్చలమీద స్పర్శ జ్ఞానం ఉన్నదీ లేనిదీ పరీక్షించవలసి ఉంటుంది

కె. యస్. ఆర్. – పోడూరు

నా వయస్సు 17 సంవత్సరములు. నేను పరీక్షల సమయంలో నిద్ర రాకుండా మాత్రలు వేసుకుంటాను. దీని వలన ఏమైనా నష్టమా ? ఇవి వేసుకుంటే గాని చదువు ఎక్కదు.

★ మాత్రలు వేసుకొంటేనే గాని చదువు ఎక్కదనుకోవటం వట్టి భ్రమ.

ఈ మాత్రలు కొన్ని రోజులు వాడగానే వాటి వాడకం అలవాటైపోతుంది. అవి వేసుకొంటే గాని ఏ పనీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. వీటి వాడకంవల్ల కొందరికి సైకలాజికల్‌గా రోగాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

డి. ఎన్. ఆర్. – అనకాపల్లి

నాకు చిన్నతనంనుండి ఒక్కటే బీజం వున్నది. రెండూ కలిపి ఒక్కవైపే అతికిపోయినట్లు పొడవుగా ఎడమవైపు వుంటుంది. ఇప్పటి వరకూ డాక్టరుకు చూపించలేదు. నేను చదువుకున్నాను. ఏదైనా ఉద్యోగమునకు వెడితే మెడికల్‌లో అన్‌ఫిట్ అవుతానేమోనని భయముగా వున్నది. నాకు వివాహము అయినది, ఒక పాప గూడా వున్నది.

★ మీకు ఒకవైపున అన్‌డిసెండెడ్ టెస్టిస్ ఉన్నది. దీనివల్ల అన్‌ఫిట్ అయ్యే అవకాశం లేదు. ఒకే టెస్టిస్ ఉన్నా పిల్లలు కలుగుతారని మీకు కలిగిన పాపవల్ల మీకు స్పష్టమయింది కదా ! ఇక దానికి కూడా ఆదుర్దా పడనవసరం లేదు.

శస్త్ర చికిత్స చేసి ఆ టెస్టిస్ కడుపు భాగంలో ఎక్కడ ఉన్నదీ కనుగొని వెలికి తీసుకు రావటానికి అవకాశం ఉన్నా మీ వయస్సు దృష్ట్యా కష్టతరమనే చెప్పవలసి ఉంటుంది.

ఆర్. వి. పి. – వలాసా

నా వయస్సు 16 సం॥లు. నేను ఎంత చదివినా మరచిపోతాను. నరాల బలహీనతవలన కూడ మరచిపోతారా ? చదివింది జ్ఞాపకం ఉంచుకోటానికి ఏదైనా మందులు ఉన్నాయా ?

★ జ్ఞాపకశక్తికి మెదడు నిర్మాణం, పనితనం చాలా అవసరం. మెదడు బాగా పనిచేయటానికి గ్లూటామిక్ యాసిడ్ ఉపయోగపడుతుందని శాస్త్రజ్ఞులఅంచనా. అయితే ఆ మెదడు బాగా రోగగ్రస్తమయినప్పుడు ఇది ఉపయోగపడుతుందనేది వివాదాంశనీయం.

గ్లూటావిల్ అనే మందు మాత్రలరూపంలోను, ద్రవరూపంలోను ప్రస్తుతం లభ్యమవుతుంది. ఈ మందును కొన్నాళ్ళపాటు వాడి చూడండి. చదివేదానిమీద శ్రద్ధ ఉంటే ఈ మందులవసరం ఉండదని నా అభిప్రాయం. ●

విశ్వాసం. అయినా ఆ విషయాన్ని శివదేవయ్యగారి ద్వారా నిశ్చయ పరుచుకొనదలచి అడుగుతున్నా రాయన. శివదేవయ్య కృష్ణస్వామి హృదయాన్ని అర్థం చేసుకున్నారు.

ఆయన దేశభక్తికీ, అప్రమత్తత కూ మనసులోనే నివాళులర్పించేరు. యిటువంటి దేశ భక్తులున్న యీ ఆంధ్రమహా సామ్రాజ్యాన్ని ఎవరేమి చేయగలరు అని మనసులోనే గర్వించేడాయన. ''త్రిపురాంతకుడు ఈ రెండు దినాలుగా మా వెంటనే ఉన్నాడు'' అంటూ కృష్ణస్వామిని స్వాంతన పరిచేడు.

తిరుచరణాలు

''విడిది యేర్పాట్లు రాణీవారికి నచ్చేయా?'' కృష్ణస్వామి.

''మీకు తెలుసు గదా ! వారు నట్టడివిలో అయినా విడిది చేసేందుకు సిద్ధమయిన తరువాతనే ప్రయాణం సంకల్పిస్తారు'' అన్నాడు శివదేవయ్య.

''శివదేవయ్యగారూ ! యీ మారుమూల పల్లెలో ఆంతకన్నా మేము చేయగలిగింది లేదు'' సంతృప్తి పరచలేక పోయేమన్న బాధ ధ్వనిస్తూండగా అన్నారు కృష్ణస్వామి.

శివదేవయ్యగారు తేలికగా నవ్వేరు. ఆయనకు కావలసిన సంగతులు యివి కావు. జైన మహా సభల విషయం కావాలి. వివరాలు కావాలి. జైనస్వామి మొగిలచర్లకు వొస్తారా ? లేదా ? అన్న విచారణ ఆయనకు ముఖ్యం.

''యితర విషయాలేమిటి ?'' అంటూ హెచ్చరించేడు శివదేవయ్య.

''అవి ఏవి అయినా పట్టించుకోవలసిన పని లేదు. మన శాంతి యజ్ఞం సఫలమైతే మిగిలిన విషయాలు చాల స్వల్పమయినవి.''

[ఇంకా వుంది]

ఒక శతాబ్ది నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది!



మహాకవి శ్రీశ్రీ తన 73వ ఏట అవిశ్రాంత సాహిత్య సృష్టిని విరమించి విశ్రాంతి మందిరంలోకి వెళ్ళి పోయాడు. 1910లో పుట్టి 20వ ఏటనే సాహిత్యంలో తనదైన గొంతు కోసం, మార్గం కోసం అన్వేషణ ప్రారంభించి 20వ శతాబ్దపు మూడవదశకం తరువాత తెలుగు కవితా రంగాన్ని శాసించటం మొదలుపెట్టి, దరిదాపుగా ఒకఅర్థశతాబ్దంపాటు తెలుగుసాహిత్య రంగాన్ని ఊగించి, శాసించి కవితారంగంలో ఈశతాబ్దం తనదిగా, తానే ఈ శతాబ్దంగా చెలామణీఅయి కాలంతోపాటు తనునడుస్తూ, తనతో కాలాన్ని నడిపిస్తూ, అకస్మాత్తుగా తన గమనాన్ని ఆపేసి నిశ్శబ్దంలో మునిగి పోయాడు.

కవితారంభ దశలో విశ్వనాథకు, కృష్ణశాస్త్రికీ ప్రతిధ్వనిగా కనిపించినా అనతికాలంలోనే పుడమితల్లి పురిటి నొప్పులను విని నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అంటూ, మరో ప్రపంచపు అగ్నికిరీటపు ధగధగలను, ఎర్రబావుటా నిగనిగలను, హోమజ్వాలల భుగ భుగలను చూసి ఆ వైపుగా మహాప్రస్థానం సాగించాడు. స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం పునాదులుగా యావత్ మానవజాతి, అవిభక్త కుటుంబంగా, ఏకరక్త బంధువుగా జీవించటానికి, పీడక శక్తులను అంతమొందించి శ్రామిక శ్రేయోరాజ్యం నిర్మాణానికి దారిపొడుగునా గుండె నెత్తురులు తర్పణచేస్తూ పదండి ముందుకు అంటూ పిలుపునిచ్చాడు. పతితుల్ని, భ్రష్టుల్ని, బాధాసర్ప దష్టుల్ని, అనాథుల్ని, అశాంతుల్ని ఏకంచేసి వారికోసం, వారి రాజ్యం వారు ఏలటంకోసం ఆకాశపుదారులంట అడావిడిగా అరుచుకుంటూ వెళిపోయే జగన్నాథ రథ చక్ర ప్రళయ ఘోషను భూమార్గం పట్టిస్తానని, భూకంపం పుట్టిస్తానని ప్రతినబూనినాడు. కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, రంపం, కొడవలి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు అతని కవితా గీతికి, రీతికి భావం, భాగ్యం, ప్రాణం, ప్రణవం అయ్యాయి. అతనిలో కనిపించిన నవ్య కవిత్వం కార్మిక లోకపు కళ్యాణానికీ, శ్రామికలోకపు సౌభాగ్యానికీ అంకితమై వ్యథార్త జీవిత యథార్థ దృశ్యం పునాదిగా భావివేదముల జీవనాదంగా రవళించింది.

మహాప్రస్థాన రచనా కాలంనాటికి తనకు మార్క్సిజం తెలియదని శ్రీశ్రీ చెప్పినా అనంతర కాలంలో మార్క్సిస్టు దార్శనికత అతని రచనా దృక్పథంగా పరిణమించటం ఆయన అభ్యుదయ విప్లవ దృక్పథాలకు నిదర్శనం. కవితా సృష్టిలో, విమర్శనా దృక్పథంలో, కథానికా రచనలో, హాస్య, వ్యంగ్య శీర్షికా రచనలలో శ్రీశ్రీ ముద్ర శ్రీశ్రీ ముద్రణా శిలా శాశ్వతమే. ఆయన రచనా వస్తువు జీవితమంత విశాలమైనది; ప్రతిభ ఆకాశమంత విస్తృతమైనది; రచనా శిల్పం సముద్రమంత అగాధమైనది.

అభ్యుదయ, దిగంబర కవితోద్యమాల అనంతరం సాయుధ పోరాటం ద్వారా మాత్రమే శ్రామిక శ్రేయోరాజ్య స్థాపన సాధ్యమని నమ్మి వి. ర. సం. జన్మించిన తొలినాళ్ళలో అధ్యక్షుడుగానూ, ఆ తరువాత సాధారణ సభ్యుడుగానూ ఉండి ఆ భావానికి అనుగుణంగా ఎన్నో కవితలు రాశాడు; ఉపన్యాసాలిచ్చాడు. గాంధిజీ యథాస్థితి వాదాన్ని తిరస్కరిస్తూ చర్యకు ప్రతి చర్య రాదా హింసకొక ప్రతి హింస లేదా అంటూ హింసతోనే సృష్టి పూస్తుంది; హింసతోనే మార్పు వస్తుంది అని ఖండితంగా చెప్పాడు. మరో ప్రస్థానంలోని తుది పయనం, తొలి విజయం, నిన్నటి జట్కావాలా, ఝంఝ, భూమ్యాకాశాలు, ఓ మహాత్మా! ఓ మహర్షీ గేయాలు అతను నమ్మిన సాంఘిక సిద్ధాంతానికి ప్రతీకలు.

లోపం లేని మనిషి లేడు; మహానుభావుడూ లేడు. శ్రీశ్రీలో కొన్ని అల్పమైన లోపాలూ, బలహీనతలూ ఉండవచ్చు. తాత్కాలికంగా కమ్మిన మేఘం వల్ల అసలు సూర్యుడే లేడనుకోవడం వెర్రితనం, వెకిలితనంగదా!

కాకి అరుపులూ, పిల్లి కూతలూ ఎన్ని వినిపించినా సాహిత్యంలో తెలుగు కవిత్వానికి సంబంధించినంతవరకూ ఈ శతాబ్దం శ్రీశ్రీదే. ఈ శతాబ్దం నాది అని సగర్వంగా చెప్పుకొన్న మనిషి మాత్రం నిశబ్దంగా వెళ్ళిపోయాడు. మరో యుగ ఘోషకు అవకాశాన్నిస్తూ ఈ యుగం మూగవోయింది. శ్రీశ్రీ గళం, కలం మరి లేవు గాని 'తూరుపునుంచి తమస్సును చీల్చుకొని వచ్చే, ఉషస్సును మోసుకొనివచ్చే, ఐరావతం లాగా, శాంతి పారావతంలాగా' అతని కవిత్వమో —

దానికి జనన మరణాల్లేవు
అది —
నిత్య యవనంతో
వికసించే
అగ్నిపుష్పం

— టి. యల్. కాంతారావు ★

'అ'శోక్తి పది

ఆరని జ్వాలా
మాయని వెలుగూ
ఆగని రాగం
ఆపని పూవూ
అందని చూపూ
చావని చేవా
అతనివి కావా?
'అ'తనివి తీరాయా?
తెలుగు సాహితిలో
చెరగని సిరా శ్రీశ్రీ

— ముక్కామల వెంకటేశ్వరరావు

శ్రీకాంత్ :

హృదయపు కవాటాలు ఓరగా మూసుకుని అలసిన వూహలు మగతగా నిద్రపోతున్న వేళ, అదిగో ఆ కవాటాలమీద వేళ్ల చప్పుడులా ఆవిడగారి కారు డోరు శబ్దం. నాకు తెలుసు; ఉష నన్ను డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక తప్పని సరిగా సృష్టించాల్సి వచ్చిన శబ్దాన్ని వీలైనంత సున్నితంగా వాడుకుంటుందని.కానీ ఆ అమాయకు రాలికి తెలియదు. నా శరీరం ఎంతగా మొద్దుబారినా దాని సౌకుమార్యం కూడా వచ్చి చేరి మనసు మరీ నాజూకు తేలిందనీ, ఈ ఇంట ఉష వదలిన ఊర్పు కూడా నా మనో నాసికను స్పృశించగలదనీ.

మద్యంతో మర్డర్ చేద్దామనుకున్నా ఆమె తాలూకు వూహ చాలు నా ఆలోచనల్ని మళ్లీ బ్రతికించటానికి! ఆలోచనల్నిండా ఆమె! ఆమె కేంద్రమైన ప్రతి ఆలోచనా బాధా తప్త పరిధి!

ఓహ్! నా మనోమయ ప్రపంచం గ్లోబులా తిరుగుతోంది. దీన్ని స్థిరం చేయాలని ఉష తాపత్రయం. సూర్యుణ్ణి కదిలించటం, భూమిని కదలకుండా ఆపటం ఎవరి తరం? నాదీ అంతే. అదే ఉషకు తెలియదు.

ఉష పైకి రాలేదు ఇంకా. వెంట అభిమానులు వచ్చారా? రాలేదు. వస్తే మాటలు వినిపించేవి. ఉషలా వాళ్లకు శబ్దం కాకుండా మాట్లాడవలసిన అవసరం లేదు. ఉష పైకి రాకపోవటమే మంచిది. వస్తే యుద్ధం ప్రారంభ మవుతుంది. కోల్డ్‌వార్!

ఉష చూపుల వేడిలో నేను భస్మమైతే బావుణ్ణు. ఆ చూపుల తూపులు నా అణు వణువునా దిగబడి నా ప్రాణాలు తీస్తే బావుణ్ణు. కానీ అలా జరగదు. చల్లగా చూస్తుంది ఉష. ఎలా? చల్లగా, చాలా చల్లగా, హిమ పాతంలా! ఆ కురిసి కరడు గడ్తూన్న మంచు మధ్య నా గుండె... రచయిత్రి కదా? బాధను నవ్వుతూ చెప్పటం, ప్రాణాల్ని నిమురుతూ లాగేయటం వెన్నతోబెట్టిన విద్య.

''మీ ఈ స్థితికి నా రచనే కారణమైతే మీ కోసం, మీ తృప్తికోసం నేను రచన మానే స్తాను'' అంటుంది ఉష. నాకు తెలుసు ఆమె మనసులోనిమాట వేరు. ''మీ కాంప్లెక్స్ నాకు తెలుసు. దాన్ని పోగొట్టటంకోసం నేను రచన మానేస్తాను'' అని ఇదేనా? ఇదే అని నా నమ్మకం. ఏమోమరి. అయినా అంత స్వార్థం నాలో లేదు. ఆమె ప్రగతిని నే నాపలేను. నాలో పెరుగుతూన్న న్యూనతనూ భరించలేను. ఈ సంఘర్షణ ఉష కర్థంకాదు. అర్థం కాకపోవటం మంచిదికూడా.

''మంచిగానీ చెడుగానీ మీ ఆలోచన నాకు చెప్పండి. స్వచ్ఛంగా ఒక మార్గాన్నెన్నుకోండి.



అది చెడే అయినా, నాకు అననుకూలమే అయినా ఫరవాలేదు. నా రచన వుద్దేశం సమాజానికి అణుమాత్రమైనా వుపయోగపడాలని. ఒక జీవితం — అది నా జీవితమే అయినా — నా రచనవల్ల శిధిలమవుతుందంటే నా రచనకు అర్థమే లేదు. మానేస్తాను'' ఇదీ ఉష వాదన.

చెప్పానుగా. నాది అర్థంలేని బాధ. ఒక స్థితిలో నాకే అర్థంకాని బాధ. ఉష పైకి రావాలి. పేరు తెచ్చుకోవాలి. అయితే దానికి ఉష భర్తగా నా పాత్ర పేలవం కావడం నాకు ఇష్టంలేని విషయం. దీన్ని నా అసూయగా, ఈర్ష్యగా భావిస్తే అది మీ తప్పే అవుతుంది ఉష పైకివస్తే రానివ్వండి. పేరు తెచ్చుకుంటే తెచ్చుకోనివ్వండి. దానికి నా స్థానం బలహీనం కావడం ఏమిటి! నా ఉనికి అప్రధానం కావటం ఎందుకు? ఇదే నేను సహించలేను. నాలోనూ అందమైన ఆలోచన లున్నాయి. సున్నితమైన ఊహలున్నాయి. విప్లవాత్మకమైన భావా లున్నాయి. అంతెందుకూ, నా స్వగతం ఆ విషయాన్ని మీకు చెప్పటం లేదూ? అయితే ఆవిడగారిలా నేను కలంలో జొప్పించలేను. కాగితంమీద పెట్టలేను. అంతే తేడా! ఆ మాత్రానికి ఆమెగారికి బ్రహ్మరధం! నా ప్రసక్తేమో ఎవరు! అరె! మళ్లీ ఉష కీర్తిని ఆక్షేపిస్తున్నానా? కాదు కాదు. అయినా ఇప్పటికి నా భావం, బాధ అర్థమయే వుంటుంది.

అబ్బ! నా ఉదరసాగరంలో భీషణమైన అలలు! ఎన్ని మద్యపు నదుల చేరిక నా ఉదర సముద్రం! అలలు గుండెలవరకూ ఎగసి పడు న్నాయి!

పైనుంచి మరో జలపాతాన్ని దూకించాను. వాట్ 69. నా గుండెలు బండల్ని పిండి చేస్తూ... కడుపులోకి దూకి పతనమైంది.

ఆఁ ఏదో చెబుతున్నాను.

ఔను. గుర్తొచ్చింది.

మళ్లీ చెబుతాను. ఉష అంటే నాకు ప్రాణం. నో. ప్రాణాధికం. నా గుండెల్లో గుడి కట్టి ఆ సౌందర్య దేవతను నా ప్రేమ పుష్పాలతో అర్చిస్తూ, ఆరాధనా నీరాజనంతో హారతిపడ్తూ. నా గుండె పొత్తిళ్లలో మెత్తగా ఒదిగి వుండ వలసిన ఉష — ఊహూ — ఎదిగిపోయింది, మహోన్నతంగా. ఆ ఔన్నత్యాన్ని నా చిన్ని గుండె భరించలేకపోయింది. నా గుండె గోడల్ని బద్దలు కొట్టుకుని పైకి ఎదిగిపోయింది ఉష, నేను కళ్లెత్తి, తల ఎత్తి చూసినా కనిపించనంత ఎత్తుగా. ఆమె ఔన్నత్యాన్ని నేను భరించలేనా? భరించగలను. కానీ ఆమె ఎత్తుకు ఎదగలేని నా నిస్సహాయత ఒలికే కన్నీటి ఒరవడిలో నా సహనం, ఉష ఉన్నతికి కలిగిన సంతోషం కొట్టుకుపోతు న్నాయి. ఏం చెయ్యను!

అయ్యో! మళ్లీ మనసు కొలిమిలో ఆలో చనల చితుకులు అంటుకున్నాయి.

ఉదరగోష్ఠి పొగ, గొంతు గొట్టాన్ని వుక్కిరిబిక్కిరి చేస్తోంది, విపరీతమైన దగ్గు రాబోతోంది. సినిమాలో నాగేశ్వరరావుగారు గుర్తొచ్చి, సిగ్గుపడి బలవంతంగ ఆపుకున్నాను.

వాటె ట్రాజెడీ!

ఉషలాంటి స్త్రీని నా కిచ్చి నా హృదయ కలశాన్ని ఆనంద రసంతో నింపిన ఆ దేవుడు ఈ ఒడిదుడుకుతో, ముఖ్యంగా ఇతరులకు చెప్పకోలేని, చెప్పినా అర్థంకాని ఒడిదుడుకుతో తొణికిపోయే ప్రమాదమూ సృష్టించాడు!

వాటె ట్రాజెడీ! కామెడీలా కనిపించే ట్రాజెడీ!! వాటె ట్రాజెడీ!!!

ఉష అంటూ వుంటుంది. ''ఎందుకిలా దిగజారిపొయ్యారు! నాలో ఏమైనా లోపం వుందా? నావల్ల మీకు తృప్తిలేదా? నా అందం మీ సౌందర్యారాధనకు తగినట్టుగా లేదా? నేను మీకు అవమానం కలిగించే పనులు చేస్తున్నానా? ఏమిటి మీ బాధ?'' అని.

నా మనసు విరగబడి నవ్వుతుంది ఆ మాటలకు.

నా సౌందర్యారాధనకు ఉష అందం తగదా!? అసలందమంటే ఏమిటి? ఉషకాదూ?

ఉష సౌందర్యం అపురూపం. అద్భుతం. కల్మష రహితమూ, కళా విలీనమూ అయిన ఆమె మనో సౌందర్యం ఆమె సౌందర్యానికి మరింత మెరుగులు దిద్దింది. వెలుగులు అద్దింది

ఉష నా భార్య అయినప్పుడు నాదైన ఆ అందాన్ని నలిపివేయలేదు.

ఆ సౌరభం అబ్బిన సౌందర్యాన్ని ఆఘ్రా ణించి కలుషితం చేయాలనిపించలేదు. ఆ సౌకు మార్యాన్ని నా కోరికల వేడితో కాల్చివేయా లనిపించలేదు నా చూపులు వాడికే ఆ నవవికసిత పారిజాతం కమిలిపోతుందేమోననీ, నా వేళ్ల తాకిడికే ఆ నవనవోన్మేష ఉషస్సనిత హిమ

బిందువు కరిగిపోతుందేమోననీ భయం వేసింది. ఎంతోసేపటికి, తారా చంద్రులు రసరమ్య రాగ కేళిలో తేలి, అలసి సొలసిన చాలాసేపటికి ఆదిత్యుని తీక్ష్ణ కిరణ స్పర్శకే కమలం కన్ను తెరుస్తుందనీ, అగ్నితప్త కనకమే కళలు పెంచుకుంటుందనీ తట్టి, ఉషను హృదయ కవాటాలు తెరచి నా ప్రణయ జీవన సామ్రాజ్యంలోకి పూల దోసిళ్ళతో ఆహ్వానించాను.

"మీ ప్రేమ, మీ ఆరాధనా, మీ సౌందర్య పిపాస— ఇవే ఇవే నా రచనకు ఇన్‌స్పిరేషన్" అంటుంది ఉష. ఉషకు ఇన్‌స్పిరేషన్ అయిన నాలోని ఆ అన్నింటినీ నామ రూపాల్లేకుండా నాశనం చేయాలనిపిస్తుంది. కానీ అవే లేకపోతే నా జీవితంలోని ఉషను నేనేం చేసుకోను? అవి వుండాలి. కానీ వుంటే... అవి ఉషకు ఇన్‌స్పి—రేషన్. అదే నా కఖ్కర్లేదు. కానీ... ఓహ్ ! ట్రయాంగిల్ ఫైట్. ది టెరిఫిక్ హెడేక్.

ఉష పైకి వస్తున్న చప్పుడు.

మెట్లుగా మారిపోయిన నా గుండె ముక్కల పేర్పు !

నా హృదయపు టెరేస్‌మీద ఉష లేమెత్తని పాదాల స్పర్శ !

ఉష కడగంటి చూపుల వేడితో కరిగి కన్నీరైన నా నిబ్బరపు హిమనగరం !

నా ఊహలు పచ్చి నిజపు పెనుగాలికి చెదిరిపోయింది. అంతా ఊహ. నా భ్రమ.

ఉష నిశ్శబ్దంగా గదిలోకి వచ్చింది.

ఎప్పుడో మేల్కొని అవిశ్రాంతంగా కొట్టుకుంటున్న నా వూహలు ఉష గదిలోకి రాగానే క్షణం విశ్రాంతి తీసుకున్నాయి.

మంచంమీద బోరగిల పడుకున్నాను. నా తల మంచంపట్టె క్రిందికి జారివుంది.

జరీ అంచుగల పచ్చని చీరె కుచ్చెళ్ల క్రింద తెల్లని సుతిమెత్తని పాదాలు. ప్రతి ప్రేమికుడూ తన ప్రేమకు అర్పణ చేసుకునే అందమైన చోటు. నా అధరాల మధుకరాలు మరులుగొన్న చంపా పుష్పాలు. మనసులోనే సలాము చేశాను.

నా కళ్లు కొంచెం పైకి లేచాయి. కళ్ల మెట్లమీద చూపులు మునిగాళ్లమీద నిలబడ్డాయి.

ఆ యాంగిల్‌లో ఉష మరీ ఎత్తుగా కనిపించింది, హిమాలయమంత.

మట్టిలో ఆడుకుంటూన్న జబ్బు పిల్లాడిని చూసినట్లుగా చూసింది ఉష.

మట్టిలో ఆడుకుంటూన్నందుకు కోపం. జబ్బువెధవ కాబట్టి ఆ కోపాన్ని వ్యక్తం చేయ వీలులేని నిస్సహాయత.

ఆమె వూల పరిమళమంత పల్చని నిట్టూర్పు నేను తాగిన విస్కీ కంటే భయంకరంగా కాల్చింది నా గుండెల్ని.

ఉష నెందుకింత బాధపెడుతున్నాను ! ?

"భోజనం చేశారా ?" ఉష.

ఛత్ ! చడామడా తిట్టకుండా చెత్త ప్రశ్న.



అయినా ''నీవు లేకుండానే'' నిజంగానే అన్నాను. నిజంకూడా.

''అది నేననవలసిన మాట'' అంది.

ఉష ఎలాంటి పరిస్థితుల్లోనూ నన్ను నిర్లక్ష్యం చేయదు. ఎంత ఎత్తు ఎదిగినా నాకోసం తల వంచుతుంది. నావల్ల బాధ కలిగినా నాకోసం నవ్వుతుంది. అహం చూపవలసిన స్థితిలో వుండికూడా నాపట్ల అణకువ ప్రదర్శిస్తుంది. అంత మంచితనం నేను భరించలేను. ఆ మంచితనం ముందు నేను కుంచించుకు పోతున్నాను.

''లేవండి మరి. భోంచేద్దాం'' ఒకడుగు ముందుకువేసి అంది. కడుపులో ఒరిపిడి.

నా కళ్లు వాలిపోయాయి.

''ఖాళీలేదు'' అన్నాను.

ఉష దగ్గరగావచ్చి సీసాలను ఎంతో పదిలంగా పక్కకు జరిపింది. నేలమీద కూర్చుని నా జుట్టులోకి వేళ్లు జొనిపింది.

నా చూపుల లెవెల్ కు ఉష వక్షస్థలంవుంది.

ఆమె గుండెలోని ఆ వేగాన్ని ఆమె వక్షస్థలం అందంగా చూపిస్తోంది.

బాధకూడా ఎంత అందంగా బయటపడే వీలుంది స్త్రీలో!

ఓ స్త్రీ! నీకు జోహార్లు.

నా జుట్టును ఆత్మీయంగా నిమురుతూ ఎంతో జాలిగా అడిగింది ఉష ''ఈపాటి మత్తు నా ప్రేమ కలిగించలేకపోయిందా శ్రీకాంత్!?''

నో. ఎలాంటి స్థితిలోనూ ఉష దిగజారిపోవటం నేను భరించలేను.

పెదిమలు వంకరపోయినా, మాట తడబడినా, అక్షరాలను అస్తవ్యస్థంగానే అయినా కూర్చాను.

''ఉషి,... నీ... ప్రేమను ఈ మత్తుతో పోల్చి... దాని స్థాయిని దిగజార్చకు. అది... అమృతం. ఇది... విషం''.

తన ప్రేమను అమృతం అన్నందుకు సంతోషించాలో, నేను విషాన్ని తాగుతున్నందుకు విచారించాలో తెలియనట్లుంది ఉషకు. వ్యర్థమైన చూపు చూస్తూ ''తెలిసీ విషాన్ని తాగటం

తుషార బిందువులో తుఫాను

ఎందుకు?'' అంది.

''బతికే వీలులేక''.

ఓపన్ చేసిన బీరుసీసాలా ఆమె కళ్లు కన్నీళ్లతో పొంగాయి. పంటి ఆసరాతో పెదవి వణకు నాపుకుంది. ముఖం పైకెత్తి కళ్లు మూసుకుంది.

ఘనీభవింపజేయాలని ఉష చేసిన వ్యర్థప్రయత్నంనుండి తప్పించుకున్న రెండు కన్నీటి బిందువులు ఆమె అందమైన బుగ్గలమీదికి వురికివచ్చాయి, నా పెదవుల ముద్రలతో పులకించాల్సిన బుగ్గలమీదికి.

నామీద నాకే కోపం వచ్చింది.

నా మీద నేనే కోపగించుకోవడానికి ఉషను బాధించాలా! నన్ను నేను కోపగించుకోవడం ఏమిటి! ఏమైనా అర్థంవుందా? అసలు నాకు బుర్ర వుందా?

తలమీద తడుముకున్నాను.

మెత్తని మొగ్గల స్పర్శ.

ఉషను అనునయంగా అక్కున జేర్చుకోవాలని పిచ్చికోరిక కలిగింది. నా బుర్ర సంగతి మరచిపోయాను. పిచ్చి మరి.

ఔను. నాది పిచ్చే. కాకపోతే ఎవరిని ప్రేమిస్తున్నానో, ఎవరిని ద్వేషిస్తున్నానో నాకే తెలియదు.

లేవబోయాను.

రంగులరాట్నం మీద కూర్చున్నానా నేను!? అది తెగిపోయింది అంతలోనే. వి రు చు కు ప...డ్డా...ను!

ఉ ష :

శ్రీకాంత్ గదిలో వెలుగుతూ కనిపించిన లైటు నా మనసులో ముసిరిన చీకటిని మరీ చిక్కబరిచింది. ఆ చీకటిలో తలఎత్తే ఆలోచనలు నలుపు పులుముకుని మరీ భయంకరంగా, జీమూతాల్లా...

కారు డోరు శబ్దంకాకుండా వేసి హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చున్నాను.

పని మనిషి రంగి ఏదో చెప్పబోయింది. ''ష్'' అన్నట్లుగా సౌంజ్ఞ చేశాను.

పైకి వెళ్లనా? ఊహూ. శ్రీకాంత్.. ఐ కాంట్ సీ. బట్... వెళ్లక తప్పదు; చూడక తప్పదు... ఎప్పడైనా.

శ్రీకాంత్ ఆనందంగా వుండాలి, తాగి అయినా సరే. కానీ ఆ తాగటంలో ఆనందాన్ని పొందుతూన్నట్లుగా కాక ఆవేదనను మరచిపోవాలన్నట్లుగా... అప్పుడు ఆయన తాగటం నాకు దుఃఖకరం కాదూ?

బాధలకు బ్రాందీ తాపి మగతలో పడేయడం కంటే కాస్త ఆనందం అనే విషం ఇచ్చి చంపటం మేలు, బాధలను. శ్రీకాంత్ కు నేను ఆనందం ఇవ్వటం లేదా? ఊహూ. ఆవేదన కలిగిస్తూన్న అనుభూతి. నా వల్లా! మే బి.

మరెవరైనా స్త్రీ...

నో. నెవర్.

మరి,

కావాలి కావాలనే తహతహతో అందుకున్న ఈ జీవితం ఇంత పేలవంగా తయారవుతూందేమిటి!

ఆడ పిల్ల పూల గుండెలను స్పృశించే ఆ తుమ్మెద కళ్ల మగవాడు... నన్ను మరీ మరీ మనసుపడి సొంతం చేసుకున్నవాడు, అందిన నాతోటి జీవితంలో ఇంత వైరాగ్యాన్ని అనుభవించటమా! లోపం ఎక్కడుంది?

శ్రీకాంత్ కోసం నేను పెంచుకుంటూన్న మనో పరిధితో పాటే ఎక్స్‌పాండ్ అవుతూన్న బాధ! ఆయన తాగుడుతో, ఆయన పడే వేదనతో సాంద్రత పెరిగి, చీకటి మూగి మనో కుడ్యాలను బీటలు వారుస్తూన్న బాధ! ఆయన ముందు బయట పడకుండా గుండె గోడలతో నొక్కి వుంచవలసిన బాధ! నవ్వు పూత పూసి తీపి మాత్రగా ఆయనను మాయపుచ్చవలసిన బాధ! ఎంత బాధ!


నా బాధ గురించి నాకు బాధ లేదు. అది ఆయన బాధలోంచి, ఆయన పడుతూన్న బాధలోంచి, దాన్ని చూడలేక పోవడం నుంచి వచ్చిన బాధ. అందువల్ల ఆయన బాధ హరించటం ముఖ్యం. దానికి నేను చేయాల్సిందేమిటి? తెలిసిన తప్పకు సరిదిద్దుకునే అవకాశం వుంటుంది. తెలియందే!

నా ఆత్మ పరిశీలనలో నాకు లభించిన సమాధానం నాలో అన్నీవున్నా ఎక్కడో ఏదో లోపం. కనిపించని, అర్థంకాని అసంతృప్తి. బహుశా అదేమిటో శ్రీకాంత్ కు తెలియదనుకుంటాను. ఈ అర్థంకాని బాధ, వివరించలేని క్లేశం హృదయాన్నంతగా నలిపివేస్తుందో నేనర్థం చేసుకోగలను. దాన్నుంచి శ్రీకాంత్ ను తప్పించేమార్గం ఆలోచించాలి.

పైకి వచ్చాను. రాక తప్పదు.

జీవితంలో ఎదైతే ఎదురుపడకూడదనుకుంటామో అదే తప్పనిసరిగా ఎదురుపడటం జీవితంలోని విషాదం— కాదు— జీవితసహజం!





ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

భారత యుద్ధానికి కారణం!?

భారత యుద్ధానికి కౌరవుల అవినీతీ, అసూయా కారణమైనా, దానికి పూర్వరంగం ప్రబలమైనది లేకపోలేదు.

పార్వతీ పరమేశ్వరులు సంకల్పించిక ఒక యజ్ఞాన్ని పంచముఖుడైన బ్రహ్మ జరుపుతున్నప్పుడు, ఆ బ్రహ్మ పార్వతీదేవి సౌందర్యానికి ముగ్ధుడైనాడు. ఒక ముఖం నుంచి అతని ప్రణయపూర్వక దృష్టులు పార్వతీదేవిపై ప్రసరించాయి. పార్వతికి అసహ్యం కలిగింది. విరించి అక్రమ ప్రవృత్తిని ఆమె భర్తకు సూచించినది. శివుడు కోపించి ఆ బ్రహ్మ శిరస్సును ఛేదించి, అతణ్ణి చతుర్ముఖుణ్ణి చేశాడు. ఆ పాతకం ఊరికే పోలేదు ఆ బ్రహ్మహత్యా పాతకశక్తి శివుణ్ణి ఆవేశించి మిక్కిలి బాధించసాగింది.

ఒకనాడు మహేశ్వరుడు శ్రీహరి నివాసానికి వెళ్లి "భవతి! భిక్షాందేహి" అని భిక్షను యాచించాడు. అప్పుడు లక్ష్మీదేవి స్నానం చేస్తూ ఉండినది. ఆ మాటలు వినగానే ఆమె త్వరగా స్నానం ముగించి, ఒక వస్త్రం శరీరానికి చుట్టుకొని భిక్షం తెచ్చి, గడప దిగకుండా తలుపుచాటున నిలిచియే శివునికి వేసింది. గుమ్మందాటి రాకుండా, లోపలనుంచే భిక్ష పెట్టడం మహా పాతకం. ఆమె చేసిన ఆ తప్పువల్ల ఆ పాతకశక్తి శివుణ్ణి విడిచి లక్ష్మీదేవిని ఆవేశించి, ఆమెను మిక్కిలి బాధించసాగింది. ఆ బాధను భరించలేక లక్ష్మీదేవి శ్రీహరితో మొరపెట్టుకొనగా, ఆయన బాగుగా ఆలోచించి ఆ మహాశక్తిని ఉద్దేశించి "అమ్మా! నీ కోరిక ఏమో చెప్పుము. దానిని తప్పక నెరవేరుస్తాను. ఈమెను మాత్రం బాధించక విడిచిపెట్టు" అని అడిగాడు. అప్పుడా శక్తి "నాకు నరబలి కావాలి. సామాన్యమైనది పనికిరాదు. పదులూ, వేలతో నాకు తృప్తి కలగదు. లక్షల సంఖ్యలో నరులు బలికావాలి. అలా బలియిస్తే ఈమెను విడిచిపెడతాను" అన్నది. శ్రీహరి క్షణమాలోచించి "సరే! నీ కోరిక తప్పక నెరవేరుతుంది. ద్వాపర యుగంలో పాంచాలరాజు ద్రుపదునికి పుత్రికవై ద్రౌపది అనే ప్రసిద్ధ నామంతో పాండవులకు పత్నివై జన్మిస్తావు. క్రూర స్వభావులైన కౌరవులు కష్టాలపాలు చెయ్యగా, పాండవులతోపాటు కష్టాలు అనుభవించి, కౌరవులవల్ల అవమానం పొంది పగ సాధిస్తావు. నీ క్రోధాగ్నికి గురియై భారత మహా సంగ్రామంలో కౌరవులు నశించగలరు. ఇలా నీ కోరికను తీర్చగలను" అని వాగ్దానం చేశాడు. ఆ మహాశక్తి వెంటనే లక్ష్మీదేవిని విడిచి వెళ్లింది. ఆ శక్తియే ద్రౌపదిగా అవతరించి భారతయుద్ధానికి కారణమైనది. ★

సీసాలమధ్య శ్రీకాంత్— ఊహూ— ఖాళీ సీసాల మధ్య!

గుండెల్లోని వేదనను విస్కీపోసి పూరబెడ్తే, పూరి మరీ పుబ్బిపోతుంది గానీ చస్తుందా? సగమౌతుందా?

ఎంత అమాయకపు శ్రీకాంత్!

తన కోసం నేనేమైనా చేయడానికి సిద్ధంగా వున్నాను. చివరికి నా రచనా వ్యాసంగాన్ని త్యజించడానికికూడా. ఆ ప్రేమ, ఆ ఆరాధననిండిన చూపు, ఆ శృంగారభావన- ఇవి చాలు నాకు. అయితే శ్రీకాంత్... నాతో సహకరించరు.

"నీ తప్పేమీ లేదు. అలా అనుకునే అపోహను నీకు కలిగిస్తే నన్ను క్షమించు" ఇదీ సమాధానం.

గదిలోకి అడుగు పెట్టాను.

శ్రీకాంత్... అస్తవ్యస్థంగా... మంచం మీద.

ఆయన కళ్లలోని తీవ్రమైనఎరుపు కనురెప్పలకూ పాకిజ్వలిస్తున్న భావన!

శ్రీకాంత్‌కళ్లు కొద్దిగా పైకి లేచాయి.

విచిత్రమైన చూపు! పాతాళంలోంచి హిమవన్నగ శిఖరాగ్రాన్ని చూస్తున్న భావన! అయినా ఆ చూపు నా కళ్లలోకే వుంది!

ఎంత విచిత్రం!

చిన్న సంభాషణ చివర నా గుండెల్లో పాడిచారు 'బ్రతికే వీలులేక' అనే ఒక్క మాట ముక్కతో.

బాధగా కళ్లు మూసుకున్నాను. నా కళ్లలోని బాధ ఆయనకు తెలియటం ఇష్టంలేదు మరి.

జీవితం, నాతో జీవితం అంత మరణ సాదృశంగా వుందా! పోనీ ఆ భయంకర మృత్యు భావనను నా సాన్నిహిత్యం మరిపింప లేకపోతోందా! ఇక కెందుకూ నా సాన్నిహిత్యం? నా సాహచర్యం?

శ్రీకాంత్ తల మీది నా చేతి మీద వెచ్చని స్పర్శ. ఆ స్పర్శ ప్రసారం చేస్తున్న ప్రేమ. ఆ ప్రేమ కల్పిస్తున్న నా గుండె ప్రకంపనలు...

మరి?

ఊహూ. ఈ బాధ ఇక నేను ...

ఏదో దబ్బున పడ్డ శబ్దం.

కళ్లు తెరిచాను.

శ్రీకాంత్...క్రింద పడ్డాడు!

లాయర్:

వాళ్లిద్దరికీ నేనే లాయర్ని.

పరస్పర సహకారంతో, ఏకాభిప్రాయంతో వున్నారు కాబట్టే ఇద్దరి తరఫునా నాకు వకాల్తా ఇచ్చారు.

వృత్తి ధర్మంగా వకాల్తా స్వీకరించినా మానవధర్మంగా ఇద్దరినీ విడివిడిగా కన్విన్స్ చేయ ప్రయత్నించాను. విడివిడిగానే అయినా ఇద్దరిదీ ఒకేమాట!

"నాకోసం కాదు. అవతలివాళ్ల కోసం. వాళ్లకు అడ్డు రాకుండా వుండడం కోసం."

అంతకుమించి వాళ్లు ఏమీ చెప్పకపోయినా నా లాయర్ దృష్టినుంచి వాళ్ల గుండె లోతులు తప్పుకోలేకపోయాయి.

ఎంత మేధావి ఆలోచనలైనా ఎప్పుడూ తనవైపునుంచి ప్రారంభమై తనవైపునుంచే ముగుస్తూ వుంటాయి. దృష్టి కోణమైనా అంతే. తన స్థానాన్ని లోకం వైపు నిలబడి లోకం దృష్టితో చూడాలిగానీ తన మనసులోని వ్యర్థపుటాలోచనల అంధకారపు మాదుమూలల నుంచి కాదు. ఈ కారణాన అందమైన జీవితాలు వికృతంగా ముగుస్తూ వుంటాయి.

వాళ్లిద్దరికీ విడాకు లిప్పించక తప్పలేదు. ✱

సీరియల్

వాసన మురళి

కొడాలి సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

మురళి రోడ్డుమీద నడుస్తోంది. ఆఫీసుకు టైమవుతుందని వేగాన్ని పెంచింది. మామూలుగా పది కొట్టేసరికల్లా ఆఫీసులో వుండేది. ఆవేళ చేతిలో చిల్లిగవ్వ లేదు. నెలాఖరు రోజులు. సంపాదించేదంతా పిన్నిచేతిలో పెడుతోంది తను ఓ పది ఖర్చులకుంచుకుని. కానీ; నెలలో ఆ పది కూడా ఇంట్లో ఖర్చుందని లాగేస్తుంది పిన్ని. చేసేదేం లేక రోజూ నడిచి వెళ్లడానికి అలవాటు పడుతోంది మురళి.

మురళి మనసు చాలా చికాగ్గా వుంది. పైగా ఆఫీసుకు వెళ్లాలన్న తొందరొకటి. మరో ప్రక్క వచ్చేముందు పిన్ని లేవదీసిన ధుమారం—ఘర్షణ తాలుకు మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. తలుచుకుంటే ఆమెకు కంపరంగా వున్నది.

పిన్ని చిన్నాన్నకొడుకు పెళ్లని అందర్నీ రమ్మని ఉత్తరం రాసి వెడ్డింగ్ పంపారు. అసలు వాళ్లకు తమకు అంతగా రాకపోకలు లేవు. ఏదో పిలవలేదనుకుంటారని మొక్కుబడిగా రాశారు. ఈ కరువు కాలంలో వరంగల్లు ఇంతమంది వెళ్లి రావాలంటే చాలా ఖర్చవుతుంది. పిన్నేమో వెళ్లక పోతె బావుండదని, తప్పక వెళ్లాలని పట్టుబట్టి కూర్చుంది.

''ఇప్పుడు అందరం ఎందుకు పిన్నీ? నీవు ఒక్కదానివే వెళ్లకూడదూ?'' అన్నది తను.

''అదేంమాట. మళ్లీ వెళ్లబోయి వెళ్తామా? చిన్నాన్నకు ఒక్కగానొక్క నలుసు. వాడి పెళ్లి కళ్లారా చూడాలని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నారు. ఖర్చని వెళ్లడం మానేస్తే నలుగురూ ఆడిపోసుకోరూ?— ఎక్కడన్నా ఓ ఐదువందలు అప్పు తీసుకురా. వచ్చే నెలలో ఇద్దాం —''

''నెలాఖరు రోజులు ఎవర్ని అడగాలి? అప్పు చేసి వెళ్లడం నాకిష్టం లేదు. అంతగా అయితే నీవక్క దానివే వెళ్లు —''

అక్కడి నుంచే ఘర్షణ మొదలయింది.

''నువ్వు సంపాదిస్తున్నావు గనుకే నీకంత టెక్కు. ముష్టి ఐదొందలు కోసం నీముందు చేయి చాచాల్సి వచ్చింది. ఆయన ఆరోగ్యంగా వుండి సంపాదనాపరుడైతే నాకీ బాధలు వుండేవా? కానీ లేవే .. నీ రోజులు... నీవు చెప్పినట్లు వినాలి. నీవు గీచిన గీటు దాటకూడదు. ఇదంతా నా ఖర్మ...'' అని నెత్తి బాదుకుంటూ అనేక మాటలన్నది.

ఆ క్షణంలో తనకు విపరీతమైన కోపం వచ్చింది. పరిస్థితుల్ని అర్థం చేసుకోదేం? నెలాఖరు రోజుల్లో ఐదువందలు ఎవరు ఇస్తారు? ఇచ్చినా తీర్చేదెలా? తన జీతమంతా ఇంటి ఖర్చులకే సరిపోతుంది. అర్థంలేని ఆర్భాటాలకు పోతుంది పిన్ని. ఆమె మాట ఆమెదే గానీ ఎదుటివాళ్ల కష్టసుఖాలు పట్టించుకోదు —

ఆలోచనలమధ్య పరధ్యాన్నంగా నడుస్తున్న మురళి ఎదురుగావస్తున్న లారీని గమనించలేదు. లారీడ్రైవర్ తాగివున్నాడేమో అడ్డదిడ్డంగా నడుపుతున్నాడు. లారీ దగ్గరగారాగానే ఉలిక్కి పడింది మురళి. భూతంలా మీదికి దూసుకు వస్తున్న లారీనిచూసి ఒక్కక్షణం భయంతో బిగుసుకుపోయింది. ప్రక్కకు తప్పుకోవాలన్న ధ్యాస తప్పినట్లు శిలాప్రతిమలా అలాగే నిలుచుండిపోయింది. ఇంతలో ఓ రెండు బలమైన హస్తాలు ఆమె భుజాన్నిపట్టి ప్రక్కకు లాగేయి.

లారీ వేగంగా దాటిపోయింది. ప్రమాదం కొంచంలో తప్పిపోయింది.

జరిగిన కథ — 1: విజయ్, మురళి కాశీకి పోతూ రైల్లో యాదృచ్ఛికంగా కలుసుకుంటారు. విజయ్ గడిచిపోయిన తన జీవితాన్ని సింహావలోకనం చేసుకోసాగాడు — విజయ్ పోలీసు ఇన్‌స్పెక్టరుగా ట్రయినింగ్ అవుతున్నాడు. మురళి ప్రయివేటు కంపెనీలో టైపిస్టుగా పని చేస్తూంటుంది. మురళి మంచితనం చూచి ఆమెను ప్రేమిస్తాడు విజయ్. మురళితో తను ఆమె స్నేహాన్ని కాంక్షిస్తున్నట్లు చెపుతాడు.

విజయ్ గాఢంగా నిట్టూరుస్తూ ఆమెను వదలి దూరంగాజరిగాడు.

''ప్రమాదం కొంచెంలో తప్పింది. అయినా రోడ్డుమీద నడుస్తున్నపుడు ఇంత పరధ్యాన్నం పనికిరాదు—'' సన్నగా మందలిస్తున్నట్టు అన్నాడు విజయ్.

మురళి తేరుకుని సిగ్గుతో కుచించుకుపోయింది. అతనివంక కృతజ్ఞతగా చూసింది.

''సారీ... ఆలోచనలతో లారీని గమనించలేదు. సమయానికివచ్చి కాపాడారు—''

''అవును బస్సులో రావచ్చుగా, నడిచివస్తున్నారేం?''

ఆ ప్రశ్నకు మురళి వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. 'నావద్ద చిల్లరడబ్బులులేవు—' అని ఎలా చెప్పగలుగుతుంది? అందుకే అందంగా అబద్ధమాడేసింది.

''బస్సు తప్పింది. ఆఫీసుకు టైమవుతుందని......''

''సరేపదండి. ఆటో ఎక్కుదాం—''

''అబ్బే... నేను నడిచివెళ్లగలను'' మొహమాటపడ్డది మురళి.

''బావుందండీ మీ మొహమాటం, ఎండ చూడండి ఎలా మండిపోతుందో... పైగా ఆఫీసు టైమ్‌కూడా దాటింది.'' అని ఆమె మాటలు పట్టించుకోకుండా ఆటోనుపిల్చి ఆపాడు.

''ఎక్కండి, నేనూ అటే వెళ్తున్నాను. మధ్యలో మిమ్మల్ని డ్రాప్‌చేస్తాను—''

మురళి మరేం అన్లేకపోయింది. మౌనంగా ఎక్కికూర్చుంది. నిజానికతను అంతకు ముందే ఆటోలో వెళ్లాల్సింది. దూరాన్నుంచి ఆమెను చూసి తనూ నడిచివచ్చాడు. ఆ వేళప్పుడతనికి పర్మిషన్ వుండదు బయటకురావడానికి. కానీ, రేపు అతని పుట్టినరోజు. అందుకని పర్మిషన్ తీసుకుని వచ్చాడు, ఓ జత బట్టలు కుట్టించుకుందామని.

ఆటోకదిలింది. ఆ కదలికల్లో అప్పుడపుడూ ఆమెశరీరం అతనికి తగులుతోంది— అతనిలో ఎన్నో మధురమైన ఊహలు దొల్లుతున్నాయి. ఆమె స్పర్శ అతనికి హాయిని గొలుపుతుంది. జీవితాంతం ఆమెతో అలా ప్రయాణంచేస్తే బావుండును— అనుకున్నాడు.

మురళి ఇదేమీ గమనించే స్థితిలో లేదు. పదిదాటింది టైమ్. రోజూ పది కొట్టేసరికల్లా ఆఫీసులో వుండేది. లేటవుతుందని ఒకప్రక్క— మరోప్రక్క ఎంత కాదనుకున్నా పిన్నిమాటలు మనసును తూట్లుపొడుస్తున్నాయి.

ఎదురుగా టాక్సీరావడంతో కాస్త ప్రక్కకు తిప్పాడు ఆటోను. ఆ ఊపుకు పరధ్యాన్నంగా వున్న మురళి విజయ్ వళ్లో పడిపోయింది. పడిపోకుండా ఆమెనలాగే పట్టుకున్నాడు.

మురళి సిగ్గుతో తలదించుకుని ''సారీ'' అంటూ దూరంగా జరిగింది.

విజయ్ లోలోన చాలా ఆనందించాడు.

పూవులాంటి సుతిమెత్తని ఆమె శరీర స్పర్శ అనిర్వచనీయానందాన్నిచ్చింది మరోసారి ఆమెను తాకాలనుకున్నాడు. సంస్కారం అడ్డురాగా మనసులోని చిలిపి కోరికను అదిమిపెట్టుకున్నాడు

''ఇక్కడాపండి—''అన్నది మురళి.

ఆటో ఆగింది. మురళిదిగి చకచకా లోపలకు వెళ్ళిపోయింది

విజయ్‌కు బాధకలిగింది 'అదేమిటి ? కనీసం థ్యాంక్స్ అయినా చెప్పకుండా వెళ్ళిపోతోంది!''అని

4

మరుదినం విజయ్ పుట్టిన రోజు. సామాన్యంగా ప్రతిఏడు తన పుట్టిన రోజున నలుగురికి తెలిసినవాళ్ళకు చాక్‌లెట్లు ఇచ్చి ఓ సినిమాచూసేసిసరిపెట్టుకుంటాడు. కానీ, ఈసారి పుట్టినరోజు అతని కెంతో ఉత్సాహాన్నిచ్చింది. సాయంత్రం అలా మురళితో షికారుకెళ్ళాలని పించింది. ఆమెతోకలసి సినిమా చూడాలని. ఇంకా ఎన్నోకోరికలు కలిగాయి

ఆరోజు సాయంత్రం పర్మిషన్‌తీసుకుని బయటకువచ్చాడు విజయ్. ఆఫీసులు వదిలేవేళకు బస్‌స్టాప్‌లో మురళికోసం నిరీక్షించసాగాడు

ఎంతసమయం గడిచినా మురళి జాడలేదు విజయ్‌కెంతో నిరుత్సాహంకలిగింది చటుక్కున అతనికి గుర్తువచ్చింది. 'కొంపదీసి ఈవిడ నిన్నటిలా నడిచివెళ్ళలేదుగదా!—' అన్న ఆలోచన అతన్నిముందుకు నడిపించింది

అలా అలా నడుస్తూ తిన్నగా మురళివాళ్ళ ఇంటికి చేరుకున్నాడు విజయ్ లోపలకు వెళ్ళాలా వద్దా అన్న సంశయంతో అలాగే గేటువద్ద నిలుచుండిపోయాడు ఇంతలో లోపలనుంచి బిగ్గరగా మాటలు వినిపించసాగేయి

''అయితే మమ్మల్ని పెళ్ళికివెళ్ళొద్దంటావు. అదేగా నీవు చెప్పేది ? — '' తీవ్రంగా వున్నదా స్వరం.

''నా మాట చెవిన వేసుకో పిన్నీ...అందరం వెళ్ళాలంటే సాధ్యంకాదని చెబుతున్నాను. నీవక్కడానివే వెళ్ళిరా ఎక్కడో ఓ చోట అప్పు తెచ్చిస్తాను —'' అది మురళి గొంతుక.

''ముష్టి రెండొందలు ఎవడికి కావాలే ? అవీ నీవే వుంచుకో. మమ్మల్ని ఉద్ధరిస్తావని కొంప గుల్లజేసాము. ఈ కాలానికి మేము నీకు వెగటై పోయాము. నీ సంపాదన ఏ బ్యాంకులోనో దాచుకుని కులకవే. మా పాట్లు మేము పడతాం —''

''ఎందుకన్ని మాటలు పిన్నీ! మీకు తెలియకుండా నేను ఏ బ్యాంక్‌లో దాస్తున్నాను ? నెలనెలా సంపాదించినదంతా నీకే తెచ్చిస్తున్నానుగదా ! నా దగ్గర నీకు తెలీకుండా ఏముంది ? నెలాఖరు రోజులు. అప్పుపుట్టదు. ఎలాగో సర్దుకోమని చెబుతున్నాను—''

''చెబుతావే ఎందుకు చెప్పవు. మహారాణిలా ఉద్యోగం వెలగబెడుతున్నానని బోడిగర్వం తలకెక్కిపోయింది. ఇక మమ్మల్నెందుకు లెక్క చేస్తావు ? నీ ఇష్టమొచ్చినట్లు ఊరేగు. మా కొంపకు శనిలా దాపురించావు. నిన్ను పెంచేకన్నా ఏ గేదెనో మేపినా విశ్వాసంగా ఇన్ని పాలిచ్చేది—''

మధ్యన కొంచంసేపు మురళి మౌనం. బహుశా వాళ్ళ పిన్ని మాటలకు బాధపడుతూ వుంటుంది.

''ఇదిగో నీకే చెప్పేది. ఏమైనాసరే రేపు



రాత్రికి మేము పెళ్ళికి వెళ్ళితీరాలి. ఎలా అఘోరిస్తావో నాకనవసరం. డబ్బు తెచ్చివ్వు. వింటున్నావా ?''

''నావల్లకాదు. నా దగ్గర డబ్బులేదు.''

''లేదంటే ఎలానే... అప్పచేయ్ --''

''నాకెవరూ అప్పు ఇవ్వరు. ఇక మీ ఇష్టం—'' అని విసురుగా బయటకు వచ్చింది మురళి. విజయ్‌ను చూసి కంగారుగా, సిగ్గుగా ఫీలయింది.

''మీరా !— '' అన్నది పారిపోతున్న గొంతుకతో.

విజయ్ మరేం అన్లేక తల దించుకుని చకచకా నడిచి వెళ్ళిపోయాడు.

* * *

విజయ్ వాళ్ల హాస్టల్లో రోజూకొకరు వంట చేయించే కార్యక్రమం నిర్వహిస్తారు. బియ్యము, బేడలు అన్నీ లెక్కప్రకారం కొలిచి వంటవాళ్లకు ఇస్తారు. మార్కెట్‌కు వెళ్లి కూరలు మంచివి చూసి తెస్తారు. ఆ పని ఆ రోజు విజయ్‌మీద బడింది.

కూరలు తేవడానికి మార్కెట్ వెళ్లాడు విజయ్. ''అక్కడ మురళి కనిపించి చిన్నగా నవ్వింది.'' ఆ నవ్వులో నిండుదనంలేదు. ఏదో దిగులు వెలితి కొట్టొచ్చినట్లు కనబడింది.

''ఏమిటలా వున్నారు ?— '' పరిశీలనగా చూస్తూ అడిగాడు విజయ్.

''ఎలా వున్నాను ?—'' తడబాటును కప్పి పుచ్చుకుంటూ అన్నది మురళి.

మానస మురళి

''ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా కనిపిస్తున్నారు.''

ఆమె నవ్వేసింది తేలిగ్గా. ''మీ రేదో ఊహించుకుంటున్నారు నేను బాగానే వున్నాను. నాకే దిగుళ్లులేవు ... అన్నట్లు మీరేం చేస్తుంటారు ? మార్కెట్‌కు ఎప్పుడూ వచ్చినట్లూ లేరే ?-'' అని మాటలు మార్చింది మురళి.

''నా పేరు విజయ్. హెచ్. డి. ఐ. ట్రైయినింగ్ అవుతున్నాను. మెస్సు ఇన్‌ఛార్జీ ఈవేళ నాదే... అందువలన వచ్చాను. కాబట్టే మీ దర్శనభాగ్యం లభ్యమయింది—''

నవ్వుతున్న విజయ్‌వంక ఒక్కక్షణం పరిశీలనగా చూసింది మురళి. ఆరడుగుల ఎత్తు, కండలు తిరిగిన దృఢమైన శరీరం, చక్కని ఫేస్. అందంగా, హుందాగా కనిపించాడు. 'ఇతనికి నేనంటే ఎందుకింత శ్రద్ధ ? పెద్దగా పరిచయం లేకపోయినా పదేపదే తటస్థపడి తన మీద ఆసక్తిని చూపుతున్నాడు. ఎందుకు ?—' మురళి మానసంలో ఏదో గిలిగింత రేగింది.

అది ఒక్కక్షణం మాత్రమే. అంతలో వాస్తవం ఆమె ఆశను హరించేసి నిరుత్సాహ పరిచింది.

''ఏం చేసారు ?'' అనే వున్నట్లుండి అడిగాడు విజయ్.

''ఏమిటది?—'' అర్థంగానట్లు విస్మయంగా చూసింది మురళి.

''అదే మీ పిన్నిగారి సమస్య. ఆవిడ పెళ్లికెళ్లాలని పంతం పట్టారుగా. మరి డబ్బెలా చూసారు.''

ఆ ప్రశ్నకు మురళి గతుక్కుమన్నది. 'మా కుటుంబ విషయాలు ఇతనికెలా తెలిశాయి ? అయినా దేనికింత చొరవ తీసుకుంటున్నాడు ?—' అని కొంచెం ఇబ్బందిగా ఫీలయింది.

''క్షమించండి. మీ కుటుంబ విషయాల్లో తలదూర్చడం తప్పే. కానీ, మిమ్మల్ని చూసాక మీరు నాకు చాలాఏళ్లనుండి పరిచయమున్నట్లుగా అనిపించి మీమీద ఆసక్తి పెరిగింది. మొన్న నా పుట్టినరోజు మీకు చెబుదామని, స్వీటు ఇద్దామని మీ ఇంటికి వచ్చాను. కానీ, మీ పిన్నిగారి మాటలు విన్నాక ఇంట్లోకి వచ్చే ధైర్యం చాల్లేదు—''అని నవ్వాడు విజయ్.

మురళి నవ్వలేదు.

'అయితే ఇతను తమ మాటలు విన్నాడా ! ఛీ...ఛీ... ఎంత పని జరిగింది ? ఇన్నాళ్ళూ గుట్టుగా బ్రతుకుతున్నాం...' అని సిగ్గుతో చితికిపోయింది మురళి.

అతను సానుభూతిగా చూసేడు

ఆతను సానుభూతి చూపుల్ని భరించగలేనట్లుగా ''సారీ విజయ్‌గారూ! మిమ్మల్ని ఇంట్లోకి పిలుద్దామనుకునేసరికే మీరు వెళ్లిపోయారు. మా పిన్నిది అదోరకం మనస్తత్వం.''

''అలా చెప్పకుండా మీ ఇంటికి రావడం నాదే పొరపాటు. మీకు అభ్యంతరం లేకపోతే ఓ మాట చెబుతాను వింటారా?—'' సందేహిస్తూ అడిగాడు విజయ్.

''ఏమిటి ? ''

''ఏంలేదు... మీకు డబ్బు అవసరంగా వుందని నిన్ననే పోస్టాఫీసులో డబ్బు డ్రా చేసాను. తీసుకుని మీ పని జరుపుకోండి. వెంటనే తిరిగి ఇవ్వాలని లేదు. మీకు ఎప్పుడు వీలైతే అప్పుడు ఇవ్వండి. తీసుకోండి... ప్లీజ్...'' అని ఐదు వందలు జేబులోంచి తీసి ఇచ్చాడు విజయ్.

ఆ డబ్బు విజయ్ చాలా శ్రమపడి ప్రోగు చేసుకున్నది. కాలేజీలో చదువుకునేప్పుడు రాత్రింబవళ్లు ట్యూషన్లు చెప్పేవాడు. తన ఖర్చుల్ని పరిమితం చేసుకుని ఒక రెండువేలు మిగుల్చుకోగలిగాడు. ఎన్ని అవసరాలు వచ్చినా ఆ డబ్బును కదిలించలేదు. నా అనేవాళ్లు లేని తనకు ఎప్పుడు ఏం అవసరం వస్తుందోనని అలాగే వుంచేసాడు. ఈరోజు మురళి కోసం అందులో ఐదు వందలు తీసాడు. ఆమెకు సాయం చేయాలని, ఆమె ప్రేమను పొందాలని అతనికి మహా ఆరాటంగా వున్నది.

మురళి డబ్బు చూసి విస్తుపోయింది. వెంటనే చేయి ముందుకు చాచలేకపోయింది. అభిమానం అడ్డు తగిలింది.

''అభిమానపడుతున్నారు గదూ ! మీ అభిమానాన్ని దెబ్బతీయాలని నా అభిమతం

కుమారి హర్జీత్ కౌర్ సోధీ నృత్యం



నాట్యాచార్య శ్రీ పసుమర్తి రామలింగ శాస్త్రి శిష్యురాలు కుమారి హర్జీత్‌కౌర్‌సోధీ భరతనాట్య ప్రదర్శన ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రసికులను మైమరిపించింది. వయసులో చిన్నదైనా నృత్తము, నృత్యము, అభినయము ఈ మూడింటిలోను మంచి సాంప్రదాయ శాస్త్రీయ పద్ధతిలో పలు అంశాలను ప్రదర్శించిన ఈ చిన్నారి, ప్రేక్షకుల మెప్పు పొందింది. ముఖ్యంగా, నాటకురంజి రాగ పద వర్ణము ''చలయేల చేసేవు''ను త్రికాలములో పద విన్యాసముతో అతి వివరముగా సాహిత్యార్థమును వెల్లడించి, తనకు ప్రజ్జ్వల భవిష్యత్తు గలదని నిరూపించుకున్నది.

గురువు నట్టువాంగం చేయగా శ్రీమతి లక్ష్మిసుబ్రహ్మణ్యం గాత్ర సహకారము, మృదంగంపై శ్రీ కొలంక లచ్చారావు, వయలినుపై శ్రీ తంపెళ్ల సూర్యనారాయణ, వేణువుపై నాగరాజు సహకరించి ప్రదర్శనకు మెరుగులు దిద్దారు.

— ఓ. వి.

గాగు. మీకు ఏదో రీతిన సాయం చేయాలన్నదే నా సంకల్పం. స్నేహితునిగా మీ కివ్వకూడదా?—''

అతని మాటల్లోని నిజాయితీ, మంచితనం ముందు ఆమె తలవంచేసింది.

''పేదరికం పాపం కాదు. మధ్యతరగతి సంసారాల్లో ఇలాంటివి మామూలే... నేనూ ఒకనాడు భయంకరమైన పేదరికాన్ని అనుభవించాను. ఓ స్నేహితునిగా మీ కష్టసుఖాల్లో భాగం పంచుకోవాలని ఆశపడుతున్నాను. నన్ను దూరంగా పెట్టకండి —'' బలవంతాన ఆమె చేతిలో డబ్బు పెట్టాడు విజయ్.

మురళి మరేం అన్లేకపోయింది. కృతజ్ఞతగా చూసింది. 'దేవునిలా అవసరానికి డబ్బిచ్చారు. మీ ఋణం త్వరలో తీర్చుకుంటాను —'

ఆ చూపుల్లోని భావానికి విజయ్ తృప్తిగా నిట్టూర్చాడు.

''ఇకమీదట మీకో స్నేహితుడున్నాడు. ఏం కావాలన్నా, ఏం జరిగినా చెప్పకోవాలి తెలిసిందా ? అన్నట్లు చెప్పడం మరిచాను. నాకు శని ఆదివారాలు సాయంత్రాలు మాత్రమే బయటకు వచ్చేందుకు పర్మిషన్ లభిస్తుంది. రేపు శనివారం... మీకోసం బీచ్‌లో ఎదురు చూస్తుంటాను. మీ కిష్టమైతేనే రండి —'' అని తలదించుకుని రిక్షాలో కూరలు గంపలు పెట్టుకుని వెళ్లిపోయాడు విజయ్.

5

రోజులు గడిచేకొద్దీ వాళ్ల పరిచయం బలపడింది. విజయ్‌కు మురళిపట్ల ఆకర్షణ నానాటికీ పెరుగుతోంది. మనసునిండా ఆమె రూపు నింపుకున్నాడు. వారానికొకసారైనా ఆమెను చూడనిదే, ఆమెతో మాట్లాడనిదే వుండలేకపోయాడు. ఎన్నోసార్లు తన మనసును ఆమె ముందు విప్పబోయాడు. కానీ, ఏదో జంకు, భయం వలన తన ప్రేమను గుండెదాటి బయటకు రానివ్వలేదు.

ఎన్నోసార్లు ఆమెకు పదీ పరక డబ్బు సాయం చేస్తున్నాడు. అలా ప్రతిసారీ అతని దగ్గర డబ్బు తీసుకోవాల్సి వచ్చినపుడు ఆమె చాలా బాధపడేది. కానీ పరిస్థితుల తాకిడికి తట్టుకోలేక — అవసరం ఆమె అభిమానాన్ని ఇరుకున పెట్టేది. ఒకరోజు అక్కడికీ అన్నది.

''ఇలా ప్రతిసారీ మిమ్మల్ని అడుగుతున్నందుకు ఏమీ అనుకోవడంలేదుగదా ?''


''అనుకుంటున్నాను —'' అని నవ్వాడు విజయ్.

''ఏమని ? మీ బాకీ తీర్చలేననా ?—''

''అవును మురళీ—! నీవు నా బాకీ తీర్చ కూడదు.''

''అదేం ? మీకు డబ్బు ఎక్కువయిందా?''

''ఎక్కువయిందని కాదు. బాకీ తీర్చేస్తే మన స్నేహం పలచబడిపోతుందని భయం.''



ఆతలే జెఱుచును వాచార క్రమమెల్ల
చీతటే జెఱుచును చిత్తశుద్ధి
వేతటే జెఱుచును వెనుకటి బిగువెల్ల
విశ్వదాభిరామ వినుర వేమ.

మురళి రెప్ప వేయడం మరిచి అతన్ని రెండు క్షణాలు అలాగే చూసింది.

'ఎంత మంచివాడు. తనలో ఏం ప్రత్యేకత వుందని తన స్నేహాన్ని కాంక్షిస్తున్నాడు ? తనకు సాయం చేయడంలో మరో వుద్దేశ్యం లేదుగదా ! ఛ... ఛ... ఇతనలాంటివాడు కాదు. ఇతను మనసు నిర్మలమైంది. ఇతని సాయంవలన తనిప్పుడు కాస్త నిశ్చింతగా వుండగలుగుతోంది. పిన్ని అడిగినపుడల్లా పదీ, ఐదు ఇవ్వడానికి తనవద్ద డబ్బు మిగులుతుంది. కానీ ఇతని బాకీ పెరిగిపోతోంది. వెయ్యి రూపాయలు పైగానే అయింది. ఎలా తీర్చడం ? — ఇతనేమో బాకీ తీర్చకపోతే బావుంటుంది అంటున్నాడు. తన కెలాగో వుంది —'

''ఏమిటలా కొత్తగా చూస్తున్నావు ?''

విజయ్ ప్రశ్నలకు ఆమె ఆలోచనలుతెగాయి.

''ఏంలేదు. నిజంగా మీ అప్పు తీర్చలేనేమో ననిపిస్తుంది —''

''అలా అయితే మరీ మంచిది — ''

మురళి మనసు రెపరెపలాడింది. 'ఎందుకంత ఆనందపడుతున్నాడు ? ఎవరేనా అప్పు తీర్చకపోతే ముఖం మాడ్చుకుంటాడు. మరి...? ఆ కళ్లలో మెరుపుల కర్థం ? ఇది స్నేహమేనా? లేక తనమీద జాలా ? కాదు ... అవేమీ కావు...' ఏదో అవ్యక్తమైన భావన ఆమె మనసున రేగి సిగ్గు పరిచింది.

''మురళీ ! నిన్నొక మాట అడగనా ?''

''అడుగు — ''

''ఏంలేదు. ఎప్పుడూ ఆఫీసు పని — ఇంటి పనులతో నలిగిపోతున్నావుగదా...రేపు ఆదివారం ఒక్కరోజు ... అలా సినిమాకెళ్తే రిలీఫ్‌గా వుంటుంది గదూ!'' బెరుకుగానే అడిగాడువిజయ్.

అతన్ని ఏడిపించాలనే తలంపు కలిగింది మురళికి.

"అంటే మీ ఉద్దేశ్యం ఇదన్నమాట. ఇన్నాళ్ళూ మంచివారిలా నటించి దగ్గరకు చేరారు. కాస్త చనువుగా మాట్లాడేసరికి ఆ రోజు బీచ్‌కు రమ్మన్నారు. ఈ వేళ సినిమా కంటున్నారు. ఎంత ధైర్యం మీకు–" కోపంగా అన్నది మురళి

విజయ్ కలవరపడిపోయాడు.

"మురళీ! నీవు నన్ను అపార్థం చేసుకుంటున్నావు నిజంగా నాకెలాంటి దురుద్దేశ్యం లేదు. నిజం ... ప్లీజ్ నా మాట నమ్ము .." అర్థింపుగా చూసాడు.

అతని భయాన్ని చూసి ఆమె లోలోపల నవ్వుకుంది.

"మరేమిటి మీ ఉద్దేశ్యం? ఒంటరి ఆడపిల్లను పట్టుకుని సినిమాకు రమ్మంటారా? మగబుద్ధి పోనిచ్చుకున్నారుగాదు ఇలాంటివారని తెలిస్తే అసలు దగ్గరకు రానిచ్చేదాన్నికాదు –"

విజయ్ ముఖం తెల్లగా పాలిపోయింది. తుపాకిగుండ్ల దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడి పోయాడు. ఆమె తనను అపార్థం చేసుకుందని తెగబాధపడిపోయాడు.

అతని ముఖాన్ని చూసి ఆమె పకపక నవ్వేసింది.

విజయ్ విస్మయం చెందాడు.

"పెద్ద మగధీరులు. రెండు మాటలకే ఎలా అయిపోయారో చూడండి. కాబోయే పోలీసాఫీసరు ఇలాగేనా వుండేది?" అని పడిపడి నవ్వింది మురళి.

విజయ్ తెల్లబోతూ "మురళీ! నీకు నిజంగా కోపం రాలేదా?" అని అడిగాడు.

"లేదు. మిమ్మల్ని ఓ ఆట పట్టిద్దామని" అల్లరిగా నవ్వింది మురళి.

"చంపేశావ్ ఫో ... నా మాటల్ని ఎక్కడ అపార్థం చేసుకున్నావోనని హడలిపోయాను."

"సరేగాని, నన్ను సినిమాకు రమ్మనమని అడగడంలో మీ ఉద్దేశ్యం?"

"ఊరికే.. మనం ఫ్రెండ్స్‌కదాని." అని నీళ్లు నమలాడు విజయ్.

"అంతేనా .. లేక ... " కొంటెగా ఉడికింపుగా చూసింది మురళి.

"నేను అలాంటివాడిని కాదు."

"మరెలాంటివారు?" అని నవ్వుతూ "అలాగే వస్తాను –" అన్నది మురళి.

"థ్యాంక్స్ మురళీ–" అతని ముఖం వికసించింది. చిన్నపిల్లాడిలా ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని నలిపేశాడు సంతోషంగా.

అతని సంతోషాన్ని చూసి 'ఏమిటీ పిచ్చి? కళ్లెగరజేస్తే కలవరపడ్డాడు. సినిమాకు వస్తానంటే సంబరపడుతున్నాడు. చాలా చిత్రమైన మనిషి. ఈ మనిషిమీద ఏదో ఆకర్షణ కలుగు

మానస మురళి

తుంది.. ఇంతకు ముందులేని విచిత్రమైన భావనలు కలుగుతున్నాయి. ఇతనిలో ఆకర్షించే గుణం అమాయకత్వం! మంచి మనసు. అవే తనను సూదంటురాయిలా ఆకర్షిస్తున్నాయి. దీని పర్యవసానమేమిటి? ప్రేమా ...?!–' మురళిలో ఎన్నో ఆలోచనలు తీగెలాసాగుతున్నాయి.

* * *

కొంతకాలం జరిగిన తరువాత ఒకరోజు... బీచ్‌లో ఇసుకలో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని ఐస్‌క్రీమ్ తింటున్నారు. వున్నట్లుండి చిలిపిగాలి హుషారుగా దూసుకువచ్చి మురళి కొంగును పైకిలేపి తన ముఖంమీద పడేసింది మురళి సిగ్గుతో కొంగు లాక్కుంది.

"ఛీ ... పాడుగాలి.." అన్నది చిరు కోపంగా.

విజయ్ ఆ మాటకు విపరీతంగా నవ్వేసాడు.

"ఎగరాలనుకునేవాటిని అంతగా నిర్బంధించడం మంచిదికాదు –" కొంటెగా అన్నాడు.

"నిర్బంధంలోనే కొన్ని అందాలకు మరింత రాణింపు వస్తుంది –" అని మురళికూడా శృతి చేసి నవ్వింది. అలా ఎంతోసేపు వారిమధ్య కబుర్లు దొర్లాయి.

"ఏమిటి ఏదో మాట్లాడాలన్నావుగా?–" గుర్తుచేసింది మధ్యలో మురళి.

"అబ్బే ... ఏంలేదు –"

"ఈపాటిదానికేనా ఇంతదూరం తీసుకు వచ్చింది?" ఎగతాళిగా నవ్వింది. అతనికి కాస్త రోషం వచ్చినట్లయింది. మనసులోని మాట అడిగేయాలనుకున్నాడు.

"మురళీ!నా గురించిఏమనుకుంటున్నావు?"

"ఇంకా ఏమీ అనుకోలేదు –"

"అన్యాయం కదూ! –"

"ఏది న్యాయమంటావు? అర్హత లేనివాళ్లు ఆశలు పెంచుకోవడం న్యాయమంటావా? –"

చటుక్కున ఆమె కళ్లలోకి చూసాడు. ఆ మాటల వెనుక దాగివున్న ఆశ, ఆ కళ్లలో కనిపించిన మూగ కోరికల్ని అర్థం చేసుకున్నాడతను.

"మురళీ నేను ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తోందో లేదో తెలుసుకోవడం కష్టంగా వుంది. ఆమె ఇష్టపడితే పెళ్లి చేసుకోదలిచాను –" అన్నాడు సూటిగా.

ఆ మాటలకు మురళి వదనం గంభీరంగా మారిపోయింది.

"విజయ్‌గారూ! మీరు చాలా తొందరపడుతున్నారు. ఆమె చాలా దురదృష్టవంతురాలు. ఆమెకిప్పట్లో కళ్యాణ యోగం లేదు. ఆమె మీద బండెడు సంసారం ఆధారపడి వుంది. తన స్వార్థం కోసం తనవాళ్ల నందర్నీ గాలికి వదిలేయలేదు. కనుక ఆమెమీద ఆశలు పెంచుకోకండి. ఆమెతో పెళ్లి జరగదు–" మ్లానమైన ముఖంతో అన్నది మురళి.

అతను బాధపడ్డాడు. చిరునవ్వు నవ్వాడు.

"మురళీ! మనం కావాలని ఇష్టపడినపుడు అవన్నీ సమస్యలుగా మిగలవు. ఇన్నాళ్ళూ చెప్పలేని మాట సమయం వచ్చింది కాబట్టి ఇప్పుడు చెబుతున్నాను విను. నిన్ను నా హృదయ సమానంగా ప్రేమిస్తున్నాను. గుండె గుడిలో నీ ప్రతిమను పూజిస్తూ, ఆరాధిస్తున్నాను నీకిష్టమైతే మీ 'పెద్దవాళ్లతో నేను మాట్లాడుతాను. ఒకవేళ వాళ్ళు అంగీకరించకపోతే అది వేరే విషయం. నీ బాధ్యతల్ని– సమస్యల్ని నేను పంచుకుంటాను. ట్రైయినింగ్ అయిపోతూనే నేనూ ఉద్యోగంలో చేరతాను. అప్పుడు ఇద్దరం సంపాదించవచ్చు. దానితో అందరం కలిసి బ్రతకవచ్చు ఏమంటావు?"

"మీరు మరోసారి నిదానంగా ఆలోచించుకోండి. మా పిన్ని మనస్తత్వం చాలా భయంకరమైనది –"

"ముందు నీ విషయం చెప్పు. నీకిష్టమే గదూ?"

"మన ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేదండీ! నాలాంటి మధ్యతరగతిలో జన్మించిన యువతికి ప్రత్యేకమైన ఇష్టాలుండ కూడదు వున్నా అవి ఫలించకపోవచ్చు –" నిరుత్సాహంగా అన్నది మురళి.

"ఎందుకు ఫలించవు? నేను నిన్ను ఇష్టపడి పెళ్లాడతానంటున్నాను. నీ బాధ్యతల్ని పంచుకుంటానంటున్నాను. ఇంకేమిటి అభ్యంతరం?"

"పెళ్లనేది నూరేళ్లపంట. ఆవేశంలో – వేడి వయసులో ఆలోచనా రహితంగా తలవంచితే జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. నేను మీకు తగినదాన్ని కానేమో ..."

"ఆ విషయం నిర్ణయించుకో దలిచింది నేను. నిన్ను పొందడం గొప్ప వరంగా భావిస్తున్నాను. నామాట కాదనకు ప్లీజ్..." అర్థింపుగా అడిగాడు విజయ్.

"నాకు కొంచెం టైమ్ కావాలి. మీరు తీసుకున్నంత త్వరగా నేను నిర్ణయం తీసుకోలేను. ఎంతైనా ఆడపిల్లను. పైగా రెండు నెలలు గడిస్తే నా ఉద్యోగం పోతుంది. టెంప్రవరీ పోస్టు అది. మరొకటి వెదుక్కోవాలి. ఈ ఆరాటంలో పెళ్లిని గురించి ఆలోచించేందుకు కాస్త వ్యవధి కావాలి. నా అభిప్రాయం తరువాత చెబుతాను –"

"అలాగే ఆలోచించుకో మురళీ! చదువుకున్న వాళ్లం. పిరికిగా వెనక్కి పోగూడదు. ధైర్యంగా నిలబడుదాం. నీకు మరో మంచి ఉద్యోగం వచ్చేలా నేనూ ప్రయత్నిస్తాను. నీ అభిప్రాయం నాకు అనుకూలంగా వుంటుందని, ఉండాలని ఆశిస్తున్నాను–" అన్నాడు విజయ్.

(ఇంకా వుంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. ఎమ్. ఆర్. — హైదరాబాదు

స్త్రీ అంటే దయామయురాలు, ఆదిశక్తి యింకా ఎన్నెన్నో. అటువంటి స్త్రీ కట్నం ఎక్కువ తీసుకురాలేదన్న నెపంతో సాటి స్త్రీని కష్టాలపాలు చేస్తే బాధలకు తట్టుకోలేక ఆత్మహత్యలకు దారితీస్తూంది. తను చనిపోయి దుష్టులను క్షేమంగా వదలివేస్తూంది...

★ నిజమే. కాని ఒక్కటి వుంది ఈ కట్నం చావుల వెనక రకరకాల 'సైకలాజికల్' సమస్యలు కూడా ఎక్కువగా వుండి — మనిషిలోని రాక్షసత్వాన్ని రెచ్చకొట్టే ప్రమాదం వుంది. మనో శాస్త్రవేత్తలు, సైకియాట్రిస్టులు — యీ దారుణాల వెనుక స్త్రీల 'మెనోపాస్' తత్వాల ప్రతాపం వుందా అనేది పరిశీలించి చూస్తే బాగుండును. ఎందుకంటే — కోరి కోడల్ని తెచ్చుకుని ఎందుకా తల్లి యిలా చిత్రహింసలు పెడ్తోంది? ఒక్క డబ్బు కోసమేనా? ఆ డిమాండ్ల వెనుక ఒక రకమైన సాడిస్టిక్ తృప్తి పొందుతోందా?... నాకిలా ఎన్నో అనుమానాలు.

షణ్ముఖ — సువాబేద

పురుషుని ప్రతిభకు స్త్రీయే కారణం అంటారా?

★ ఒక విధంగా — అంతేకదా!

జీవితంలో కోరిన కోరికలన్నీ తీరవు. కారణం ఏమిటి అక్కయ్యా?

★ తీరిన కోరికల స్థానే కొత్త కోరికలు పుట్టుకొస్తూండడమే!

★ స్త్రీని పువ్వుతో పోల్చడం అనాదిగా వస్తూంది కారణం?

★ సున్నితమైన తత్వం కలది కనుక.

ఎమ్. ఎన్. ఎమ్. — మంథని

ప్రేమకు నిర్వచనం ఏమిటి?

★ అనిర్వచనీయమైనది ప్రేమ... ఒక్క ముక్కలో చెప్పలేనిది ప్రేమ.

రమేష్ — ఇల్లెందు

ఈ కలికాలంలో ఆడది వరకట్నం నుంచి బయట పడగలదా?

★ ఎందుకు పడలేదు? పెళ్లే ధ్యేయంగా ఆడపిల్లలని పెంచినంతకాలం—వాళ్లనెంత కట్నం పోసేనా వదుల్చుకోవాలన్న ఆత్రుత వుంటుంది అమ్మాయి చదువు సంధ్యలు నేర్చి, ఆర్థికంగా తన కాళ్లపై తాను నిలబడే ప్రయత్నం చేసి, 'తనను కావాలనుకున్నవాడు వచ్చినప్పుడే పెళ్లాడతాను కట్నం ఇచ్చి భర్తని కొనుక్కోవలసిన గతిలో నేను లేను' అని ధైర్యంగా నిలబడ నేర్చుకోవాలి.

వెంకట్ — ఉరవకొండ

మీ అభిప్రాయంలో పాపం అంటే ఏమిటి?

★ నావల్ల ఎదుటివారు కష్టపడకుండా వుండడం పుణ్యం అనుకుంటే—నావల్ల కష్టపడడమే పాపం అనుకుంటాను నేను.

ఎస్. కె. — జెంషెడ్‌పూరు

మీకు మగవాళ్ల పైన ఎందుకండీ అంత కోపం?

★ అందరి మీదా నాకెందు కుంటుంది కోపం? కొందరి మీదే — అది వాళ్లకీ తెలుసు!

ఎన్. బిహెచ్. ఆర్. — చీపురుపల్లి

నిజాయితీగా పరీక్ష రాసి ఫెలయిన వాడు గొప్పా; కాపీ కొట్టి పాసయిన వాడు గొప్పా?

★ మహాప్రభో! పరీక్షలు, ప్యాసులు, ఫెళ్లు, విద్యార్థులు చదువులు, వీటి గురించి అడక్కండి. సిగ్గుగా వుంది!

బి. ఆర్. కె. వరంగల్

ప్రేమించడం గొప్పా? ప్రేమించబడడం గొప్పా?

★ ప్రేమించడంతో అవతలివారు, ప్రేమించబడడంతో యివతలివారు — సుఖపడతారు!

పి. యు. ఎమ్. — కాశీబుగ్గ

ప్రశ్నలు అడిగే పాఠకులకు ప్రేమమీద పెళ్లిమీద తప్పితే మరే అంశం దొరకదా? యీ ప్రశ్నలతో మీకు బోరు కొట్టదా జవాబివ్వడానికి?

★ ప్రేమా పెళ్లి బోర్ ఏమిటి? ఎవరేనా వింటే నవ్వుతారు!... నాకు బోర్ కొట్టదు—అడిగేవిషయం ఒకటే అయినా వ్యక్తులు వేరు వేరు కదా?!

ఇద్దరం కలసి కలలుకన్నాం, పెళ్లి చేసుకుని జీవిత భాగస్వాములుగా వుండాలని నిర్ణయించుకున్నాం. కాని నేనంటే ఇప్పుడు ఇష్టంలేదని చెప్పి నా మనసు గాయపరచింది...

★ దీన్నిపట్టి స్త్రీని చపలచిత్తం అనేస్తారు. నాకు తెలుసు, కాని ఆడదాని మనసులో ఎంతో ఘర్షణ జరిగితేగాని...యింతటి నిర్ణయం తీసుకోదు.

జె. కె. — సుల్తానాబాదు


కోటి విద్యలు కూటికొరకే అన్నట్లు ఆ కాలం వస్తుందంటారా?


★ ఇప్పుడున్నదేమిటి? కోటివేషాలు కూటి కొరకని మారిందంతే.

భవాని — మచిలీపట్నం

సున్నితమైన హృదయానికి దెబ్బతగిలిన తరువాత ఆ హృదయంలో శాంతి మందిరాన్ని నిర్మించడం సాధ్యం అవుతుందంటారా?

★ శాంతి మందిరానికి పునాది తవ్వేలోగా వున్న గుండె పుటుక్కు మంటుందేమో భవానీ... ఏదైనా మరుపు మందు వేయిస్తే?!











సినిమా




ప్రతాప్‌పోతాన్, తులసి, కృష్ణ 'అమాయకుడు కాదు అసాధ్యుడు'

"ఖైదీ"

"మా చిత్రంలో సంయుక్త అనే కొత్త తారను పరిచయం చేస్తున్నాం మరో విశేష మేమిటంటే మా హీరో చిరంజీవి తండ్రిగారు వెంకటరావు కూడా ఒక పాత్రను ధరిస్తారు," అన్నారు కె ధనంజయరెడ్డి ఈయన సంయుక్త మూవీస్ పతాకంలో నిర్మించే "ఖైదీ" చిత్రం షూటింగ్ జూన్ 16 న మొదలైంది మాధవి, సుమలత, సంగీత, నిర్మల, శరత్‌బాబు, రావు గోపాలరావు, నూతన్‌ప్రసాద్, శివప్రసాద్, రాళ్ళపల్లి, సుత్తివేలు పాల్గొంటున్నారు తొలి షెడ్యూల్ నాలుగురోజుల పాటు జరిగింది జూలై, ఆగస్టులో ప్రతినెలా 12–25 తేదీల మధ్య జరిగే చివరి రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త వి యస్ ఆర్ స్వామి ఛాయ, భాస్కరరాజు శిల్పం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో డాక్టర్ ఎం తిరుపతిరెడ్డి సమర్పించే ఈ చిత్రానికి ఎ కోదండరామిరెడ్డి దర్శకుడు

'రాజ్‌కుమార్'లో జయమాలిని



"రంగుల కల"

"ప్రజల ఆక్రందనలను ప్రతిబింబించగలిగినప్పుడే ఏ కళ అయినా సార్థకం, చెందుతుంది అనే ప్రాతిపదిక మీద రూపొందించబడిన "రంగుల కల" చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది ఈ చిత్రంలో నేటి సామాజిక వ్యవస్థ ముగ్గురు చిత్రకారుల దృక్పథాల ద్వారా చూపబడింది తన గమ్యమేమిటో తెలియక నిరాశా నిస్పృహలతో క్రుంగిపోయే ఓ చిత్రకారుడు సమాజంలోని ఘరానా మనుషుల అన్యాయాలను నిరసిస్తుంటాడు కీర్తి కండూతి కోసం అడ్డదారులైనా తొక్కడానికి వెనుకాడని మరో చిత్రకారుడు–సామాజిక దృక్పథం, అభ్యుదయ ధోరణులు లాంటి మీద ఏ మాత్రం నమ్మకం లేని అవకాశవాది చుట్టూ గీత గీసుకుని మధ్యలో ఉండిపోయి, తనలాంటి వాళ్ళ జీవితాలు విషాద పూరితమనే భావంతో ఉన్న ఇంకొక చిత్రకారుడు నిరాశావాది ఈ ముగ్గురు చిత్రకారులుగా బి నరసింగరావు, సాయిచంద్, చంద్ర నటించారు మొదటి చిత్రకారుడి జీవితంలోకి ప్రవేశించిన ఉపాధ్యాయురాలుగా రూప, సాత్వికేయుడుగా నారాయణరావు, కార్మికుడుగా కాకరాల నటించారు బి నరసింగరావు దర్శకత్వంలో కె వెంకటేశ్వరరావు, జి రవీంద్రనాథ్ నిర్మాతలు

శోభన్‌బాబు, సరిత, రాధిక




విశేషాలు

-జి. వి. జి.

'నేటి భారతం'

"సమస్యాత్మక చిత్రం," అన్నారు నవ దర్శకుడు టి. కృష్ణ. కమ్యూనిస్టుపార్టీలో ప్రముఖ కార్యకర్తగా ఉన్న ఈయన 1966 నుంచి నటుడుగా, దర్శకుడుగా, గాయకుడుగా ప్రజా నాట్యమండలికి ఎనలేని సేవ చేశారు. గుత్తా రామినీడు, మాదాల రంగారావు చిత్రాలకు సహకార దర్శకుడుగా పని చేశారు. కొన్నిచిత్రాల్లో నటించారు కూడా. ఈయన దర్శకత్వం వహించే ఈతరం పిక్చర్స్ "నేటి భారతం" లో శివకృష్ణ ప్రధాన పాత్రధారి. సుమన్, విజయశాంతి, కె. విజయ, పి. ఎల్. నారాయణ, నర్రా వెంకటేశ్వరరావు, చలపతిరావు, వీరభద్రరావు, తూనిగుంట, పరమానందంతో పాటు నాగభూషణం ఒక విలక్షణమైన పాత్రలో కనిపిస్తారు. జూన్ 3న తొలిగీతం ధ్వనిముద్రితమైంది. మోదుకూరి జాన్సన్ సంభాషణల కర్త. శ్రీ. శ్రీ, అదృష్టదీపక్ గీతాలకు చక్రవర్తి స్వరకల్పన చేశారు. ఆర్. రామారావు ఛాయ, ఉర్వి శిల్పం, చౌదుల సుబ్బారావు కూర్పు, ముత్యాలసుబ్బయ్య సహకార దర్శకత్వంతో ఈ చిత్రాన్ని నిర్మించే పి. వెంకటేశ్వరరావు "జూన్ 15 నుంచి జూలై 15 వరకు మద్రాసు పరిసరాలలో ఒకే షెడ్యూల్లో షూటింగ్ ముగుస్తుంది," అన్నారు.



అక్కినేని, జయప్రద, శరత్‌బాబు 'అమరజీవి'


ధర్మకర్త

"ప్రస్తుతం కొత్త నటీనటులను ఎంపిక చేస్తున్నాం. జూన్ చివరి వారం నుంచి కాకినాడ, వేలంగి, యానాం, అన్నవర ప్రాంతాల్లో ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తి చేస్తాం," అన్నారు కాకినాడలో ప్రముఖ వాణిజ్యవేత్త అయిన ఎం. ఎస్. మూర్తి. ఈయన శాయి క్రియేషన్స్ బానర్‌లో నిర్మించే "ధర్మకర్త" చిత్రానికి డైరెక్టర్‌గా బి. ఎస్ ఆర్.ను బుక్ చేశారు. మాధవరావు సంగీతం, వెంకటేష్ ఛాయ, శివ కూర్పుతో బిట్రా వెంకట్రావు కథ సమకూర్చి, నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

దుర్గానాగేశ్వరరావు దర్శకత్వంలో లక్ష్మీగణపతి ప్రొడక్షన్స్ తొలిచిత్రం

"ఇంతకాలం వేచి ఉన్నందుకు నేను విజృంభించడానికి అవకాశమిచ్చే చక్కని కథ దొరికింది. నిర్మాత ఎం. వి. అప్పారావుగారు ఉత్తమాభిరుచి గల నిర్మాత. జూన్‌లో చక్రవర్తి మ్యూజిక్ డైరెక్షన్‌లో పాటలు రికార్డవుతాయి జూలై 5 నుంచి రాజమండ్రి పరిసరాలలో షూటింగ్ జరుగుతుంది. ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తాను," అన్నారు డైరెక్టర్ దుర్గానాగేశ్వరరావు.

'తోడు — నీడ'



సిల్క్‌స్మిత 'రోషగాడు'లో



"రామరాజ్యంలో భీమరాజు"లో భీమరాజు పూర్వ వృత్తాంతం !

పార్కు... భీమరాజు (కృష్ణ) వంక జ్యోతి (శ్రీదేవి) తదేకంగా చూస్తూండిపోయింది.

"జ్యోతి ! నాతో ఏదో మాట్లాడాలని తీసుకొచ్చి, అలా సైలెంట్‌గా చూస్తున్నావేంటి ?"

"చూడాలనిపించింది."

"అమ్మ బాబోయ్ ! ఒక మగాడిని ఆడపిల్ల చూడాలనిపించింది అంటే — ఖచ్చితంగా వాడు అదృష్టవంతుడనే చెప్పుకోవాలి"

"నిన్ను అదృష్టవంతుడవనే కాక ఐశ్వర్యవంతుడివని కూడా చెప్పవచ్చేమో ! నేను ఒక విషయం అడుగుతా . నిజం చెప్తావా ? అసలు ఎవరు నువ్వు ?"

"భీమరాజు అనే మనిషిని లక్ష్మీపతిగారి కుటుంబానికి కావాల్సినవాడ్ని. వాళ్ళమ్మాయి జ్యోతికి ఇష్టమైనవాడ్ని."

"నువ్వు చెప్పినవి నాకు తెలిసిన నిజాలు నేనడిగేది నీకు తెలిసిన నిజాన్ని. మేం అనుకుంటున్నట్లుగా, నువ్వంటున్నట్లుగా — మామూలు మనిషివి కాదు నువ్వు. ఆరోజు హఠాత్తుగా టిప్‌టాప్‌గా టాక్సీలో దిగిన నిన్ను చూడగానే, నువ్వు గొప్పింటి బిడ్డవనిపించింది. నువ్వు ఇంగ్లీష్ మాట్లాడ్డం వినగానే, చదువుకున్నవాడివని అర్థమైంది. నువ్వు ఖర్చుపెట్టిన విధానాన్నిబట్టి చాలా ఆస్తిపరుడవని తెలుస్తోంది."

"నిజంగా నువ్వు చెప్పినవన్నీ ఉంటే, మీ ఇంట్లో పనులు చేసుకునే అవసరమేమిటి ?"


"భారతంలో విరాటరాజు కొలువులో పాండవులు పనులు చేశారంటే, అందుకొక కారణముంది కథ ఉంది. అలాగే నీకూ ఒక కారణం ఉండాలి కథ ఉండాలి అదేమిటో చెప్పు !"

"జ్యోతి ! నువ్వు అడిగే నా కథలో నేనొక దొంగననుకో - నన్ను ద్వేషిస్తావా ? నువ్వు అడిగే నా గతంలో నేనొక హంతకుడ్ని అనుకో నన్ను దూషిస్తావా ? నువ్వు తెలుసుకోవాలనుకున్న నిజంలో నేనొక భయంకరమైన నేరస్తుడిననుకో నన్ను అసహ్యించుకుంటావా ?"

అప్రయత్నంగా "లేదు. గతంలో నువ్వెవరివైనా, ఏమైనా నిన్ను నేను నిన్ను నేను ప్రేమిస్తూనే ఉంటాను," అంటూ జ్యోతి తలదించుకుంది

రాజు దిగ్భ్రమతో చూస్తూండిపోయాడు

మిద్దె రామారావు నిర్మించే "రామరాజ్యంలో భీమరాజు" చిత్రానికి ఎ కోదండరామిరెడ్డి దర్శకుడు.



"ప్రేక్షకులు వెరైటి కోరుతున్నారు-
అందుకే మా సినిమాకు
ఆపేరు పెట్టాం!"



తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో మరో చిత్రం

"గూడెల్లో జరిగే అన్యాయాలకు అద్దం పట్టే విశిష్టమైన ఇతివృత్తాన్ని పరుచూరి బ్రదర్స్ తయారు చేశారు," అన్నారు కోగంటి భాస్కరరావు. ఈయన సమర్పణలో తాతినేని ప్రసాద్ దర్శకత్వంవహించే శ్రీ చరణ్ ఫిలిమ్స్‌వారి చిత్రానికి జులై రెండవవారంలో పాటలు రికార్డు చేయబడతాయని నిర్మాత పి. సాయిబాబు తెలిపారు లక్ష్మణ్‌గారే ఛాయ, చక్రవర్తి సంగీతం, దిలీప్‌సింగ్ శిల్పం, కె. సత్యం కూర్పుతో నిర్మాణ సారథ్యంవహించే జాస్తి బాబ్జి "ఆగస్టు 10నుంచి 30 వరకు— రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది. త్వరలోనే ప్రముఖ తారాగణం ఎంపిక జరుగుతుంది," అన్నారు



సాయిచంద్, గీతాబెహెల్ 'రంగుల కల'

డి రామానాయుడు చిత్రం "సంఘర్షణ"

''ఈ ఏడు విజయవాడలో జరిగిన అందాల పోటీలో 'మిస్ ఆంధ్ర'గా ఎన్నికైన రూపవతి — నర్తకి సరళను మా చిత్రం ద్వారా పరిచయం చేస్తున్నాం,'' అన్నారు సురేష్ ప్రొడక్షన్స్ అధినేత డి. రామానాయుడు. ఈయన తాజా చిత్రం ''సంఘర్షణ''లో చిరంజీవి, శివకృష్ణ, ప్రభాకరరెడ్డి, నూతన్‌ప్రసాద్, రావుగోపాలరావు, గుమ్మడి, అల్లు రామలింగయ్య, సారధి, విజయశాంతి, నళిని, సరళ, మమత, కాకినాడ శ్యామల, సూర్యకాంతం, అన్నపూర్ణ పాల్గొంటున్నారు. నిత్యజీవితంలోని పెక్కు సంఘర్షణలను కొత్త కోణంలో చూపెట్టే ఈ చిత్రానికి గుహనాధన్ కథకుడు. పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు. వేటూరి గీతాలకు చక్రవర్తి బాణీలు కూర్చారు. లోక్‌సింగ్ ఛాయ, బి. చలం శిల్పం, మార్తాండ్ కూర్పు నిర్వహిస్తున్నారు. జూన్ 6 న షూటింగ్ మొదలైంది. ''సెప్టెంబర్‌లో పదిహేనురోజులపాటు ఊటీలో సాంగ్స్ పిక్చరైజ్ చేస్తాం. దాంతో షూటింగ్ పూర్తవుతుంది,'' అన్నారు ఈ చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం వహించే కె. మురళీమోహనరావు.

హీరో కృష్ణ కొత్త చిత్రాలు

★ రవి చిత్ర ఫిలిమ్స్ అధినేత వై. వి. రావ్ నిర్మించే చిత్రానికి డి. వి. నరసరాజు రచన సిద్ధంగా వుంది. కట్టా సుబ్బారావు దర్శకుడు.

★ విజయనిర్మల స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఆదుర్తి భాస్కర్, ఎం. ఎస్. ప్రసాద్ నిర్మించే "రక్త సంబంధం" చిత్రంలో కృష్ణ సరసన రాధ నాయిక. సత్యనారాయణ, గొల్లపూడి, గిరిబాబు, వీరభద్రరావు, జయంతి వగైరా తారాగణం. సత్యానంద్ సంభాషణల కర్త. ఆత్రేయ, వేటూరి గీతాలకు చక్రవర్తి సంగీత మిస్తారు. వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు. ఆదుర్తి హరనాథ్ సంకలన కర్త. తోట శిల్ప దర్శకుడు.

★ ఎ. కోదండరామిరెడ్డి స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో నందిగం దేవీప్రసాద్ సమర్పించే రాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ ''కంచు కాగడా'' సినిమా స్కోప్ చిత్రానికి ఎన్. రామలింగేశ్వర రావు నిర్మాత. సత్యానంద్ రచయిత. చక్రవర్తి సంగీత దర్శకుడు.

★ కోగంటి విశ్వేశ్వరరావు నిర్మించే శ్రీ పంచవటి చిత్రాలయ ''ధైర్యవంతుడు'' చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు. జయప్రద నాయిక.

★ తాళ్ళూరి కృష్ణవేణి నిర్మించే భవాని ఇంటర్నేషనల్ కంబైన్స్ ''సూపర్ స్టార్'' చిత్రానికి వి. జగదీష్ కూర్పు, దర్శకత్వబాధ్యతలు వహిస్తారు. సత్యం సంగీతదర్శకుడు. వి.ఎస్.ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు

★ పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో ఎస్. వి. సుబ్బరాజు కథ సమకూర్చి నిర్మించే శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్ 6వ చిత్రంలో కృష్ణ సరసన జయప్రద నాయిక.


★ విజయనిర్మల దర్శకత్వంలో చలసాని రామకృష్ణ ప్రసాద్ సమర్పించే శ్రీ విజయరామ పిక్చర్స్ ద్వితీయ చిత్రానికి ఆట్లూరి తులసీదాస్, ఎస్. మోషే నిర్మాతలు.

సంతోష్ ఆర్ట్ మూవీస్ ద్వితీయ చిత్రం

''అక్టోబర్‌లో సాంగ్స్ రికార్డ్ చేస్తాం నవంబర్ నుంచి షూటింగ్ ప్లాన్ చేశాం,'' అన్నారు ఎ. పోతరాజు. ఈయన ఆధ్వర్యంలో ''బలిదానం'' అనంతరం సంతోష్ ఆర్ట్ మూవీస్ పతాకంలో తయారయ్యే చిత్రంలో శోభన్‌బాబు, జయసుధ నాయకా నాయికలు. చక్రవర్తి సంగీత దర్శకుడు. ఎ. శ్రీనివాసరావు, ఎ. లక్ష్మణరావు నిర్మాతలు. కోడి రామకృష్ణ దర్శకుడు.

వనితశ్రీ 'త్రివేణీ సంగమం'





ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్‌వారి 'సంఘర్షణ' ముహూర్తంనాడు క్లాప్ కొట్టిన శ్రీ నాగిరెడ్డి, నిర్మాత డి. రామానాయుడు, కొత్త దర్శకుడు శ్రీ మురళీమోహన్‌లని చిత్రంలో చూడవచ్చు

ఇరుగు - పొరుగు

★ "తూంగాదె తంబి తూంగాదే" అనే తమిళ చిత్రంలో కమలహాసన్ తల్లిగా జమున నటిస్తోంది. "నేను తమిళం మాట్లాడి చాలాకాలమైంది. కాస్త అలవాటు తప్పింది. మొదటి రోజున ఒకటి రెండుసార్లు తడబడినా — ఆ తర్వాత స్పష్టంగా మాట్లాడ్డం మొదలెట్టేశాను," అందామె. "యాద్‌గార్ రాజ్ తిలక్" చిత్రాలతో కూడా ఈమె కమలహాసన్ తల్లిగా నటిస్తోంది.

★ "బహాదూరవు బాటసారి" చిత్రాన్ని తారకప్రభు ఫిలిమ్స్ సంస్థ హిందీలో నిర్మిస్తుందని దర్శక నిర్మాత దాసరి నారాయణరావు తెలియజేశారు. దిలీప్‌కుమార్ (ఎ.ఎన్.ఆర్.), హేమమాలిని (సుజాత), సంజీవ్‌కుమార్ (దాసరి) పాత్రలు ధరించవచ్చు.

★ కృష్ణంరాజు హీరోగా రాజ్‌భరత్ దర్శకత్వంలో పి. నారాయణరావు సింహళంలో నిర్మించే నవశక్తి పిక్చర్స్‌వారి చిత్రానికి "ఉక్కుమనిషి" అని పేరుపెట్టారు.

★ నాగేష్ ఏకైక పుత్రుడు ఆనంద్‌బాబు, బి.ఎస్.సి., ఒక తమిళ చిత్రంలో నటిస్తున్నాడు.

★ "సాగర్" హిందీ చిత్రంలో జవేద్ "సాగర్ కి నారే" అనే పాటను ఎంత అద్భుతంగా రాశాడంటే, ఆ పాటను గానం చేసిన లతామంగేష్కర్ ముగ్ధురాలై, అతనికొక బంగారు పెనాను బహూకరించిందట.

★ "బిచ్చు" అనే చిత్రాన్ని ధర్మేంద్ర స్వయంగా నిర్మిస్తున్నాడు. ఇందులో ఇతనితోపాటు శబ్నా అజ్మి తొలిసారిగా నటిస్తోంది. శంకర్‌జైకిషన్ సంగీతం విశేషాకర్షణ అట. "నేను రికార్డ్ చేయించిన ఆరు పాటలు ఎంత శ్రవణానందకరంగా ఉన్నాయంటే, శంకర్ మరోసారి ఓ వెలుగు వెలుగుతాడు," అన్నాడట ధర్మేంద్ర.

★ "డాక్టర్ జివాగో" చిత్రంలో అద్వితీయంగా నటించిన హాలివుడ్ నటుడు ఓమర్ షెరీఫ్ ఒక కన్నడ చిత్రంలో నటించబోతున్నాడు. ఆ చిత్రం పేరు "హెణ్ణు హెణ్ణాగి ఇరబేకు" [ఆడది ఆడదిగానే ఉండాలి].

★ 1984లో రోనాల్డ్ రీగాన్ మళ్ళీ అమెరికా అధ్యక్షుడుగా ఎన్నుకోబడనివక్షంలో ఒక హాలివుడ్ చిత్రంలో 'సిఐఎ' ప్రెసిడెంట్‌గా నటిస్తారట.

★ బొంబాయిలో సెన్సార్ అయిన చిత్రాలుగాని, సెన్సార్‌గాని చిత్రాలుగాని కొముగోలుదార్లకో, మరెవ్వరికైనానో ఏ ప్రీవ్యూ థియేటర్‌లోనైనా ప్రదర్శింపవలసి వస్తే, ముందుగా కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. కాని, పరిశ్రమలోని పలువురు ప్రముఖుల విజ్ఞప్తి మేరకు — సెన్సార్ కాని చిత్రాల ప్రదర్శనకు అలాంటి అనుమతి అవసరం లేదని ఇటీవల ప్రకటించబడింది.

★ మిత్రుల సలహాపై రాజేంద్రకుమార్ తను నిర్మించిన "లవర్స్" చిత్రంలో యాభై అడుగులు తొలగించేశాడట.

★ గల్ఫ్ దేశాలలో హిందీ చిత్రాలు ప్రదర్శించే థియేటర్లు 35కు పైగా ఉన్నాయి. విడియోల ధాటికి తట్టుకోలేక వాటిలో 15 థియేటర్లు మూతపడేటట్లున్నాయట.

సినిమా

"దేవి - శ్రీదేవి"

"సంపన్నురాలైన జయసుధ, పేదపిల్ల అయిన రాధిక — వీళ్ళిద్దరి మధ్య నలిగి, పరిస్థితులకు తట్టుకొని నిలబడి, అందర్నీ దారిలోకి తెచ్చుకుని, ప్రయోజకుడుగా నిలబడిన పాత్రను మురళీమోహన్ పోషిస్తున్నారు," అన్నారు డైరెక్టర్ రాజాచంద్ర. మురళీమోహన్ సమర్పణలో మాగంటి వెంకటేశ్వరరావు నిర్మించే



'సీత పుట్టిన దేశం'లో శారద

జయభేరి ఆర్ట్ ప్రొడక్షన్స్ తృతీయ చిత్రం "దేవి — శ్రీదేవి" షూటింగ్ జూన్ 1న మొదలైంది. రాజేష్, తులసి, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, గిరిబాబు ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. బాలమురుగన్ కథకు పూసల, గణేష్‌పాత్రో సంభాషణలు రాశారు. వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, రంగారావు శిల్పం, రాజగోపాల్ కూర్పు, తార నృత్యాలతో కిశోర్ నిర్వహణ బాధ్యలు వహిస్తున్నారు. ★

దగ్గుకు ఉపశాంతి ఇస్తుంది




విక్స్ ఫార్ములా 44 కాఫ్ డిస్క్

ఇందులో వుంది ఒక ప్రత్యేక పదార్థం ...సైలెంటియం

సైలెంటియం విడవకుండా వచ్చే దగ్గుకు శీఘ్ర ఉపశమనం ఇస్తుంది. దీనితోపాటు ఫార్ములా 44 - కాఫ్ డిస్క్—

- దగ్గు క్రిములను నాశనం చేస్తుంది.
- గొంతు నొప్పినుండి ఉపశమనం ఇస్తుంది.
- శ్వాస తీసుకోవడాన్ని సులభం చేస్తుంది



రుచికి ఇది ఘాటైనది అందుకే పని చెయ్యడంలో మేలైనది.

CASRH-17-244 TEL

సీరియల్

నీది ప్రేమ సంద్రమేనమ్మా

వక్కలంక పద్మావతి

(గత సంచిక తరువాయి)

(ఫ్రెష్‌గా తయారయ్యి శ్రీకాంతన్‌తో బయల్దేరింది గాయత్రి.

వాళ్ళిద్దరూ పక్క పక్కనే నడుస్తున్నారు. సాయంకాలం అవటంవల్ల నీరెండ తూర్పు కొండల మీదపడి ప్రకాశిస్తున్నాయి. పక్షులు రెక్కలు టప టప లాడించుకుంటూ గుంపులుగా ఎగిరి పోతున్నాయి. చల్లగాలి అలలా పయ విస్తోంది.

చుట్టూ ప్రకృతిని పరికిస్తూ నడుస్తున్న శ్రీకాంతన్‌ని ఎవరో ఒక వ్యక్తి ఆపి పలక రింపుగా నవ్వి, ''ఇవర్ యార్ ? వంగళ్ కు ఎన్నా ఆగిరదు ?'' అని అడుగుతున్నాడు.

శ్రీకాంతన్‌తో పాటుగా గాయత్రి కూడా ఆగిపోయింది.

''ఇవర్ యన్ ఫ్రండ్ ఆశ్రమం పార్ కర్క త్తుకు వందు యిరక్కాళ్ అన్నాడు'' తనని చూపిస్తూ.

వాళ్ళిద్దరూ అలా అరవంలో మాట్లాడు కుంటుంటే నవ్వొచ్చిందామెకి.

మరో రెండు నిముషాలకు అతను వెళ్ళి పోయాడు.

ఇందాకటి చిరునవ్వు ఛాయలు గాయత్రి పెదవులమీద ఇంకా అలానే ఉన్నాయి

''ఏమిటి గాయత్రి, నీ నవ్వు'' అన్నాడు

''ఏమీలేదు అతనేమిటి అడుగుతున్నాడు ఈమె ఎవరు, మీకేమవుతుంది ? అనికదూ !'' అంది.

సంభ్రమంగా చూశాడు ఆమెని ''ఫర్వా లేదే ! తమిళం బాగానే అర్థం చేసుకోగలుగు తున్నావు !''

గాయత్రి నవ్వింది.

శ్రీకాంతన్‌కి తమిళంలో మంచి రచయితగా పేరున్నందున అతన్ని అభిమానించే పాఠకులు, కాలేజీ స్టూడెంట్స్, వేరే వూరినుంచి ఇక్కడికి చూడటానికి వచ్చినవాళ్ళూ ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూండటంతో, వాళ్ళు ఏదో ఒకటి అడుగుతూంటారు. వాళ్ళందరికి గాయత్రి ఇంగ్లీషులోనే సమాధానం ఇస్తూ వుంటుంది కానీ వాళ్ళు శ్రీకాంతన్‌తో మాట్లాడుతున్నప్పుడు మాత్రం నెమ్మది నెమ్మదిగా ఆ భాషను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూంది. అలా చిన్న చిన్న పదాలకు అర్థం చేసుకోగలుగుతోంది గాయత్రి.

''గాయత్రి ! ఇక్కడ కూర్చుందామా !!'' అంటూ ఒక పెద్ద కొండరాయిమీద కూర్చుంటూ ఆమెనుకూడా కూర్చోమన్నట్టు చూశాడు ఆమె వచ్చి కాస్త దూరంలో మరో రాయిమీద కూర్చుంది.

నాలుగైదు నిముషాలు ఇద్దరిమధ్యా మాటలు లేవు. అతనితో ఏం మాట్లాడాలో తెలీని స్థితిలో పడిపోయింది గాయత్రి కానీ ఆ నిశ్శబ్దం ఇబ్బందిగా అనిపించి తను ఏదో ఒకటి మాట్లాడా లనే ప్రయత్నంలో వుండగానే అతడు అన్నాడు

''గాయత్రి ! ప్రేమంటే ఏమిటి ?'' అని ఉన్నట్టుండి అతను వేసిన ప్రశ్నకు నివ్వెర పోయింది. ఏం సమాధానం చెప్పాలో . ఎలా చెప్పాలో తోచలేదామెకు

''చెప్పు గాయత్రి ! సురేంద్రను నువ్వు గొప్పగా ప్రేమించానంటున్నావు. అతనికోసమే అన్నీ వదులుకుని వచ్చేశావు ప్రేమకోసం ఇంతింత త్యాగాలు చేయటం నేను చదవటమే గానీ చూడలేదు. అందుకే ప్రేమంటే ఏమిటో యీ త్యాగాలు ఎందుకు చేస్తారో అర్థం అవుతుంది'' అన్నాడతను

ఎంతో భావుకత్వం, ఎన్నెన్నో పుస్తకాలు చదివి జీర్ణించుకుని, విజ్ఞానం వుండి కూడా అతనలాటి ప్రశ్న వేయటం ఆమెకు వింతనిపిం చింది

''ప్రేమని స్వాగతీకరించటం అసాధ్యం''

''ఎందుకని ?''

''ఎవరి అనుభవాలకు తగినవిధంగా వాళ్ళు అర్థాన్ని మలుచుకుంటారు ''

''అసలు సృష్టిలో ప్రేమనేది వుందా గాయత్రి ?''

''జీవితాన్ని అనుభవాల్తో ముడి వేసి పాత్రలను సృష్టించి, ఆ పాత్రల ద్వారా తనకి నచ్చిన విధంగా తిప్పునిస్తాడు రచయిత రచయితగా మీరు మీ రచనల్లో ప్రేమని గురించి ఏం రాశారు ?''

అతను కళ్ళజోడును చూపుడు వేలితో సవరించుకుని నెమ్మదిగా అన్నాడు ''అసలు నాకు ప్రేమంటేనే నమ్మకంలేదు ఇక ప్రేమ గురించి ఏంరాయమంటావు చెప్పు ! ''

''స్పందించే ప్రతిహృదయానికే ప్రేమంటె తెలుస్తుంది ''

ఆ మాట చురుక్కున తగిలింది అతనికి విశాలంగా వుండే అతని నేత్రాలు మరింత

జరిగిన కథ — 7 : సురేంద్ర తను గాయత్రిని ప్రేమిస్తున్నట్లు మంజులతో చెపుతాడు గాయత్రి మాటలకు సురేంద్ర మనసు దెబ్బతింటుంది. తను గాయత్రిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నట్లు ఆమెకు చెపుతాడు. గాయత్రి కూడ సురేంద్రను ప్రేమిస్తుంది కాని తండ్రికి భయపడి తన ప్రేమను బయటకు వ్యక్తం చేయలేకపోతుంది గాయత్రి మనస్సు విప్పి తన ప్రేమను సురేంద్రతో చెపుతుంది మంజుల, వినోద్, సురేంద్ర, గాయత్రిలు మహాబలిపురం పిక్నిక్ వెళ్ళి అక్కడ సరదాగా కాలక్షేపం చేస్తారు మంజుల వివాహం వినోద్‌తో జరిగిపోతుంది. తిరుపతిలో ఒక సినిమా నిర్మాత గాయత్రి అందాన్ని చూసి ఆకర్షింపబడుతాడు. శ్రీనివాస్ సెక్రటరీ 'స్వామి' శ్రీనివాసన్ గాయత్రిని పెళ్ళి చేసుకోను ఇష్టపడుతున్నట్లుగా పరమేశంగారికి చెప్పగా ఆయన తన కూతురి అదృష్టానికి మురిసిపోతారు. గాయత్రి తండ్రి మాటను కాదనలేక పెళ్ళికి అంగీకరిస్తుంది కానీ ఆఖరి క్షణంలో మనస్సు నరిపెట్టుకోలేక ఇల్లు విడిచి సురేంద్ర దగ్గరకు పారిపోతుంది. సురేంద్ర ఇంట్లో లేకపోగా నిరాశతో కదిలే రైలెక్కుతుంది. విశ్వనాథంగారు గాయత్రి ఇంట్లోంచి వెళ్ళిపోయిందనే విచారంతో ఆమె తండ్రి మరణించాడని సురేంద్రతో చెపుతాడు అది విని హతాశుడయ్యాడు సురేంద్ర. ఇల్లు విడిచిన గాయత్రి 'తిరువణ్ణామలై'లోని శ్రీకాంతన్ అనే తమిళ రచయిత ఆశ్రయం చేరుకుంటుంది.

విశాలమవటం చూసింది గాయత్రి. తనమాటల్లో తనకే ఏదో పొరపాటు స్ఫురించింది.

"క్షమించండి ! నాకు తోచిందేదో అనేశాను. '' అంది సంకోచంగా !

అతనేమీ మాట్లాడకుండా చూపుల్ని శూన్యంలోకి సారించి . ఏవో . అస్పష్టమైన ఆలోచనల్ని అందుకోవాలనే ప్రయత్నంలో కనిపించాడు. తన దృష్టి మరల్చకుండానే అన్నాడు కాసేపటికి —

"గాయత్రీ ! నేను తెలుగులో చదివిన పుస్తకాలు చాలా తక్కువ. వాటిలో నాకు నచ్చింది ఒకే ఒకటి — బుచ్చిబాబు "చివరకు మిగిలేది" అది చదివిన తర్వాత నాకు ప్రేమ మీదున్న కాస్త నమ్మకం కూడా పోయింది. పైగా నేను చూసిన సంఘటనలు పొందిన అనుభవాలూ కూడా నాకు ప్రేమంటే గొప్ప నమ్మకాన్ని, అర్థాన్ని కలిగించలేదు. అసలు ప్రేమించటంకన్నా . దానిని అనుభవించగల రసజ్ఞత వున్నవారి హృదయం గొప్పదంటాను నేను. దానితోపాటు ప్రేమను ప్రతిఫలింప చేసేంత ఉన్నత హృదయం ఉన్నప్పుడే అది ప్రేమ అవుతుంది

కానీ డబ్బు మీద, ఇంకా ఏవేవో మోజులు పెరిగిపోతున్న యీ కాలంలో ప్రేమానుభవాన్ని 'సీరియస్'గా తీసుకున్న వ్యక్తి ఎవరూ నాకు తటస్థపడలేదు. అందుకే నా జీవితంలో ఏ స్త్రీ ప్రవేశించలేకపోయింది."

అతను చెప్పటం ఆగిపోయిన కాసేపటికి గానీ ఆమె యీ లోకంలోకి రాలేదు. అతని అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించలేక పోయినా.. ఆ మాటల్లో ఏదో పదును, నిజం వున్నాయనిపించింది.

"అయినా కొన్ని మోజులు మానవ సహజాలుగా తోస్తాయి — నాకు. అంతమాత్రాన ప్రేమ లేదని ఎలా అనుకోవటం ? ప్రేమ లేని జీవి ఎలా బ్రతగ్గలదు ! మీరు చెప్పినట్లు ప్రేమను పొందే ముందు, దాన్ని ప్రతిఫలింపజేసే ఉన్నత హృదయం నిజంగా మీకు లేదనుకుంటున్నారా ?"

"లేదు గాయత్రీ" ఆమె మాటలు పూర్తి కాకుండానే అడ్డుపడ్డాడు.

"శ్రీకాంత్" అంటూ ఆశ్చర్యంతో అతని చెయ్యి పట్టుకుంది. అతను ఒక్క నిమిషంపాటు కళ్ళు మూసుకున్నాడు; తనకే తెలీని అనుభూతితో. కళ్ళు తెరిచి ఆమెను చూశాడు

గాయత్రి తన చేతిని వెనక్కి తీసేసుకుంటూ అంది —

"శ్రీకాంత్ ! మీరు నాకు సరిగ్గా అర్థం కావటం లేదు. మీలో ప్రేమ, ఆదరణ లాంటి భావాలు సామాన్యంగా కాకుండా వున్నతమైనవిగా అనిపిస్తున్నాయి నాకు. అందుకే మిమ్మల్ని ఏ స్త్రీ ... ఆకర్షించలేక పోతుందేమో ! అలా అని నేను అభిప్రాయపడుతున్నాను"

తలొంచుకుంది గాయత్రి అతని సమాధానం కోసం ఎదురు చూస్తూ. ఆమె కనురెప్పల క్రింద దాగిన బాధను గ్రహించిన శ్రీకాంత్ చిన్నగా నవ్వాడు.

తలెత్తి చూసి ఆమె కూడా నవ్వేసింది సున్నితంగా !

వాతావరణం తేలిక పడింది ఇద్దరి మధ్యా! అక్కడి నుంచి లేచి ఇంటివేపు నడక సాగించారు

* * *

రోజులు వారాలు, నెలలుగా మారి దొర్లి



ఇది మేఘ సందేశమూ..

పోతున్నాయి ఇప్పుడు వారిద్దరి మధ్యా స్నేహపూర్వకమైన అనుబంధం మరింత అధికమైంది సురేంద్ర వియోగం వల్ల హృదయంలో రగులుతున్న మంటలు కొద్దిపాటి చల్లదనాన్ని ఆవరించుకున్నాయి

అప్పుడప్పుడు బేబీ, కిరణ్‌లు మనసులో ప్రవేశించి కలవరం కలిగిస్తున్నారు ఆ కాసేపూ వాళ్ళని గురించిన ఆలోచనలతో గడుపుతున్నా ప్రశాంతమైన ఆశ్రమ వాతావరణం ఆమెలో శాంతిని నింపింది శ్రీకాంతన్ సాహచర్యం, అతని లైఫ్ థియరీస్ ఆమె మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి జన్మజన్మలకు హాయిగా ఒంటరిగా జీవించగలననే ఆత్మ విశ్వాసాన్ని, సాహసాన్ని, సంస్కారాన్ని నింపుతున్నాయి

ఆ రోజు సాయంత్రం పూలమొక్కలకు నీళ్ళు పోస్తూవుంది గాయత్రి చల్లటి చిరుగాలి తెరలు తెరలుగా వీస్తూ, మొక్కలన్నీ రంగు రంగుల పువ్వులతో ఆలలాడిస్తుంటే తన్మయత్వంతో చూస్తూంది

దూరంగా ఏదో బండి ఆగిన శబ్దం విని అటు చూసింది అంతే! ఒక్కక్షణంపాటు అచేతనంగా నిలబడిపోయింది

బండిలోంచి శ్రీకాంతన్‌ని మెల్లగా దించి భుజాలమీదుగా చేతులువేసి నడిపించుకొస్తున్నాడు ఒక వ్యక్తి శ్రీకాంతన్ చేతికి, తలకు బాండేజీ వేసివుంది బట్టలమీద అక్కడక్కడా రక్తపు మరకలున్నాయి

గాయత్రి గాభరాగా పరుగెడుతున్నట్లు ఎదురు వెళ్ళింది

"అతనికేమైంది? ఈ కట్లేమిటి?" అంది ఆదుర్దాగా ఆ వ్యక్తి ఏదో చెప్పబోయి తెలుగు రాక మళ్ళీ ఊరుకున్నాడు శ్రీకాంతన్‌ని ఇంట్లోకి తీసుకువెళ్ళి మంచంమీద కూర్చోబెట్టి వెళ్ళిపోయాడు.

కంగారుపడుతున్న గాయత్రిని చూసి చిన్నగా నవ్వాడు శ్రీకాంతన్

"గాయత్రీ! అతను నా స్నేహితుడు కాలేజీనుంచి కబుర్లు చెప్పుకుంటూ వస్తుంటే వెనుకనుంచి ఆవేశంతో పరుగెత్తుకొచ్చిన ఆంబోతు నన్ను ఒక్క తోపు తోసింది స్పృహ వచ్చినతర్వాత చూసుకుంటే హాస్పిటల్లోవున్నాను అరె అదేమిటి గాయత్రీ! నీ మొహమంతా ఆ చెమటలు? మరీ అంత సున్నితమైతే ఎట్లా! ప్లీజ్ నాకేం ఫరవాలేదు భయపడకు" అంటూ నవ్వుచెప్పాడు

ఆమె మౌనంగా నిలబడింది తలొంచుకుని ఆమె మనసు ఎందుకో ఎంతో వ్యధకు గురయ్యింది — ఆ స్థితిలో అతన్ని చూసి నీరసంగా పడుకున్న శ్రీకాంతన్‌కి గాయాల బాధ అధికమై సగం రాత్రిలో జ్వరం ముంచు

కొచ్చింది డాక్టర్ ఇచ్చిన మందులు టైం ప్రకారం ఇస్తూ తెల్లవార్లూ అతని మంచం పక్కనే కూర్చుండిపోయింది గాయత్రి

మూడురోజులగ్గానీ అతనికి తెలివి రాలేదు నీరసంగా కళ్ళు తెరచిన అతనికి తనకేసి ఆత్రుతగా చూస్తున్న గాయత్రి కనిపించింది చురుగ్గా లేవటానికి ప్రయత్నించాడు

''ఏంకావాలి మీకు ! లేవకండి !'' అంటూ వారించింది గాయత్రి అతను తన గాయాల్ని మృదువుగా తడిమి చూసుకున్నాడు అన్ని కొత్తగా బాండేజ్ చేసివున్నాయి తలెత్తి గాయత్రి కళ్ళల్లోకి చూశాడు ఆ చూపుల్లో ఏవో చెప్పలేవి భావాలు తొంగి చూడటం గమనించిన గాయత్రి మెల్లగా తలొంచుకుంది కొద్ది నిమిషాలు ఇద్దరి మధ్యా మాటల్లేవు

''కాఫీ తెస్తాను మీరు లేవకండి ! ఇప్పుడు టెంపరేచర్ కూడా తగ్గిపోయింది ఇంకా రెండు రోజులైనా మీరు రెస్టు తీసుకుంటేగానీ నీరసం తగ్గదు ''అంటూ సున్నితంగా అతని నుదిటిమీద చేయివేసి చూసింది

ఆమె చేతిని అలాగే తన చేతిలోకి తీసుకుని మెల్లగా లేచాడు

''గాయత్రీ ! నువ్వెరివో ఏమో! నా జీవితంలోకి ఇట్లా ప్రవేశించటం ఏమిటో ! తలుచుకుంటే అంతా విచిత్రం అనిపిస్తుంది జీవితంలో ఎప్పుడో ఒక అపూర్వమైనవ్యక్తి తటస్థపడతారని అంటారు ఆ వ్యక్తివి నువ్వే అనిపిస్తుంది నాకు నువ్వు శాశ్వతంగా ఇక్కడే వుండక పోయినా, నువ్వున్న కాలాన్నిమాత్రం చాలా విలువైందిగా, అపురూపంగా భావిస్తాను నేను '' అంటూ కృతజ్ఞతగా, ఆరాధనగా చూశాడామెను

ఆమె చేయివదిలి మెల్లగా లేచి నాలుగు అడుగులేసి కిటికీదగ్గరకు చేరాడు శ్రీకాంతన్

సూర్యుడికి అడ్డు రావాలని ప్రయత్నిస్తూ గుంపులు గుంపులుగా కదిలివెళ్తున్న మేఘాలను చూస్తూ మళ్ళీ అన్నాడు –

''గాయత్రీ ! నిన్ను చూస్తుంటే నాకు తెలీని కొత్తపదాలకు అర్థం తెలుస్తున్నట్టుగా వుంది కానీ వాటిని నాకు అన్వయించుకోలేక పోతున్నాను ఎందుకో ఏమో !!''

తనలో తనే మాట్లాడుకుంటున్నట్టుగా వున్నాయతని మాటలు నిశ్శబ్దంగా వింటున్న గాయత్రి వాటిలో అర్థాల్ని వెతుక్కొంటూంది అయోమయంతో !

''గాయత్రీ ! యీ రెండు రోజులూ నీతో సేవ చేయించుకున్నందుకు నన్ను క్షమించు నా కోసం నువ్వు నిద్రాహారాలు లేకుండా ఎందుకింత సేవ చేశావు గాయత్రీ !''

గాయత్రి అతనికళ్ళల్లోకి చూసింది సూటిగా!

అవి తననే చూస్తున్నాయి నిశ్చలంగా !

ఒక్కక్షణం ఆలోచించి అతనిమాటల్లో తనకి ఆసక్తిలేక ఇక ఆ భావాలు పొడిగించకుండా సంభాషణ మార్చింది

''మీకు ఆకలి వేయటంలేదూ ! బ్రెడ్, పాలూ తీసుకువస్తాను రేపటినుంచి భోజనం చేద్దురుగాని ''అంది నెమ్మదిగా!

ఆ స్వరం చిరుశబ్దంగా పలికినా ఆప్యాయత మాత్రం అధికంగానే ధ్వనించింది కృతజ్ఞతను సూచిస్తూ ఒక సన్నితమైన నవ్వు అతని పెదవులనుండి విడివడింది

పాలు తీసుకురావటానికి లోపలకు వెళ్తున్న గాయత్రిని అలానే చూస్తుండిపోయాడు శ్రీకాంతన్

* * *

కాలం వేగంగా గడిచిపోతూనే వుంది విజయవాడనుంచి తిన్నగా తిరుపతికి పరుగెత్తుకొచ్చిన సురేంద్ర గాయత్రి జాడను మాత్రం తెలుసుకోలేకపోయాడు కారులో ఎక్కడెక్కడో ఆమెకోసం వెతుకుతూ తిరిగేవాడు

తిరుపతి ఎప్పుడూ యాత్రికులతో కిటకిటలాడుతూనే వుంటుంది అయినా గాయత్రి తిరుపతిలోనే ఎందుకుంటుంది లెమ్మని అనుకుంటూ, చుట్టుపక్కల ప్రాంతాలన్ని విశ్రాంతి లేకుండా గాలించి విఫలుడయాడు సురేంద్ర

ఎక్కడో దూరంగా, కొండప్రాంతంలో ప్రశాంత ఆశ్రమ వాతావరణంలో, తనకు కావలసిన వారి ఆలోచనలతో, ఎదురు చూపులలో కాలం గడుపుతున్న 'గాయత్రి'ని గురించి ఏ ''మేఘం'' అతనికి సందేశమిస్తుంది ?

విసిగి వేసారి పిచ్చివాడిలా కాలం గడుపుతున్నాడు అతను యీ ఆలోచనల్నుంచి దూరం కావటంకోసం సురేంద్రని ఆఫీసులో జాయిన్ కమ్మని సలహా ఇచ్చారు విశ్వనాథంగారు – లీవ్ కూడా పూర్తికావటంతో చేసేదిలేక మళ్ళీ జాయిన్ అయాడు సురేంద్ర

పగలంతా ఆఫీసు పనిలో జ్ఞాపకాలకు దూరంగావున్నా మళ్ళి ఇంటికి తిరిగి వచ్చేసరికి అతని పరిస్థితి మామూలుగానే తయారవుతుంది


కిరణ్, బేబీలు కనిపించగానే అతని హృదయం గాయత్రికోసం అలమటించిపోతూ నిరాశల కడలిలో ఊగిసలాడేది నిశ్శబ్దంగా ! భరించరాని ఒంటరి తనంతో రోజు రోజుకీ కృంగిపోతున్నాడు మానసికంగా, శారీరకంగా అర్థరాత్రివరకూ బాల్కానీలో కూర్చుని ఆలోచించేవాడు 'ఏమవుతున్నాడు తను ? తన జీవితానికి గమ్యం ఏమిటి ?' అని యీ ఆలోచనల తీవ్రతను అతని సున్నిత హృదయం భరించలేకపోతూంది యీ కలతనుంచి విముక్తి ఎప్పుడు లభిస్తుందోనని ఎదురు చూస్తుంది

గాయత్రి తమ్ముణ్ణి, చెల్లెలిని బాధ్యతగా చూసుకుంటున్న తరువాత అతని మనసు కాస్త ఊరడిల్లినా, గాయత్రికి జరిగిన అన్యాయానికి విలవిల్లాడిపోతుంది

కిరణ్ కాలేజీలో జాయిన్ అయ్యాడు బేబీ కాన్వెంటుకి వెళ్తోంది తండ్రి మరణం వల్ల, అక్క దూరం కావటం వల్ల చెదిరిన వాళ్ళ లేత మనసులు విశ్వనాథం, పార్వతి, సురేంద్రల ఆదరణతో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి ఆ పిల్లల హృదయాలకు ప్రశాంతత చేకూరింది

''మీ అక్క తప్పకుండా వస్తుంది ఆమె ఎక్కడున్నా తీసుకువచ్చి మీకు చూపిస్తాను'' అని సురేంద్ర ధైర్యం చెప్పటంతో వాళ్ళల్లో ఆశ మిణుకు మిణుకు మంటుంది





మంజుల దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తూనే వున్నాయి సురేంద్ర, విశ్వనాథంగార్ను కూడా సమాధానాలు రాస్తూనె వున్నారు గానీ గాయత్రి విషయం మాత్రం బయట పెట్టలేదెవరూ విశ్వనాథంగారు దాచుకోలేక పోయినా, సురేంద్ర కోరిన మీదట అలా చేయక తప్పలేదాయనకు

"మంజుల కొత్తగా పెళ్ళి చేసుకుని భర్తతో ఆనందంగా కాలం గడుపుతోంది యీ విషయాలన్ని రాస్తూ, ఆమె సంతోషాన్ని భగ్నం చేయటం నాకు ఇష్టం లేదు ఆమెది చాలా సున్నిత హృదయం గాయత్రికి ఇలా జరిగిందని తెలిస్తే ఏ మాత్రం సహించలేదు అందుకే ఉత్తరాల్లో మీరు యీ విషయం రాయకండి" అని ప్రాధేయపడ్డాడు ఆయన్ను

మంజుల వినోద్‌తో కలిసి మలేషియాలో చూస్తున్న సుందర నగరాలూ, అద్భుతమైన దృశ్యాలూ, అక్కడి నాగరికత, సైంటిఫిక్ డెవలప్‌మెంటు, ప్రజల ఆచార వ్యవహారాలూ ఎప్పటికప్పుడు రాస్తుండేది

గాయత్రికి రెండు లెటర్సు రాసినా సమాధానం రాలేదని ఫిర్యాదు చేస్తూ రాసింది మొదట్లో మంజుల గాయత్రి ఊళ్ళో లేనట్టు వాళ్ళ దగ్గరి బంధువు లెవరికో జబ్బు చేస్తే, వెళ్ళినట్లు కల్పించి సమాధానం రాశారు

ఇది మేఘ సందేశమూ ..

"అబ్బో! 'నైటింగేల్' అని పేరు తెచ్చుకోవాలను కుంటుందన్న మాట అది సరే నీకూ, గాయత్రికి పెళ్ళి విషయం ఎందాకా వచ్చింది నేనొచ్చి అప్పుడే పదినెలలు అవుతోంది ఇంకా ఎప్పుడు నేనే వొచ్చి చేయాలా ఏమిటి? అలా అయితే ఇప్పుడే బయలుదేరి వచ్చేస్తాను" అంటూ సరదగా రాసేది సురేంద్రకు

ఆ ఉత్తరాలు చదువుతూ ఎలాగో అయిపోయేవాడు అతను అతని హృదయాంతరాళాల్లో 'గాయత్రి కనిపించదేమో' అన్న ఆలోచన వస్తే దుర్భరమైన ఆవేదన అతన్ని నిలువునా ఆవహిస్తుంది

"గాయత్రీ! నేనేం పాపం చేశానని నాకీ శిక్ష విధించావు ఒక్కమాట – కనీసం ఒక్క మాటైనా చెప్పావా ఆ రోజు నువ్వు అవునంటే ఆ రోజే మీ నాన్నగారిని అడిగివుండేవాడిని నీకు ధైర్యంలేకా, నన్ను మాట్లాడనివ్వక ఇప్పుడు చూడు గాయత్రీ! ఇద్దరం ఎంత వేదనకు గురికావలసి వచ్చిందో! మన మూలంగా మీ నాన్నగారు శాశ్వతంగా దూరం అయిపోయారు ఆ పాపం మనకే గాయత్రీ!"

అతని కళ్ళనుంచి నీళ్ళు జలజలా ప్రవహిస్తుంటే గుండెలు పొంగే వేదనతో దిండులో మొహం దాచుకున్నాడు

"బాబూ! కాఫీ తీసుకో!" అన్న పిలుపు విని తలెత్తి చూశాడు ఎదురుగా పార్వతిగారు కాఫీ కప్పుతో నిలబడివున్నారు వేగంగా మంచం మీంచి లేచి తొట్రుపాటుతో అన్నాడు –


"మీరు తీసుకువచ్చారేం ఆంటీ! రాముూ లేడా!" కాఫీ కప్పు అందుకున్నాడు ఆమె చేతినుంచి


"బాబూ! ఇంకెన్నాళ్ళు నువ్విలా ఒంటరిగా ఇలా అయిపోతావు మీ నాన్నగారు నీ గురించి ఎంతో బాధ పడుతూ ఉత్తరాలు రాస్తున్నారు ఇంకా గాయత్రి కనుపిస్తుందనే అనుకుంటున్నావా ఎక్కడో ఉంటే, కనీసం ఉత్తరమేనా రాయకుండా వుంటుందా?

నువ్విలా కుమిలిపోతూ కళ్ళముందు తిరుగుతుంటే పెద్దవాళ్ళం చూస్తూ ఎలా వూరుకోగలం బాబూ! ఎంత చిక్కిపోయావో చూడు కాలం ఎంతటి గాయాన్నయినా మాన్పుతుందంటారు నువ్వు గాయత్రిని మర్చిపోవాలి!"

"ఆంటీ" అంటూ ఏదో చెప్పబోయిన అతన్ని వారిస్తూ –

"నువ్వు కిరణ్ వేబీల బాధ్యత తీసు





కున్నావు. వాళ్ళ కుటుంబానికి చెయ్యగల న్యాయం ఇంతకన్నా ఏం వుంటుంది చెప్పు! నీ కోసం ఒక సంబంధం చూశాం! అమ్మాయి అన్నివిధాలా నీకు సరిపోతుంది. మంచి కుటుంబం. వాళ్ళ సాంప్రదాయం, కుటుంబ విషయాలు మాకు చాలా నచ్చాయి. నువ్వు సరేనంటే మిగతా విషయాలు మీ నాన్నగారితో మాట్లాడదాం!'! అన్నారావిడ.

"క్షమించండి ఆంటీ! మీరేమీ అనుకోకపోతే ఇంకెప్పుడూ ఈ విషయం నా దగ్గిర ప్రస్తావించకండి !" అంటూ అక్కడినుంచి దూరంగా వెళ్ళిపోయి...కొండలకేసి శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు.

ఉస్సురని నిట్టూర్చింది పార్వతిగారు.

*　　*　　*

శ్రీకాంతన్ మెల్లగా లేచి తిరగ్గలుగుతున్నాడు. గాయాలు కూడా తగ్గుముఖం పట్టాయి. రోజూ గాయత్రి మందు రాసి కట్టు కట్టేది.

ఒకరోజు సాయం సమయంలో పూల మొక్కల మధ్య కూర్చుని కబుర్లలో పడ్డారు ఇద్దరూ.

శ్రీకాంతన్ చుట్టూ ప్రకృతిని పరికించి చూస్తూ అన్నాడు.

"యీ ప్రకృతికి మానవుడు చాలా ఋణపడి వున్నాడేమోకదూ గాయత్రీ"—

గాయత్రి అంగీకారంగా తల వూపుతూ అంది –

"అవునుగా నీ ఇన్ని అందాలూ, ఆనందాలూ నింపుకున్న సృష్టి ... అంతే బాధల్ని ... వేదనల్ని, దుఃఖాన్ని కూడా ఎందుకు పదిలపరుచుకుంది? అదే చాలా విచిత్రంగా అనిపిస్తుంది."

"మరి జీవితమంటే అదే గాయత్రీ!"

మెరుపులా అతన్ని చూసిందామె. "జీవితం అంటె అదేనని తేలిగ్గా అంగీకరిస్తున్న మీరు పెళ్ళెందుకు చేసుకోరు?"

యీ ప్రశ్నకు ఇబ్బందిగా మొహం పెట్టాడతను. మెత్తగా నవ్వింది గాయత్రి.

"గాయత్రీ! నువ్వు వేసిన ప్రశ్న నాకు అంతగా అర్థం కాలేదు. పెళ్లి చేసుకుంటే కష్టాలు ఎదురవుతాయని, వాటికి నేనుభయపడుతున్నానని నువ్వు భావిస్తే ... నువ్వు పొరపాటు పడుతున్నావంటాన్నేను. నీకు ఇదివరకే చెప్పాను. నాకు ప్రేమమీద నమ్మకం కుదరటంలేదని"—

"మీ జీవితంలో ఎవరైనా స్త్రీ ప్రవేశించి మిమ్మల్ని మోసగించిందా?"

చిన్నగా నిట్టూర్చాడు శ్రీకాంతన్.

"ఒక విషయం మీద నమ్మకం ఏర్పడటానికి కేవలం మనం అనుభవాన్నే ప్రాతిపదికగా తీసుకోనవసరంలేదు. సమాజంలో కొందరి వ్యక్తుల జీవితాలు మనకు దర్పణంగా నిలిచి ఒక నిర్దుష్టమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకునేలా చేస్తాయి.

గాయత్రీ! సందర్భం వచ్చింది కాబట్టి మరో విషయం చెప్తున్నాను. మా అమ్మా నాన్నలది ప్రేమ వివాహం. అదేం ప్రేమోగానీ, నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచి వాళ్ళు అన్యోన్యంగా వుండటం నేను చూడనేలేదు. ప్రతి చిన్న విషయానికి, ఎప్పుడూ పోట్లాడుకుంటూనే వుండేవారు. అది నా చిన్న మనసులో ఒక రకమయిన విరక్తి భావాన్ని కలుగజేసింది. కానీ నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడలేక పోయేవాడిని. వాళ్లు నా తలిదండ్రులే అయినా, స్వంత ఇంట్లో పరాయి వాడిగా బ్రతికాను. ...ఎప్పుడూ ఒంటరి తనాన్ని కోరుకుంటూ పుస్తకాలు తీసుకుని చెట్లవెంటా, పుట్లవెంటా తిరిగేవాణ్ణి.

నా గురించి పట్టించుకునే వారూ, ఆప్యాయంగా దగ్గరికి తీసుకునేవారూ లేని నేను, నా బాధంతా ప్రకృతికి విన్నవించుకునేవాడిని. అలాటి బాధల్లోంచే నాలో భావం పుట్టింది. అందుకే నేను భావుకుడిని అయ్యానేమో అనిపిస్తుంది నాకు.

నేను డిగ్రీలో వుండగానే మా అమ్మ చనిపోయింది. అప్పుడు మా నాన్న ఏడుపు వర్ణించనలవికాదు. 'అలా అన్నానూ, ఇలా బాధ పెట్టాను, నన్ను క్షమించు' అంటూ ఎప్పుడూ ఏడుస్తూ వుండేవాడు. ఆయన్ని ఓదార్చే చనువూ, అభిమానం ఆ క్షణంలో నాకు లేకుండా పోయాయి. చూస్తూ వూరుకునేవాణ్ణి. సంవత్సరం తీరకుండానే ఆయనకూడా నాకు దూరమైపోయారు శాశ్వితంగా.

కొందరి మిత్రుల సాయంవల్ల, స్కాలర్‌షిప్పులతోనూ నా చదువుకి ఆటంకం ఏర్పడలేదు. అలాగే ఎమ్మే పూర్తిచేసి జీవితంలో స్థిరపడగలిగాను... ఇప్పటికీ... గాయత్రీ! పెళ్ళి ప్రేమా అనే మాట ఎవరైనా ఎత్తినా, నాలో మొలకెత్తినా... వాటిని మొదలంటా పెరికి వేస్తాను. ప్రేమ అనే పదానికి అర్థం నాకు సమస్యగా, ప్రశ్నగా మిగిలిపోయింది."

అతను కళ్ళజోడు తీసి ఓసారి కళ్ళు తుడుచుకుని మళ్ళీ పెట్టుకున్నాడు. అతని మాటలు గాయత్రిని కలవరపెట్టాయి. చిన్నతనంనుంచి అతని మనసులో ఎంతటి బాధ గూడు కట్టుకొని వుందో! అతని బ్రతుకంతా ఇలా గడిచిపోవలసిందేనా! కన్నవాళ్ళ ప్రేమలేకా, జీవితాన్ని పంచుకునే స్త్రీ అనురాగంలేకా, అతను ఎలా బ్రతగ్గలుగుతున్నాడు ??

ప్రేమ అనే పదానికి అర్థమే లేకపోతే తను సురేంద్రను ప్రేమించటం భ్రమా! తమ ప్రేమ నిజమైంది కాదా!! ప్రేమలేనిదే యీ సృష్టి, స్థితి, లయాలు ఎలా జరుగుతున్నాయి.. లేదు... లేదు... ప్రేమనేది యీ సృష్టిలోనే మిళితమై వుంది. తను సురేంద్రని ప్రేమిస్తుంది. తమ బంధం నిజమైనది" అనుకుంది మనసులో.

చాలాసేపు మౌనమే వాళ్ళిద్దరి మధ్యా మాటలయ్యాయి. వేరు వేరు ఆలోచనలలో అక్కడే కూర్చుండిపోయారు...

కొద్దిసేపటికి అక్కడినుంచి లేచి ఇంట్లోకి రాబోతున్న శ్రీకాంతన్ చేతికి గుమ్మం తగిలి అబ్బా, అని గట్టిగా మూలిగాడు.

ముందు అడుగులేస్తున్న గాయత్రి అతని కేకవిని గిరుక్కున వెనుదిరిగి అతని దగ్గరికి వచ్చింది కంగారుగా.

ఇది మేఘ సందేశమూ ..

రేగిన గాయాన్ని చూసి గబగబా వెళ్ళి ఆయింట్‌మెంటు తెచ్చి, అతన్ని కూర్చోబెట్టి గాయానికి రాసింది మృదువుగా. ఆమె లేవబోతుంటే ఆమె చేతిని అందుకుని హృదయానికి హత్తుకున్నాడు అప్రయత్నంగా. అతను తన కళ్ళల్లోకి చూస్తూ వెతికేదేవిటో ఆమెకు అర్థం కాలేదు.

అతని వంక వింతగా చూసింది. నెమ్మదిగా తన చేతిని విడిపించుకుని లోపలికి నడవబోయింది.

"గాయత్రీ !" –

అతను చెప్పబోయేదేవిటో గ్రహించినట్టు ఆమె మనసు తత్తరపడింది. ఒళ్ళంతా చెమటలు పట్టేనట్టయింది.

ఆమె సంకోచం చూసి అతను నవ్వాడు.

"గాయత్రీ ! నేనంటే నీకెలాంటి అభిప్రాయం వుంది ?" అనడిగాడు అతి మామూలుగా.

గాయత్రికి ఏం సమాధానం చెప్పాలో, అతనెందుకలా అడుగుతున్నాడో అర్థం కాలేదు. కొద్ది క్షణాల తర్వాత మెల్లగా అంది.

"ఒకరి మీద ఒకరి అభిప్రాయం తెలుసుకోవాల్సిన అవసరం జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తుంది... కానీ నాకిలా రెండోసారి రావటం అనవసరం గానూ, అనాసక్తి గానూ అనిపిస్తుంది శ్రీకాంత్."

ఆమె సమాధానం అతనిలో ఎలాటి భావాన్ని కలుగజేసిందో గానీ... నెమ్మదిగా లేచి "ఆశ్రమానికి వెళ్తున్నాను. తలుపు వేసుకో గాయత్రీ, అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

శ్రీకాంతన్ ఆమెకి కొత్తగా కనిపిస్తున్నాడు. అది నిజమా, భ్రమా అన్న సంశయంలో పడింది గాయత్రి.

అతనికి ప్రేమంటే నమ్మకం లేదు. కానీ తను తనకి తెలీకుండానే అతని జీవితంలో ప్రవేశించి ఆ భావానికి బీజం వేసిందా !! అది పెరిగి ఎలా రూపు దాలుస్తుందో ?... అలా జరగటానికి వీల్లేదు. తను ఎవరికోసం జీవిలానికి ఎదురు తిరిగిందో అతనికే తను అంకితం కావాలి! అలా కాని రోజు తను శ్రీకాంతన్ చెప్పిన లైఫ్ థియరీస్‌ను అనుసరించటానికే ప్రయత్నిస్తుంది కానీ... అతని మనిషి కాలేదు.

"సుడిగాలిలో చిక్కుకున్న నాకు ఆశ్రయం ఇచ్చి, నన్ను ఆదరించి అభిమానిస్తున్నాడు. ఆ ఋణం నేను తీర్చుకోలేను. దేవునినమ్మే భక్తుడికి భగవంతుడంటే భక్తి ఉండాలికానీ ప్రేమ భావంతో ఆయన్ని కొలువ కూడదనిపిస్తుంది నాకు. శ్రీకాంత్ ! మీరంటే నాకున్న అభిప్రాయం ఇదే. నన్ను అర్థంచేసుకోండి." ఆమె మనసులో ఆలోచనల తుఫాన్ రేగుతోంది.

ఆశ్రమ ఆవరణలో చెట్టుక్రింద ఆ చెట్టు మొదలునానుకుని, మోకాళ్ళమీద గడ్డం ఆనించి ఎడమచేతిని మోకాళ్ళకుచుట్టి, కుడిచేతితో మట్టిలో గీతలు గీస్తూ కూర్చున్నాడు శ్రీకాంతన్.

అతని మనసెందుకో ఆ క్షణంలో కలతబారినట్టుంధి. ఉదయించే సూర్యకిరణాల కాంతిలా, అప్పుడే విచ్చుకున్నపువ్వులా ... స్వచ్ఛంగా వుండే అతనిమనసు నూతనోదయం కోసం ప్రాకులాడుతుందా !! అతని హృదయస్పందనలో మార్పు వస్తుందా ! ఆ స్పందన వెనుక ఒక అమృతానుభవం పొందాలనే ఆశ వుందా ! ! !

భవ భంధాలన్నీ పక్కకునెట్టి తనకుతోచిన మార్గంలో బ్రహ్మానందస్థితికి చేరుకోబోతున్న సిద్ధ పురుషుడిలా... కాలంగిడుపుతున్న అతనిలో ఒక స్త్రీ ప్రేమను కోరుకుంటున్నాడో... లేదో కూడా తేల్చుకోలేక పోతున్నాడు అతనే. "ఏ ఆశలకూ చలించని నా మదిలో ఇలాంటి స్పందనలు కలిగించగలిగిన గాయత్రి ఎందుకో గొప్పదనిపిస్తుంది నాకు! కానీ ఇది న్యాయం కాదే! గాయత్రీ సురేంద్రకోసం పూచిన పుష్పం! ఆ పుష్పాన్ని అతనికే అందజేయాలి.

నా జీవితగ్రంథంలో కలిసిన ఒకే ఒక స్త్రీ గాయత్రీ. నా గుండెలశబ్దం లయతప్పి... మళ్ళీ యథాస్థితికి వచ్చేసింది. ఆమె సాన్నిహిత్యాన్ని ఇక నుంచీ నా సాహిత్యానికి ఇన్స్పిరేషన్ కలుగజేస్తుంది.

భగవాన్ ! నన్నూ, నా సాహిత్యాన్ని... నీ సుకుమార పాదాలకు అంకితం చేసుకుంటాను. నన్ను తిరిగి ఏ భవబంధాలకూ బలహీనుణ్ణిచేసి ఆడించకు మనసా ! నన్ను ప్రశాంతంగా బ్రతకనివ్వు."

అనుకుంటూ నెమ్మదిగాలేచి ఒక్కో అడుగే వేసుకుంటూ వెళ్తూంటే... ఆకాశంలో చందమామ, అతని మనసు వెలుగులో తనని పోల్చుకుని చూసుకుంటున్నట్లుంది.

[ఇంకా వుంది]

కాగితం స్టీలు !

కాగితం కంటే పలుచగా ఉండే స్టీలు రేకును జపానులోని నిప్పన్‌కొకన్ కంపెనీ తయారు చేసింది. దీని మందం 30 మైక్రానులు. మైక్రాను అంటే మిల్లీ మీటరులో వెయ్యో వంతు ఉంటుంది. 70 మైక్రానుల కంటే పలుచనైనా స్టీలు రేకును తయారు చేయటం సాధ్యం కాదని భావించారు. ఈ కొత్త ఉత్పత్తి అందరికీ చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. దీనికి సీసము లేక జింకు పూత పూస్తారు. ఇది అల్యూమినం కంటే గట్టిగానూ, చౌకగాను ఉండగలదు.

ఘాలాక్షుని డైరీ

కాబోయే దంపతులని బలిగొన్న లాటరీ!

కోయంబత్తూరుకు చెందిన మరుదూరులో కరుప్పసామి అనే వో ఆసామి కూతురు 19 ఏళ్ల పూరిగోద్దై అనే ఆమె అదే వూరుకు చెందిన 25 ఏళ్ల పరమానందం అనే అతన్ని ప్రేమించి, ప్రేమింప చేసుకున్నదట. ఈ ప్రేమాయణం తెలిసిన వీరిరువురి తలిదండ్రులూ రివాజుగా రెడ్ అనకుండా శుభం అన్నారట. వివాహ ముహూర్తం కూడా పెట్టేసుకోవాలని నిశ్చయం చేసుకున్నారట ఈలోగా కరుప్పసామికి భూటాన్ లాటరీలో లక్ష రూపాయలు వచ్చిందట. దాంతో అతను తానో లక్షాధికారయినట్టు భావించి, ధూత్తెరీ, యీ బీద సంబంధం నా పిల్లకు చేయను అన్నాట్ట. దాంతో పూంగోద్దై గుండె బద్దలై, ఆ విషయం వో వుత్తరంలో రాసి, పెరట్లో నూతిలోపడి, చనిపోయిందట. ఈ విషయం తెలిసిన పరమానందం విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడట — వన్‌లాక్ — టూలైవ్స్.

పరారైన ఖైదీ! పోలీసు శవం?

బెంగుళూరులో అసంఖ్యాకములయిన చిన్నా పెద్దా దొంగతనాలుచేసి పేరు ప్రఖ్యాతులు గడించిన డాక్టర్ రవి అనే ఆయన యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారట. ఈయనను వేలూరుకు చెందిన భాగాయం అనే వూరిలోని మెంటల్ ఆసుపత్రిలో జరిగిన వో దోపిడికేసు విచారణ సంబంధంగా జయశీలన్, మహమ్మాదు హసిన్ అనే ఇద్దరు పోలీసులు వేలూరుకు తీసుకు వెళ్ళారట. రైల్వేస్టేషను వెయిటింగ్ రూములో రవిని, జయశీలన్ను కూర్చోపెట్టి హెడ్ మహమ్మద్ మంచినీళ్ళు త్రాగడానికి వెళ్ళొచ్చే సరికి (తెలవారుఝామున మూడు గంటలకు) జయశీలన్ కుర్చీలో చచ్చిపడున్నాడట. తుపాకి గాయం అతని గుండెలోంచి వెనుక వెన్ను వరకు నచ్చి రక్తంలో వొళ్ళంతా తడిసి వున్నదట. చేతిలో సిగరెట్టు అలాగే వెలుగుతూనే వుందట. జయశీలన్ ఆత్మహత్య చేసుకున్నట్టనుమానిస్తోందట పోలీసుశాఖ, డాక్టర్ రవి కనపడలేదట. ఖైదీ పరారయిపోయాడన్న భయంతో జయశీలన్ ఆత్మహత్య చేసుకున్నాడా! లేక...

కాపీ బదులు కరెన్సీ!

బొంబాయి విశ్వవిద్యాలయం పరీక్షలలో వో యిద్దరు విద్యార్థులు పరీక్ష ప్యాసవడానికి 'కాపి' కన్నా మరో కొత్త మార్గం కనిపెట్టారట. తమ ఆన్సరు పేపర్లకు వారు శక్తికొద్దీ డబ్బు నోట్లను పిన్నులతో గుచ్చారట. ఒక విద్యార్థి న్యూరూపాయలు గుచ్చితే మరొక విద్యార్థి రెండు ఇరవై రూపాయలనోట్లు గుచ్చి ప్లీజ్ హెల్ప్‌మి అని సందేశమిచ్చాడట.

సృష్టిలో చెదపురుగు ఘనత!


ప్రాణికోటిలో చెదపురుగులు పుట్టినన్ని మరేవీ పుట్టలేవట. ఒక చెదపురుగు రోజుకు 80 వేల గుడ్లు పెట్టగలదట ఈ లెక్కన ఎడతెరిపి లేకుండా నెలల తరబడి పెట్టగలదట


టీ ఎగుమతిలో పోటీ!

భారతదేశం నుంచి 1980 వ సంవత్సరంలో 225 మిలియను కిలోల తేయాకు యు. కె. జపాన్, రష్యా, వెస్ట్ జర్మనీ, ఆస్ట్రేలియా వంటి యాభై దేశాలకు ఎగుమతి అయ్యిందట. భారతదేశపు సాటిలేని యీ తేయాకు ఎగుమతికి యిపుడు సింహళము, చైనా పోటీకి వస్తున్నాయట.

మొరార్జీకి సి.ఐ.ఎ.తో సంబంధాలు ?!

భారతదేశపు ఒకనాటి డిప్యూటీ ప్రయిమినిష్టరు మొరార్జీ దేశాయ్ ఆనాడా పోస్ట్ రాజినామా యిచ్చిన సంవత్సరం నుంచి అమెరికన్ సెంట్రల్ ఇంటెలిజన్స్ సంస్థకు భారతదేశపు ముఖ్యసమాచారాలు అందజేసి పనిచేసి ఏటికి ఇరవై వేల డాలర్లు వేతనంగా పొందారట. భారత — రష్యా మైత్రి వివరాలు, అలనాటి తూర్పు పాకిస్థాన్, పశ్చిమ పాకిస్థాన్ యుద్ధంలో భారత ప్రధాని కలుగజేసుకోడంలోని ఆలోచనలు, కార్యక్రమాలు, (బంగ్లాదేశ పుట్టుక) వంటి అతిముఖ్యమయిన, రహస్యమయిన సమాచారాలు యీయన ఆ సంస్థకు జేరవేసి, ఆ సంస్థ చేత అతి ముఖ్యమయిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారట. ఈ విషయాలు తగు ఆధారాలతో అమెరికాలో అతి ప్రసిద్ధి పొందిన పత్రికా రచయిత సేమవుర్ హెర్ష్‌ను రచించిన వుద్గ్రంధం "ప్రయిస్ ఆఫ్ పవర్ (అధికారమా ... నీ వెల ఎంత)" అనే పుస్తకంలో పేర్కొన్నారట— ★





వెల్ డన్!!!

రాయప్రోలు హైమ

అదొక జల — విద్యుత్‌శాఖ ఉద్యోగస్థులు నివసించే కాలనీ. మిగతా రాష్ట్రంతో సంబంధంలేకుండా ఎక్కడో అడవిలో విసిరేసినట్లున్న ప్రాజెక్టేఅయినా... జల... మరియు విద్యుత్‌శాఖకదా! జగజ్జ్గాయమానంగా వెలిగిపోతోంది.

'ఏ' టైప్, 'బి' టైప్, 'సి' టైప్, ఏవన్, బివన్, సివన్... ఇత్యాది రకరకాల క్వార్టర్సు. అన్నిట్లోనూ ట్యూబ్‌లైట్లే... వీధిల్లో, పెరట్లో... బాత్ రూమ్ లో... వంటింట్లో... పుష్కలంగా, ఇరవైనాలుగ్గంటలూ నీరుజిమ్మే పంపులు... ఆడపిల్లల హైస్కూలు... మగపిల్లల హైస్కూలు... లేడీస్‌క్లబ్... జెంట్స్ అసోసియేషన్... బాలానంద సంఘం...టెన్నిస్ కోర్టు... క్రికెట్ పిచ్.. ఆడిటోరియం... ఒకటేమిటి... ఆ వైభవం... ఆ హడావుడి వర్ణించలేం. రోజంతా సందడే— ఏటి పొడుగునా హుషారూ...ఏమొచ్చినా ఇహ ఆ కాలనీలో జనాన్ని పట్టలేం. రకరకాల సరదాలు జరుపుకుంటారు. కష్టాలు... సుఖాలు పంచుకుంటారు. గొప్పలు ప్రదర్శించడంలో పోటీపడతారు. 'కొత్త' అన్నది ఏదయినాసరే తామే ముందుగా అందుకోవాలని అర్రులు చాస్తారు.

అలాంటి ఆ కాలనీలో ఒక కొత్త ప్రాణి అడుగుపెట్టేడు. మోహన్‌క్రిష్ణ, చురుకైనవాడు. చూపరి. ముప్ఫైరెండేళ్ల బిగుతు ప్రాయంలో ఉన్నాడు. బ్రహ్మచారి వచ్చీరాగానే క్రికెట్ క్లబ్ మెంబరయిపోయేడు, యంగ్‌మెన్స్ అసోసియేషన్లో జేరేడు. డ్రమెటిక్స్ అండ్ కల్చరల్‌వింగ్ విజిట్ చేసేడు. మీదు మిక్కిలి, ఆడామగా పిన్నాపెద్దా అందరి మనసుల్లోనూ మెదిలిపోవడం మొదలు పెట్టేడు.

పొట్టి స్కర్టులు — వదులు షర్టులు వేసుకునే హైస్కూలు పాపలు "అంకుల్"ని చూసి సరదాపడ్డారు. క్రికెట్ మోజులోఉన్న కుర్ర అతన్ని "హీరోవర్షిప్" చెయ్యడం మొదలు పెట్టేరు. లేడీస్‌క్లబ్‌లో కూర్చునే నడివయస్సు ఆడవాళ్ళు అతని 'వయస్సు' అంచనా కట్టడం మొదలుపెట్టేరు.

ఆడపిల్లల తండ్రులయిన ముసలి ఏ.యీ.లు, అన్నలయిన కుర్ర జే.యీ.లు మోహన్‌క్రిష్ణ కులం—గోత్రం, ప్రవర ఇత్యాదుల వివరాలు సేకరించబట్టేరు.

సూపరింటెండెంటు ఇంజనీరు సుబ్బరామయ్యగార్కి మోహన్‌క్రిష్ణతో నేస్తం బాగా కుదిరింది. ఆయనకి అతని కులంతో కులం, గోత్రంతో గోత్రం, సరిగ్గా అతికినట్లు సరిపోయేయి. కుర్రాణ్ణి నెమ్మదిగా దువ్వి పని సాధించుకోవాలని ఉబలాటపడ్డారు. తదనుగుణంగా ఆరోజు అతనికి ప్రత్యేకమయిన విందు ఏర్పాటు చేసేరు.

సందర్భం లేకపోలేదు. ప్రాజెక్ట్ ఎంప్లాయీస్ క్లబ్‌వారి మధ్య వార్షిక సాంస్కృతికోత్సవాలు నిర్వహించేరు. డ్రామాలు,డాన్సులు, కవి సమ్మేళనాలే కాకుండా... ఇన్‌డోర్, అవుట్‌డోర్ గేమ్స్ మరియు స్పోర్ట్సులో కూడా పోటీలు జరిగాయి. మొన్న మొన్న వచ్చిన మోహన్‌క్రిష్ణ అడ్డు లేకుండా "షైన్" అయిపోయేడు. డ్రామాల్లో 'బెస్ట్ ఆక్టర్' అనిపించుకున్నాడు. డిస్కోడాన్సు చేసి ప్రేక్షకుల్లో ఒక రకమైన "ఊపు" తెప్పించేడు. షటిల్‌మిక్సెడ్ డబుల్స్ ఆడి తన టీమ్‌కి ప్రైజు తెప్పించేడు. అన్నిటికంటె గొప్ప విషయం గత ఆరేళ్లుగా అడ్డులేకుండా 'చెస్‌ఛాంపియన్'గా కొనసాగుతూ వచ్చిన సుబ్బరామయ్యగార్ని చిత్తుగా కట్టేసి "ఛాంపియన్ షిప్" తీసుకున్నాడు. సుబ్బరామయ్యగారు ఓటమిని హుందాగా స్వీకరించేరు. విజేతకి విందు ఏర్పాటు చేసేరు.

తనతోపాటు మరింత మంది ఏ. యీ.లనీ, జే. యీ. లనీ... ఇంకా...ప్రాజెక్టు వి.ఐ.పీ. లనీ విందుకు పిలుస్తాడనుకున్నాడు మోహన్. బెస్టు డ్రెస్ వేసుకుని ట్రిమ్ముగా తయారయి . అందర్నీ అలరించాలి అనుకున్నాడు.

"అబ్బే! అలాంటిదేం ఉండదు. సుబ్బరామయ్యగారు పది మందికి విందు చేసే బాపతు కాదు" అన్నాడు రఘు చెస్ కాయిన్స్ తీసి టిన్‌లో పడేస్తూ.

"అంటే" టై కట్టుకుంటున్నవాడల్లా ఆగిపోయి రఘు కేసి చూసేడు మోహన్.

రఘు అర్ధవంతంగా నవ్వేడు. లలల లలల లలల్లా ... చిన్న ట్యూన్ ఒకటి హమ్ చేసేడు చెస్ కాయిన్స్ ఎగరేస్తూ పట్టుకుంటూ ఆట మొదలు పెట్టేడు.

పిచ్చివేషాలు మాని చెప్పదల్చుకున్నదేదో సూటిగా చెప్పు ... గద్దించేడు మోహన్.

రఘు వెర్రి మొహం పెట్టేడు మోహన్ గద్దింపుకి. చూపులు దించేసి హమ్మింగ్ మానేసేడు.

మోహన్‌కి జాలేసింది, "పాపం చంటి" అనుకున్నాడు. రఘు అవటానికి మోహన్ జేయీచేస్తున్న సెక్షన్‌లోనే 'ఎల్డీసీ' చేస్తున్నా అతన్నెవరూ "మీరు" అని మన్నించరు. మొదట్లో ... అతను ఆఫీసులో అందరిలోకీ చిన్నవాడు కావటాన అలా పిలుస్తున్నారేమో అనుకున్నాడు. కాని ఫోర్తుక్లాసు ఎంప్లాయీస్ కూడా 'చంటి బాబూ" 'నువ్వు' అంటుంటే విషయం ఏమిటా అని 'ఆరా' తీసేడు.

రఘువాళ్ల నాన్న రామక్రిష్ణ... ఇదే ఆఫీసులో సెక్షన్ హెడ్‌గా పనిచేస్తూ ఒక దుర్దినాన ఆఫీసులో కూర్చున్నవాడుకూర్చున్నట్లే గుండెపోటు వచ్చి చచ్చిపోయేడు. అప్పుడు బి. కాం. ఫైనలియర్ చదువుతున్నాడు చంటి ఉరఫ్ రఘురామ్. అతనే ఇంటికి పెద్ద, వెనక ఇద్దరు చెల్లాయిలు ఒక తమ్ముడు ఉన్నారు. వరసగా జూనియర్ కాలేజ్, హైస్కూలు, ఎలిమెంటరీ స్కూల్సులో చదువుతున్నారు రామకృష్ణ నిక్కచ్చి అయిన ఆఫీసరు. పైసా లంచం పుచ్చుకోలేదు. పగలు రాత్రి కష్టపడి పనిచేసేడు. రఘురామ్ ఆస్థిపాస్తులు మిగల్చకపోయి సర్వీసులో వుండగా చచ్చిపోయినందున అదే సెక్షన్‌లో ఎల్డీసీ పోస్టు దొరికింది. తల్లికి ఏర్పాటు చెయ్యబడిన విడో పెన్షన్. తమ్ముడికి చెల్లాయికి లభించే మైనర్ గ్రాంటు... అతని జీతంతో ఏదో కాలక్షేపం అయిపోతోంది. 'బి' టైప్ క్వార్టర్సు నుంచి 'సి'కి మారేరు. సుబ్బరామయ్యగారే పూనుకుని రఘుకి ఉద్యోగం— ఆ కుటుంబానికి పెన్షన్ రావడం ఆలస్యం కాకుండా చూసేరు. రఘు జీతం తీసుకెళ్లి తల్లి చేతిలో పోస్తాడు. తను నిర్వ్యాచీగా ఆఫీస్‌కాగానే క్రికెట్ ఆడుకుంటూ తిరుగుతాడు.


రఘు కథ విన్నాక మోహన్‌కి అతని మీద చాలా జాలివేసింది. ముక్కుపచ్చలారని కుర్రాడు. మీసాలు షేవ్ చేసుకోవటం కూడా రాదు. నున్న బుగ్గలింకా గరుకు తేలనే లేదు, నిన్నటిదాకా 'పోర్షియా' వేషం వేసి ఇప్పుడిప్పుడే ప్రిన్స్‌హేమ్లెట్ వేషం వెయ్యబోతున్న షేక్స్పియర్ హీరో లాగ సిగ్గుగా —చిలిపిగా.. లేతగా ఉన్నాడు. ఇతన్ని తన వెంట తిప్పుకుని తన విద్యలన్నీ నేర్పి కాకలుతీరిన మగరాయుడిలాగ చెయ్యాలి.

సరేకాని ...రఘూ...ఇంకెవర్నీ పిలవకుండా నా ఒక్కడికే ఎందుకోయ్ విందు...బిక్కమొహం పెట్టిన రఘుని అనునయిస్తూ అడిగేడు మోహన్.

అక్కడే ఉంది అసలు రహస్యం. వాళ్లింట్లో ఓ అందమయిన అమ్మాయుంది ... ఊరించేడు రఘు మోహన్‌ని.

"అమ్మాయా! ఎవరు...ఆ అన్‌ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడోనా ..." గిరీశంలా అద్దంలో చూసుకుంటూ క్రాపు సరిచేసుకున్నాడు మోహన్.

ఆ అన్‌ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడో సుబ్బరామయ్యగారి పెద్దకోడలు మాలతి. ఆయన చెల్లెలి కూతురేను. తండ్రి చిన్నతనం లోనే చనిపోగా...తల్లే సర్వస్వం అయి మాలతిని పెంచింది. అమలాపురంలో ఉన్న పదెకరాల కొబ్బరితోట, పెంకుటి లోగిలి దాయాదులకి పోకుండా స్వయంగా కాపాడుకుంటూ బిడ్డని చదివించుకుంది. ఎండనక వాన అనక పొలాల వెంటపడి తిరుగుతూ, ఏళ్లతరబడి వ్యవసాయం చేయించిందేమో ఆవిడ ఆరోగ్యం పాడయింది. లెక్కచెయ్యకుండా వ్యాధి ముదరబెట్టేసుకుంది. చివరకి కన్నుమూసేటప్పుడు, కన్నకూతుర్నీ ఉన్న సంపదనీ అన్నగారైన సుబ్బరామయ్య చేతిలో పెట్టేసింది. అప్పటికి మాలతి ఆంధ్రా



వెల్ డన్

యూనివర్సిటీలో ఎమ్మే ఫైనలియర్ చదువుతోంది. చనిపోయిన తల్లి నిర్ణయం ప్రకారం మామయ్య పెద్దకొడుకు డాక్టర్ గోపాల్ని పెళ్లాడింది. రెండేళ్లు కాపురం చేసింది.

గోపాల్ తండ్రి ప్రోద్బలం మీద గల్ఫ్ కంట్రీస్ వెడుతూ విమాన ప్రమాదంలో చచ్చిపోయేడు.

మాలతి కష్టాలకి అలవాటు పడిపోయింది. ఏడ్చినన్నాళ్లు ఏడ్చి గంభీరంగా ఇంటి బాధ్యత నెత్తిన వేసుకుంది. సుబ్బరామయ్యగారి భార్య రోగిష్టిది. ఆడపడుచుల పురుళ్లు రాకపోకలు, వేరే ఊళ్లల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న మరుదులకి ఆవకాయలు అందించడాలు, మంచంలో అత్తగారి సంరక్షణ, ఆఖరి ఆడబడుచు రాధ బాధ్యత ... స్వీకరించి గత అయిదారేళ్లుగా ఆ కుటుంబానికి పెద్ద అండగా నిలబడింది ... మాలతి.

"ఆవిడ గురించి కాదు నేను చెప్పేదీ ! సుబ్బరామయ్యగారి అమ్మాయి రాధ" నీళ్లు నమిలేడు రఘు.

"బావుంటుందా ?" ఊరిస్తున్నట్లుగా కొంటెగా చూసేడు మోహన్.

"చాలా అందంగా ఉంటుంది ! ఆ రోజు లైట్ మ్యూజిక్ పోటీలప్పుడు "నన్నిడిసి పెట్టెల్లినాడే" పాడలా . ఆ అమ్మాయి" రఘు లేచి నిలబడ్డాడు వెళ్లిపోడానికి ఉద్యుక్తుడవుతూ.

"ఓహో ! నేను సరిగ్గా చూళ్లేదులే..." ఇంటికి తాళం పెట్టేడు మోహన్. ఇద్దరూ కలసి కాంపౌండు దాటి రోడ్డెక్కేరు. వంద గజాలు మౌనంగా నడిచేరు. మళ్లీ రఘు అన్నాడు —

"కాని రాధ మీ కంటె చాలా చిన్నది, నా క్లాస్మేట్" ఆ మాటలంటుంటే అతని కళ్లు చెమర్చేయి. గొంతు ఆర్ద్రమయింది. రోడ్డు మలుపు రాగానే ఇద్దరూ చెరోదారి పట్టేరు.

*　　*　　*

సుబ్బరామయ్య విందుకి మరి ఇద్దరు ముసలి ఏ. ఉయాలనీ, ఒక కుర్ర జే. ఉయానికూడా పిల్చేరు. అయితే వాళ్లెవరూ కూడా సుబ్బరామయ్యగారి కులపువాళ్ళు కారు.

డాబామీద షామియానా క్రింద డిమ్ లైటింగ్ ... లైట్ ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ ... అందమైన డైనింగ్ టేబుల్ మీద అందమైన క్రోకరీ ... సుబ్బరామయ్యగారి రెండో కొడుకు రాజా...మోహన్క్రిష్ణ పక్కనే కూర్చున్నాడు. మిగతా ఏ.ఉయాలు, జే.ఉయా కూడా భార్యలతో సహా వచ్చేరు. సుబ్బరామయ్యగారి రోగిష్టి భార్య మూల్గుతూ...ముక్కుతూ దూరంగా కుర్చీలో కూర్చుంది "నాకు పథ్యమండీ ! ఈ వంట తినకూడదు ... " అంటూ.

విందు కోలాహలంగా కొనసాగిపోతోంది. మాలతి, రాధ వడ్డన చేస్తున్నారు. "మరికొంచెం వెజిటబుల్ పలావు తినవయ్యా... కుర్రాళ్లు మీరు తినకపోతే మేం తినగలమా..." తెగ బలవంతం చేసేరు సుబ్బరామయ్యగారు మోహన్ని. "అమ్మా రాధా... ఆ హల్వా ఇలా మోహన్కి వడ్డించు..." సమయం కనిపెట్టి రాధని పరిచయం చేసేరు.

"మా ఆఖరి అమ్మాయి రాధాసుందరి, బి. కాం. పాసయ్యింది. వీణ వాయిస్తుంది. ఈ పిల్ల పెళ్లి ఒక్కటీ చేసేస్తే నేను తెమిలిపోయినట్లే... హహహ..." అట్టహాసంగా నవ్వేరాయన. అందరూ శృతి కలిపేరు.

మోహన్ రాధకేసి చూసేడు. బంగారుతీగ. చెరకుగెడలా సన్నగా పొడవుగా సౌకుమార్యంగా ఉంది. లంగా వోణీ వేసుకుంది. రెండు పొడవాటి జడలు వీపుమీద జీరాడుతున్నాయి. పెద్ద పెద్ద కాటుక కళ్లలో భయం అమాయకత్వం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. మూర్తీభవించిన ముగ్ధత్వంలా ఉంది. "చంటిది" అనుకున్నాడు మోహన్.

అతను కన్నార్పకుండా రాధకేసి చూడ్డం చూసి ఆనందంగా నిట్టూర్చేరు సుబ్బరామయ్యగారు. "హాఫ్ ది బేటిల్ ఈజ్ వన్" అనుకుంటూ !

భోజనాలు ముగించి డాబా దిగి కాంపౌండులో కుర్చీలేసుకుని కూర్చున్నారు మగవాళ్ళు. ఆడవాళ్లు లోపలేదో తంటాలు పడుతున్నారు కొత్త రకాల చీరలు చూసుకుంటూ.

నెమ్మదిగా అసలు విషయాని కొచ్చేరు సుబ్బరామయ్యగారు.

"రాధని చూసేవుగా ! మీకూ మాకూ గోత్రాలు — ఋషులు చక్కగా కుదిరినట్లే, మరి నువ్వు ఆలోచించుకుని నీ అభిప్రాయం చెపితే మీ పెద్దవాళ్ల దగ్గరకి వెడతాం." నలుగురు పెద్దమనుషులుండగా తను సంబంధం కదలేస్తే... కాలనీలో మరెవరూ పోటీ రాకుండా వీళ్లు చూస్తారు. సుబ్బరామయ్యగారు తెలివి తక్కువవాడేం కాదు.

మోహన్ కొంచెంసేపేం మాట్లాడలేదు. మొహంలో ప్రసన్నత అలాగే ఉంది. కుర్చీలో 'రిలాక్సింగ్'గా ఊగుతూ 'చూద్దాం' అన్నాడు. అతని నుంచి ఎలాంటి మాటొస్తుందో తెలియక తికమక పడుతున్న సుబ్బరామయ్యగారు "అమ్మయ్య" అనుకున్నారు.

"టేక్ యువర్ ఓన్ టయిమ్" అని ఆయనంటుండగా "మామయ్యా వక్కపొడి ఇదిగో" అంటూ మాలతి వచ్చి వక్కపొడి డబ్బా అందించింది.

"మోహన్ ! మాలతిని పరిచయం చెయ్యలేదుగా ! మా పెద్దకోడలు, ఎమ్మే...సైకాలజీ ఫస్టుక్లాసు... దాని ఖర్మ... నా ఖర్మ ఇలా కాలి

పోయింది కాబట్టి కానీ ... ఈపాటికి ముగ్గురు పిల్లల తల్లి కావాల్సిందే," సుబ్బరామయ్యగారి కళ్ళు చెమర్చేయి. గొంతు గద్గదమయింది. "నా పెద్దకొడుకే ఉంటేనా ..." ఇంకా ఏదో చెప్పబోయేడాయన.

"ఊరుకో మామయ్యా !" వారించింది మాలతి.

"నువ్వే అలా ఢీలాపడిపోతావేమిటి మాటి మాటికీనూ ! పరిస్థితులలో మార్పులొస్తుంటాయి. గంభీరంగా ఎదుర్కోవడమే" వక్కపొడి డబ్బా టీపాయ్ మీదుంచుతున్న మాలతికేసి చూసేడు మోహన్‌క్రిష్ణ. పెద్ద కళ్లు ఆమె గుండె లోతుల్ని చాటుతున్నాయి. విల్లు వంటి కనుబొమ్మలు. కోటేరేసిన ముక్కు, తీర్చి దిద్దినట్లున్న రూపురేఖలు ... కొండపల్లి బొమ్మని తలపిస్తోంది. విశాలమైన ఫాలభాగం బొట్టులేక బోసి కొడ్తూ ఉంది. వక్కపొడి ఉంచేసి టేప్ రికార్డర్ ఆన్ చేసి లోపలికి నడిచింది మాలతి. ఆమె గడపదాటి లోపల అడుగు పెట్టేదాకా ఆమె వెంట ఆమె జలపాతంవంటి జడ వెంట వెళ్లాయి మోహన్ చూపులు.

"ఏమి హుందాతనం" అనుకున్నాడామె గురించి.

*   *   *

నేను చెప్పినవన్నీ జరిగిందా ! మీకు రాధని ప్రపోజ్ చేసేరా !. మర్నాడు ఆఫీసు పని పూర్తయ్యేక క్వార్టర్స్ వేపు నడుస్తూ రఘు అన్నాడు మోహన్‌తో.

"ఊఁ !" ముక్తసరిగా అని ఊరుకున్నాడు మోహన్.

"మీరేమన్నారు ?"

"చూద్దాం" అన్నాను.

మీకు నచ్చిందా ... ఆత్రంగా అడిగేడు రఘు !

"ఆహాః బ్రహ్మాండంగా !... కొండపల్లి బొమ్మలాగుంది !" ... మరి ప్రశ్నించలేదు రఘు. కొంచెం దూరం ఇద్దరూ మౌనంగా నడిచేరు.

రఘు వాళ్లింటివేపు తిరిగే రోడ్డురాగానే "వెడతాను" అన్నాడు, ఇద్దరూ ప్రతీరోజూ మోహన్ ఇంటికి రావడం... కాఫీ త్రాగడం... షటిల్‌కోర్టుకో, బాడ్మింటన్ కోర్టుకో వెళ్లడం అలవాటు. ఈ రోజు ఇంటికే వెడతానంటున్నాడు.

"ఏం ! నాతో వచ్చేయ్ !..."

"రాను..."

"అయితే ఇంటికివెళ్లి అట్నుంచే గ్రౌండ్స్‌కి వస్తావా ..."

"ఊహూ !" మరి మోహన్‌కేసి చూడకుండా చకచకా నడిచి వెళ్లిపోయేడు రఘు.

మోహన్ మామూలుగా గ్రౌండ్స్‌కి వెళ్లేడు. ఆడి, అలసిపోయి ఇంటికొచ్చి రాజమ్మ కాచి యిచ్చిన వేణ్ణీళ్లతో స్నానంచేసి, తల నున్నగా దువ్వుకుని పూలరంగడిలాగా ... పూలలుంగీ కట్టేడు. బెంగాలీ లాల్చీ తొడిగేడు. రేడియో పెట్టి "వివా" సిప్ చేస్తూ కుర్చీలో కూర్చోబోతుంటే కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తియ్యడానికి రాజమ్మలేదు. వంట చేసి టేబిల్‌మీద సర్దేసి వెళ్లిపోయింది. తనే లేచి తలుపు తీసేడు, "రఘు వచ్చిఉంటాడు ! తిక్కతిరిగి ఉంటుంది"...

కాని ఆశ్చర్యం ! ఎదురు మాలతీ, తెల్లటి వెంకటగిరి చీర కట్టుకుని కొంగునిండుగా కప్పుకుని చెరగని చిరునవ్వుతో గుమ్మంలో నిలబడింది.

"నమస్తే" అంది మృదువుగా !

"ప్లీజ్ కమిన్" ఆహ్వానించేడు. లోపలికి వచ్చింది. కుర్చీ చూపించేడు, కూర్చుంది. కొన్ని క్షణాలు ఎవరూ పెదవి విప్పలేదు.

"నేనిలా రావడం వింతగా ఉందనుకుంటా. అంత బాగుండదుకూడా అనుకోండి..." అంది మాలతి. ఎట్టకేలకు 'అనీజీ'గా నసుగుతూ, మోహన్ నవ్వేడు. కాస్సేపు మాలతికేసి కన్నార్పకుండా చూసేడు. తర్వాత చేతిలో ఉన్న 'వివా' కప్పు టీపాయ్‌మీద పెట్టేస్తూ అన్నాడు.

"నాకేం వింతగాలేదు. మీరు వస్తారని నాకు తెల్సు. ఇంక బావుండటం సంగతి కొస్తే అలాటివన్నీ చదువుకొని లోకజ్ఞానం లేని బ్రూట్స్ ఆలోచనలు, మళ్లీ చిరునవ్వులు చిందించేడు.

ఈసారి విస్తుపోవడం మాలతి వంతు అయింది. "నేను వస్తానని ఇతనికెలా తెల్సు !" అనుకుంది. అయినా గుంభనగా కూర్చుంది.

"చూస్తూ ఉండండి...ఇప్పుడే వస్తాను" వీక్లీ మాలతికి అందించి కిచన్‌వేపు నడిచేడు. మాలతి పత్రిక తిరగేస్తోందేకాని రకరకాల ఆలోచనలు పరుగులుపెట్టేయి. "ఏమనుకుంటున్నాడితను ... "

సెగలు కక్కే "వివా" రెండు కప్పుల్తో తెచ్చి ఒకటి మాలతికి అందించి ఒకటి తను ఉంచుకుని కుర్చీలో కూర్చుంటూ చల్లారిపోయిన "వివా" కప్పు టీపాయ్‌మీద దూరంగా జరిపేసేడు మోహన్.

"చెప్పండి" అన్నాడు సిప్‌చేస్తూ.

"నేను వస్తానని మీకు ముందే తెలుసన్నారుగా ! దేనికి వస్తానో కూడా తెలిసే ఉండాలి" అందామె కవ్విస్తూ.

"మీ రాధ నాకు బాగా నచ్చింది. మీ సాంప్రదాయం మాకు సరిపోతుంది ... మీ మామగారి ఆదరణ బాగుంది" ఇంకా ఏదో చెప్పబోయేడు మోహన్.


"కానీ ... నేను మీతో ఒక ముఖ్య విషయం మాటాడాలని వచ్చేను" మాలతి సగంలో అడ్డుపడింది.


"నేనూ మీతో ఒక ముఖ్య విషయమే మాటాడాలనుకుంటున్నాను" అన్నాడతను.

"మీ వయస్సెంత అని అడగకూడదేమో ! రాధకింకా ఇరవై నిండలేదు" మాలతి ఏం చెప్పాలో తోచక తికమకపడింది.

"నా వయస్సు ముప్పై రెండు. రాధ నా కంటే పన్నెండేళ్లు చిన్నది. లేత తమలపాకులా... మిగడ తరగలా ... "

ఆ మాటమీద మాలతి సీరియస్సయిపోయింది. "మా మామయ్య అనుకునేదానికి





తిరుగుండదు. మా మరుదులెవరూ ఆయనని కాదనరు. అందుకే ఇట్నుంచి నరుక్కొద్దామని మీతో మాట్లాడటానికి వచ్చేను'' మాలతి చాలా చాలా విషయాలు చెప్పింది. ఓపిగ్గా విన్నాడు మోహన్. అతనూ కొన్ని విషయాలు చెప్పేడు. ఆమె కూడా జాగ్రత్తగా ఆలకించింది. ఇద్దరూ కొంచెంసేపు సీరియస్‌గా ఆలోచించేరు. మరి కొంచెం తడవు ఆర్గ్యుమెంట్సు, కౌంటర్ ఆర్గ్యుమెంట్సయ్యేయి. చాలా రాత్రి అయ్యేక ఇక వెడతానంటూ లేచిందామె, సాగనంపుతూ గేటు దగ్గర నిలబడి —

''సాయం రమ్మంటారా !'' అన్నాడు మోహన్.

''అవసరం లేదు. కాని మీరు బాగా ఆలోచించి మరీ నిర్ణయం తీసుకోండి. రాధ చాలా అమాయకురాలు ! నా ప్రాణంలో ప్రాణం'' అందామె.

''ఇందులో నేను త్యాగంచేస్తున్నదేంలేదు. అంతా నా స్వార్ధమే, పోతే ... రాధ ... రాధ తరఫున మీరు ఆలోచించి నాకు చెప్పండి అయామ్ ఎట్ యువర్ డిస్పోజల్'' మాలతి కళ్లలోకి ''డీప్‌గా'' చూస్తూ అన్నాడతను.

క్షణంపాటు అలాగే చూస్తూ నిలబడి వెన్నెలలో రాజహంసలా నడుచుకుంటూ వెళ్లిపోయింది మాలతి.

* * *

రాత్రంతా నిద్రపట్టలేదు మోహన్‌కి. కలవరింతలూ పులకరింతలూను. ఏమేమిటో ఆలోచనలు, మనసు వశంతప్పింది. రెండు మూడుసార్లు లేచి మంచం మీద నిటారుగా కూర్చున్నాడు. చివరకి ఏదైనా చదివితే నిద్ర పడుతుందేమోనని, కిషన్ చందర్ రాసిన ''థౌంజెడ్ లవర్స్'' చేతపట్టేడు.

* * *

తర్వాత రెండురోజులు మౌనంగా ఉండి పోయిన రఘు ఎక్కువగా మోహన్ని పలకరించ లేదు. ముభావంగానే తన పని చూసుకుని తను ఇంటికి వెళ్లిపోతూ వచ్చేడు. ఒకనాడు మోహన్ బలవంతం చేసేడు.

''రావయ్యా నాతో రఘూ అలకమాని'' అని ! ...

రఘు సరేనన్నాడు !

చెస్ ఆడుతూ ఆడుతూ సడెన్‌గా ప్రశ్నించాడు రఘుని మోహన్ ''సుబ్బరామయ్య గారింటికి వెడదాం వస్తావా...'' దూసుకుంటూ వచ్చింది అతని జవాబు.

''నేను రాను...''

''ఏం ?''

''ఏంలేదు. నాకు సుబ్బరామయ్యగారేగా ఉద్యోగం వేయించిందీ...''

''అయితే !''

''నేను వాళ్లింటికి వెళ్లడం వాళ్ల రాధతో మాట్లాడటం మా అమ్మ దృష్టిలో కృతఘ్నత...''

''ఓహో !'' అర్థం అయినట్లు తల పంకించేడు మోహన్.

''కుర్రమొహం ! ఇంకా అమ్మ కొంగు విడిచిపెట్టలేదు.'' అనుకున్నాడు.

''పర్లేదులే ! నాతో వస్తే ఎవరూ ఏమీ అనరు... వెడదామా.''

రఘు ఏం మాట్లాడలేదు. అతనికీ వెళ్లాలనే ఉంది. కాని అభిజాత్యం అడ్డొస్తోంది. పైగా మోహన్ రాధని చేసుకుంటాడేమో ! అలాంటప్పుడు వాళ్లిద్దరూ పలకరించుకున్నా మాట్లాడుకున్నా తనక్కడ ఉండటం భావ్యం కాదేమో !...

రఘు మౌనం నచ్చలేదు మోహన్‌కి. అతని ఆలోచనలు ప్రక్కదారి పట్టిస్తూ అడిగేడు.

''తీసేసెయ్ .... !!''

నేస్తం ! ...
నీ మనో వల్మీకంలో ...
బుసలుకొట్టే ...
కోర్కెల విషనాగుల ...
కోరల్ని — తీసేసెయ్ ... !!!
లేకుంటే ...
నిన్ను కాటేస్తాయి !!
నిన్నంతం చేస్తాయి !!!

— ''సాయిబాబ''

''సుబ్బరామయ్యగారు కోడల్ని బాగానే చూస్తారు కదూ ! పాపం ఆమెమీద జాలి అనుకుంటా ! ఆవిడకి ఎక్కువ అధికారం గౌరవం ఇస్తారల్లే ఉంది...''

''బాగా చూడకేంచేస్తారు ! ఆయనదంతా మాలతిగారి పదెకరాల కొబ్బరితోటమీదున్న అభిమానమే. అమలాపురం వెళ్లిపోకుండా మచ్చికచేసి ఆవిణ్నక్కడే ఉంచేస్తే ఆస్తి బయటకి పోదని ఆయన ఆశ...''

సుబ్బరామయ్యగారి మాటెత్తితే చాలు చిరాకుపడుతున్నాడు రఘు. అతన్నింకా యింకా ఉడికించాలనిపించింది మోహన్‌కి.

''ప్రతీదానికీ పెడర్థాలు తీస్తావేం ! అలా అనుకోకపోతే ఆవిడకి వచ్చిన కష్టానికి ఆయన కన్నతండ్రిలా గుండెలో పెట్టుకుని కాపాడుతున్నా డనుకోకూడదూ...'' రఘు ఫీలింగ్స్ పరిశీలించేడు మోహన్.

''నా బొంద! ఆయనకి నిజంగా ఆవిడమీద అభిమానం, జాలీ ఉంటే రెండో పెళ్లి చెయ్య కూడదూ. తన సొంత కూతురు రాధ కోసమయితే ఇంజనీర్ని వెతుకుతున్నాడు. కోడలు బ్రతుకు మోడు అయిపోయినా ఆయనకేం బాధ ! అయినా రాధ కిప్పుడే పెళ్లి తొందరేమిటీ...''

అమ్మ చంటీ... ఎంతలేసి ఆలోచన లున్నాయి నీ మనసులో !

''సర్లే! రా నాతో—వెడదాం వాళ్ళింటికి..''

ఏమనుకున్నాడో రఘు... లేచాడు.

* * *

మోహన్‌ని చూసి చాటంత మొహం చేసుకున్న సుబ్బరామయ్యగారు— రఘుని చూసి మొహం చిట్లించుకోబోయి మోహన్ ఏమయినా అనుకుంటాడేమోనని మానేసేరు.

''రావయ్యా, నేనలా అరగంటసేపు సైట్‌మీదకి వెడుతున్నాను. ఇంట్లో పిల్ల లున్నార్లే ! మాట్లాడుతూ ఉండు వచ్చేస్తాను'' అన్నారు జీపెక్కుతూ.

''పరవాలేదులెండీ,రాధతోమాట్లాడతాను''

సుబ్బరామయ్యగారి మొహం మళ్లీ చాటంతయింది.

''ఆహా ! అలాగే, విత్ ప్లెజర్ ! కానీ !'' జీప్ తుర్రుమంది.

తర్వాత చాలాసేపు మోహన్ రఘు అక్కడే ఉన్నారు. ఇంట్లో రాధ, మాలతి వినిపోయిస్తే సుబ్బరామయ్యగారి రోగిష్టిభార్య ఎక్కడోమూల గదిలో మూలుగుతూ పడుకుని ఉంది.

చాలాసేపు నలుగురూ కబుర్లు చెప్పు కున్నారు. నవ్వుకున్నారు. కేరమ్స్ ఆడేరు.

ఆటు తర్వాత మోహన్ సుబ్బరామయ్య గారింటికి రాకపోకలు హెచ్చించేడు. పెళ్ళి కెడుతూ పిల్లిని వెంట తెచ్చినట్లుగా ప్రతిసారీ రఘుని వెంట పెట్టుకుని మరీ వస్తాడేమిటని ఆయన కొంచెం చిరాకువేసినా ...

''వీళ్ళమ్మ నాకు దూరపు చుట్టమండీ ! అత్త అవుతుంది'' అని మోహన్ చెప్పేక చేసేది లేక ఊరుకున్నాడు.

పదిహేను రోజుల తర్వాత సుబ్బరామయ్య గారు విషయం మళ్లీ మొదలకించేరు.

''నీ ఆలోచనేమిటో చెప్పేవుకాదు. నెలా పదిహేను రోజుల్లో ముహూర్తాలున్నాయి మరి''... అర్ధోక్తిలో ఆగిపోయేరు.

అన్నీ బాగానే ఉన్నాయి కాని రాధకూ నాకూ పదేళ్ల పైన వయస్సు తేడా ఉంది. జనరేషన్ గాప్ ఎక్కువయి తర్వాత కష్టం అవుతుందేమోననీ... నసిగేడు మోహన్.

''మంచి వాడివిలే ! ఆ మాత్రం వయసు తేడా అబ్బురమేముందీ ! నాకూ మా ఆవిడకీ పధ్నాలుగేళ్ళు తేడా ఉంది. రేపు ఒకరిద్దరు పిల్లలు పుడితే రాధ పెద్దదానిలాగా అయిపోతుంది. నువ్విలాగే యూత్‌ఫుల్‌గా ఉంటావు...''

నవ్వేడు మోహన్.

''ముద్దు ముచ్చట్లు లాంఛనాలూ లోటుం

డవుస్మీ!'' మోహన్ ఆదర్శాలు అర్థం చేసుకున్న సుబ్బరామయ్య కట్నం మాటెత్తలేదు, కంయ్ మంటాడని భయపడి ...

''ఆ విషయాల్లో నాకేం భయంలేదు లెండి. అయామ్ నాట్ ఫర్ సచ్ థింగ్స్! ... మా పెద్దన్నయ్య బ్యాంక్ ఏజెంట్ ... మీకు తెల్సుగా, అదేదో స్టాఫ్ ట్రైనింగు సెంటర్‌కి డిప్యుటేషన్ మీద వెళ్ళేడని. ఫస్టు దాటితేనే కాని రాడు. ఆ తర్వాత మీరు ప్రొసీడ్ అవుదుర్గాండి ...''

సుబ్బరామయ్యగార్కి మోహన్ మాటలు నచ్చినట్లున్నాయి. తృప్తిగా బొజ్జ తడుముకున్నాడు.

''అలాగే చేద్దాం! ముహూర్తాలు ఒక్క పదిహేను రోజులున్నాయనగా నాకు చెబితే చాలు. హ హ హ ...''

''హ హ హ...''మోహన్ ఆయన నవ్వుతో శృతి కలిపేడు. అయితే ఆ తర్వాత మోహన్ పెట్టిన ప్రపోజల్ మాత్రం సుబ్బరామయ్యగార్ని కొంచెం ఇబ్బంది పెట్టింది.

''రాధ నన్ను అర్థం చేసుకోవాలి! ఆమెకి నామీద ఎలాంటి అభిప్రాయం ఏర్పడిందో తెల్సుకుంటే 'ఇహ' నా అడ్డేమీ ఉండదు రేపు ఆదివారం ''కప్పల ఏరు'' జలపాతానికి పిక్‌నిక్ వెడదామని ఉంది! నాతో పంపిస్తారా!''

''ఇదేం గొడవ!... అది సాంప్రదాయిమేనా? ఆడపిల్లని పిక్‌నిక్‌లకీ దానికీ తిప్పి తర్వాత కాదంటే! మోహన్ అలాంటి వాడు కాదేమో! కాదంటే తర్వాత బ్రతగ్గలడా! దుంప తెంపెయ్యనూ ...

''సరే... అలాగే కానీ.. దానికేం భాగ్యం. జీప్ ఎరేంజ్ చెయ్యమంటావా!''. ''

* * *

కప్పలేరు జలపాతం పుంచి నట్టడవిలో ఉంది! ఎందుకయినా మంచిదని మాలతని వెంట వెళ్లమని బలవంతం చేసేరు అత్త మామలు

మోహన్...రఘు...మాలతి. రాధ. జీప్ డ్రైవర్ ఆ రోజంతా సరదాగా గడిపేసెరు రఘు, రాధ . కోతిపిల్లల్లాగా చెట్లెక్కి దూకి గంతులేసేరు. మాలతి మోహన్ మర్రిచెట్టు క్రింద కూర్చుని ఏమిటేమిటో కబుర్లు చెప్పేసుకుంటూ ఉద్రిక్తంగా పడుతున్న జలపాతం చూసేరు జీప్ డ్రైవర్.. అతని కడుపుతో ఉన్న భార్య మనసు పడిందంటూ కణుజు పిట్టల్ని కొట్టడానికి అడవి లోకంటూ వెళ్లిపోయేడు.

భోజనాల టయిమ్‌కి రాధ కారియర్లు విప్పి పులిహోర వడ్డించింది గులాబ్‌జాం కప్పుల్లో వేసి అందించింది. 'టీ' టయిమ్‌లో మాలతి స్టౌ వెలిగించి 'టీ' చేసింది. అందరూ హాయిగా తాగేరు. పేకాట ఆడేరు, కేరమ్స్ ఆడేరు. పరుగుపందేలు వేసేరు. పాటలు పాడేరు. డిస్కో చేసేరు. కణుజుపిట్టల్ని భద్రంగా దాచుకుని డ్రైవర్ కూడా అన్నిట్లోనూ సరదాగా పాల్గొన్నాడు. రాధ మొహం కడుక్కోబోయి పాకుడు కట్టిన రాయి జారి సెలయేట్లో పడడం మినహా అవాంఛనీయమయిన సంఘటనలేమీ జరగలేదు.

రాధ జారిపడింది. నీరు వేగంగా ప్రవహిస్తోంది. నాలుగైదు అడుగుల దూరం రాధని తోసేసింది. ''బాబోయ్ బాబోయ్'' అరిచింది రాధ. రఘు తత్తర పడిపోయేడు. మాలతి బిక్కమొహం పెట్టింది. మోహన్ సినీమా హీరోలా నీళ్లలో దూకేడు. క్షణంలో రాధని రెండు చేతుల మీద వేసుకుని ఒడ్డెక్కేడు.

రాధ ఖంగారు పడింది. కాని పెద్ద ప్రమాదం ఏమీ జరగలేదు. మాలతి ముందు జాగ్రత్తలో ఉండి చీరలు తెచ్చింది. కాబట్టి రాధ కొండ వెనక్కి వెళ్లిపోయి మార్చుకుంది పాపం మోహన్! రఘు తెచ్చిన లుంగీ కట్టుకుని తిరిగేడు, డ్రైవర్ బట్టలు ఆరబెట్టి తెచ్చేవరకూ! కాని చీకటి పడేవేళకి నవ్వుతూ, తుళ్లుతూ జీపెక్కేరు. రఘు చెవిలో రహస్యంగా ''ముప్ఫై మూడేళ్ల వయస్సులో నా జీవితంలో ఇదే మొదటిసారి 'లేడీ'ని చూసి నా హృదయం స్పందించడం'' అన్నాడు అర్థవంతంగా మోహన్.

* * *

మరి నాల్గురోజుల తర్వాత మోహన్ దగ్గర్లో ఉన్న చిన్న తిరుపతి దేవస్థానం చూడానికి వెడతాను రాధని పంపమని అడిగేడు. సుబ్బరామయ్యగారు ''నిరాక్షేపణీయంగా'' ఆహాలు అన్నారు. మాలతిని ఎస్కార్టు బయల్దేర మన్నారు.

ఈసారి రఘుతోపాటు అతని ఎల్డీసీ కొలీగ్ ప్రకాష్, మోహన్‌తోపాటు అతని జేంయా కొలీగ్ శంకర్ బయల్దేరేరు. జీప్ డ్రైవర్ నూకరాజు, అతని ఫ్రెండ్ అటెండర్ అప్పలకొండ.

జీప్‌లో అందరూ ఇరుక్కునిపోయి కూర్చున్నారు. మధ్యలో పళ్లు, పువ్వులు, కొబ్బరికాయలు, ఇతర పూజాద్రవ్యాలు ఉన్న గంప... ముడుపులు పగ్గైరాలున్న చిన్న బ్రీఫ్‌కేసు... తెల్లవారుజామున, నాలుగున్నరకి 'శస్యూష' మందు బయల్దేరిన జీప్ చిన్నతిరుపతి చేరేసరికి ''ఆరు'' అయింది. పూజాదికములు ముగించి కార్యక్రమావళి పూర్తిచేసుకుని పదకొండో గంటకల్లా జనం ''గెస్టుహవుస్'' చేరేరు.

మరో పది నిముషాల తర్వాత మాలతి ట్రంక్‌కాల్ బుక్ చేసింది. ఒంటిగంటకి లైన్ దొరికింది. సుబ్బరామయ్యగారే రిసీవర్ ఎత్తేరు

''హలో ... మామయ్యా! నేనుమాలతిని! మాట్లాడుతున్నాను. రాధ మనసు నీకు తెల్సుగా, అది నాకు బహిః ప్రాణమనికూడా తెల్సు, అది ఏడిస్తే నా గుండె పగిలిపోతుంది మామయ్యా, హలో... హలో... మామయ్యా! వింటున్నావా!

అందుకే నీకు తెలియకుండా. . మోహన్ గారి సహాయంతో... రాధనీ — రఘునీ వివాహ బంధంలో ముడి వేసేసేం ఈ ఉదయం ఎనిమిది గంటల నలభై అయిదు నిముషాలకి.. శ్రీశ్రీ పద్మావతీ వెంకటేశ్వరుల సమక్షంలో — హల్లో .. ప్లీజ్... అర్థంచేసుకో మామయ్యా.. అదే ముహూర్తానికి నేనూ మోహన్‌గారూ పెళ్లి చేసుకున్నాం. రాధ ఎల్. డి. సి. ని చేసుకుందని బాధపడకు మామయ్యా! నా ఆస్తిలో సరిగ్గా సగం దానిపేర రిజిష్టర్ చేయించేసేను.

ఇహ ఏముందీ! సినీమాల్లో విలన్ ఫాదరిన్లా లాగా నువ్వు తుపాకి పట్టుకుని గుమ్మంలో నిలబడతానంటే . ఇంటికి రానేరాం. సరాసరి మోహన్‌గారింటికే .. సారీ . మాయింటికే వెళ్లి పోతాం ... అక్కణ్నుంచి నేనే రాధని అత్తవారింటికి పంపుతాను. హలో మామయ్యా . హలో ... ''

రెండు నిముషాల తర్వాత సుబ్బరామయ్య గారి గొంతు విన్పించింది.

''వెల్‌డన్! మనింటికే వచ్చెయ్యండి నేను 'రిసెప్షన్' ఏర్పాట్లు చేస్తాను.''

ఆయన గొంతు కొద్దిగా వణికింది కాని ప్రేమ గెలిచింది. మోళ్లు చిగిర్చేయి మంచి మనసు పరవళ్లు తొక్కింది. ★



పిచ్చి ముదిరి పాకానపడి
మహాకవుల పద విన్యాసం
సైన్ వేవ్‌లా కదులుతుంది
పైత్యం ముదిరి చెడిన కవిత్వం
బురద చిమ్ముకునే స్థాయికి
దిగుతుంది
అరిస్టాటిల్ ఆనంద వర్ధనుడూ
వెక్కి వెక్కి ఏడుస్తారు
అవును నిజం చివరికిలాగే
అవుతుంది

— పరిగి రాధాకృష్ణ

కొత్తగొంతులు

— టి.యల్. కాంతారావు

పరిగి రాధాకృష్ణగారు వృత్తిరీత్యా ఇంజినీర్. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు; నిజామాబాద్‌లో పని చేస్తున్నారు. సుమారు పదిహేను సంవత్సరాల నుంచీ వచన కవిత్వం రాస్తున్నారు. వారి కవితలన్నీ భారతి మాస పత్రికలోనూ, ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లోనూ అచ్చు అయ్యాయి. 'రేపటి మజిలీ' ఆయన కవితా సంకలనం 1981లో వచ్చింది. ఆయన కవిత్వం రాయటం ప్రారంభించేనాటికి ఆధునిక తెలుగు కవిత్వ స్థితి కల్లోలంగా ఉంది. అభ్యుదయ సాహిత్య ఉద్యమ ప్రభావం సన్నగిల్లింది. దిగంబర కవితోద్యమం ప్రసవవేదన పడుతున్నది. సంప్రదాయం పేరుతో, ఛాందస భావాలు నాలుగు పాదాలతో తప్పటడుగులు వేస్తున్నాయి. సంఘ జీవనం విరుద్ధ భావాల కూడలిలో వెలవెలబోతోంది. సామాన్యుడి మూగరోదన, అతి సామాన్యుడి దీనావస్థ, శ్రమజీవుల జని నిష్ఠురత, నానారకాల జీవిత భ్రష్టత్వంతో పట్టపగలే అంధకారం ఆవరించిన సమాజంలో కవులూ, కళాకారులు శిథిల జీవితాన్ని చిగురింప చెయ్యటానికి, మరుగైన మానవత్వాన్ని పునర్నిర్మించటానికి పూనుకుంటారు. "అన్నిటికన్నా ముందు మనిషి, మనం నిర్మించుకున్న అనేకానేక వ్యవస్థలన్నీ కూడా తర్వాతే పరిగణనలోకి వస్తాయి. కాబట్టే మనిషిని మౌలిక విలువల వేపు నడిపించి వాటి గురించి ఆలోచింప జేయగల కవితా దర్శనానికై ఏ కవైనా కృషి చేయాల్సుంటుంది" అని అన్యాపదేశంగా తన కవితాధ్యేయాన్ని సూచించారు రాధాకృష్ణగారు.

1965 తరువాత వచ్చిన కవులలో — దిగంబర కవుల్ని తదనంతర కాలంలో ఏర్పడ్డ రచయితల సంఘాలకు నిబద్ధులైన కవుల్ని మినహాయిస్తే మిగిలిన కవులంతా మానవతా వాద కవిత్వమని, ఆశావాద కవిత్వమని, చైతన్య వాద కవిత్వమని, మరో వాద కవిత్వమని ఏదో ఒక రకంగా మనిషినీ, సంఘాన్ని అలంబన చేసుకుని కవిత్వం రాసిన వారే. పరిగి రాధాకృష్ణగారు మానవతా విలువల్ని పెంచటానికి, మనిషి తృప్తిగా, హాయిగా ఊపిరి పీల్చగలిగే వ్యవస్థను నిర్మించటానికి ఉపయోగపడే కవిత్వాన్ని రాయవలసిన అవసరం ఉందని హృదయ వఘ్నుంగా నమ్మారు. నత్త నడక, కొవ్వొత్తి కాంతి, అల్ప కవి ప్రయోగించే బూతుమాట. తీతువు కూత, అంతుబట్టని ఆధునిక వర్ణచిత్రంలా బతుకు తయారైన మాట వాస్తవమే. ఈ బతుకు ఇలా తయారవటానికి మూలమైన కారణాలేమిటి ? అంటే ఎవరి నుంచైనా వచ్చే సమాధానం ఒక్కటే! వ్యక్తి స్వార్థం అని. దాన్ని రూపుమాపే పద్ధతుల మీదనే కదా రచయితలకూ, రాజకీయ నాయకులకూ కూడా భిన్నాభిప్రాయాలున్నది. మనిషి మనిషిగాబతకాలి; భవిష్యత్తు మీద ఆశతో బతకాలి; చైతన్యవంతంగా బతకాలి. కవిగా రాధాకృష్ణగారి ఇట్లాంటి ఆశయాలన్నీ మంచివే. మరి మార్గం సంగతేమిటి ? మాతిలో మాటల్లా కాకుండా, కుండ బద్దలుకొట్టినట్లుగా పలికిన ప్రతిమాటా సంపూర్ణ విశ్వాసంతోనే రాధాకృష్ణగారు పలికారు. పేరుకున్న నైరాశ్యాన్ని అంత మొందించి, మేధ ఉన్న ప్రతి మనిషీ ఆలోచిస్తాడు. ఏ దిశగా ఆలోచించాలన్న అంశాన్ని మేధగలవారు సామాన్యులకు చెప్పాలిగదా! ఆశలో ఎదుగుతూ ఆకాంక్షలో పెరగవలసిన మనిషి ఆకాంక్షయొక్క స్వభావం, ఆశయొక్క స్వరూపం తెలియాల్సిన అవసరం ఉంది. వాటిని తెలియజెప్పవలసిన బాధ్యత మేధావంతులపైన ఉన్నది. పరిణామక్రమాన్ని పిచ్చి చేష్టలు గ్రహించలేని మాట నిజమే. కీర్తి ప్రతిష్టలు



పిరికితనాన్ని ధరించని మాటా నిజమే అసంతృప్తిలోంచే, అన్వేషణలోంచే మార్పు, ప్రగతి వస్తాయనటంలో ఎలాంటి ది ప్రతిపత్తి లేదు. జీవితం ప్రిజమ్‌లాంటిదే. చూడవలసిన పద్ధతిలోంచి చూస్తేనే అన్ని రంగులూ కనబడతాయి. సాహిత్యాన్ని, సమాజాన్ని దర్శించే తీరు వ్యక్తి వ్యక్తికీ భిన్నమైంది. జీవితం తాలూకూ విషాదం అందరకూ ఒకేరకంగా కనబడుతుంది దాని నిర్మూలనకు చేసే ప్రయత్నానికి సంబంధించిన దృక్పథాల్లోనే భేదం ఉంటుంది. ఈ దృక్పథ భేదమే సాహిత్యం ఉండవలసిన తీరును గురించి, దాని ప్రయోజనాన్ని గురించి భిన్నాభిప్రాయాలను కలిగిస్తుంది.

దారి ప్రక్కన ఒళ్లు విరుచుకుంటున్న సైన్యాన్ని, దారి పక్కనే మన్ను గురుస్తున్న దైన్యాన్ని, దగాపడి కళ్లు తుడుచుకుంటున్న మంచితనాన్ని, దెబ్బతిన్న అభిమానాన్నిచూస్తూ, వర్తమాన నాగరికత పుట్టిస్తున్న అపశృతుల సంగీతాన్ని వింటూ, నరాలు పొందే ఉద్రేకాన్ని చైతన్యమని భ్రమిస్తూ, నిజమైన సంగీతానికీ, మూలుగుకీ తేడా తెలుసుకోలేని అసహాయస్థితిలో త్రిశంకుస్వర్గంలో జీవిస్తున్న మనిషికి — మనుషులందరూ సుఖంగా బతికే వ్యవస్థకోసం, మనిషిని మనిషి పీక్కుతినటం లేని వ్యవస్థకోసం, శ్రమువల్ల దుఃఖంకాక సుఖాన్ని పొందే వ్యవస్థకోసం, ఆగడాలు, అరాచకాలు లేని ఆనందమయ వ్యవస్థకోసం ఏంచెయ్యాలో, ఏ వైపు గా ప్రయాణించాలో రాజకీయ నాయకులను వదిలేస్తే రచయితలూ, కళాకారులైనా చెప్పాలి గదా !

ఒక భయానకమైన వ్యవస్థ సుందరమైన వ్యవస్థగా మార్పు చెందటానికి జరిగే ప్రయత్నంలో కొంత అలజడి, ఆందోళనా ఉండక తప్పదు. ఈనాడు వీటిని అసహ్యంగానూ, అసహనంగానూ భావిస్తే రేపు ఏర్పడవలసిన వ్యవస్థ ఏర్పడదు.

రాధాకృష్ణగారి వచన కవిత్వం సూటిగాను స్పష్టంగా ఉంటుంది. పాఠకుని హృదయాన్ని, దగ్గరగా వెడుతుంది. కవిత చెప్పడంలో నేర్పు ఉంది. ఇతరుల భావాలను అంగీకరించలేనప్పుడు కూడా సహనంతో వ్యవహరించే లక్షణం ఆయన కవిత్వంలో ఉంది. క్రియాశూన్యమైన ఆశావాదం వల్ల ఏమి ప్రయోజనం ?

ఎవరిని కదిపినా
ఏదో పోగొట్టుకున్నట్లే మాట్లాడుతారు
ఎవరినైనా అడుగు మరి
ఎగుడు దిగుడు సమాధానమే వస్తుంది
ఏదో లోపించిన భావమే స్ఫురిస్తుంది
ఎక్కడికో తెలీని ప్రయాణీకుని
మనఃస్థితి గోచరిస్తుంది. ★

చెమటకాయల బాధనుండి ఉపశమనానికి టాల్కం పౌడర్ కాదు నైసిల్ కావాలి!



నైసిల్ వాడండి

చెమటకాయల బాధనుండి శీఘ్ర ఉపశమనం పొందండి.



నైసిల్ చెమటకాయల బాధనుండి ప్రతిదశలోనూ ఉపశమనాన్నిచ్చేందుకై ప్రత్యేకించి రూపొందించబడిన ఔషధయుక్త పౌడర్. ఇది దురదను, మంటను, చిరచిరను వెంటనే ఉపశమింపజేస్తుంది. టాల్కం పౌడర్లవలెకాక ఇది క్రిమిచర్యను అరికట్టి బాధ క్రుతిమించకుండ చేస్తుంది.

నైసిల్ – చెమటకాయల బాధనుండి ఉపశమనానికి నమ్మకమైన, విరపాయకరమైన మార్గం.

1. అతిగా వచ్చే చెమటను ఆపుతుంది. 2. చెమటను పీలుస్తుంది.
3. దుర్గంధకారక క్రిములను ధ్వంసం చేస్తుంది. 4, శరీరానికి హాయినిస్తుంది.



2 ప్యాక్‌లలో లభిస్తుంది–'బ్లూ' మరియు 'శాండల్ వుడ్'

మంచి ఆరోగ్యానికి మూలస్థానం

గ్లాక్సో

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



(గత సంచిక తరువాయి)

డాక్టరు సెవార్డు డైరీ (తరువాయి భాగం) :

"గలాట్జ్‌కు వెళ్లే రైలు ఏవుందిప్పుడు?" అడిగాడు వాన్‌హెల్సింగ్.

"రేపు ఉదయం 6–30 కి వుంది." మినా చెప్పింది. మేమంతా విస్తుపోయాం ఆమె జవాబుకి.

"మీకెట్లా తెలుసు రైలు వేళల గురించి" అడిగాడు ఆర్థర్.

"మీరు ఓ సంగతి మర్చిపోయారు. నాకు రైళ్ళ రాకపోకల గురించి బాగా తెలుసునని జోనాథన్‌కి, డాక్టర్ వాన్‌హెల్సింగ్‌కి బాగా తెలుసు. ఎగ్జిటర్లో ఇంట్లో వుండగా రైలు వేళలు తయారు చేయటమే నా పని. అవి జోనాథన్‌కి చాలా ఉపయోగం. ఇప్పటికీ ఆ అలవాటు అంతగా మానలేదు. డ్రాకులా కోటకు వెళ్లాలంటే, గలాట్జ్ మీదుగా వెళ్లాలని నాకు తెలుసు. లేకపోతే బుకారెస్టు మీదుగా వెళ్ళాలి. అందుకే రైలు వేళలు గుర్తుంచుకున్నాను," అంది.

"అబ్బ! గొప్ప మనిషి!" గొణుక్కున్నాడు ప్రొఫెసర్.

"రైలు ప్రత్యేకం వేసుకోటానికి వీల్లేదా?" ఆర్థర్ అడిగాడు. వాన్‌హెల్సింగ్ అడ్డంగా తల వూపాడు "వీలుపడదేమో. ఇది మీదేశం, మాదేశం కాదు. ప్రత్యేకంగా రైలు వేయించగలిగినా, మామూలు రైలు లాగే ప్రయాణిస్తుంది. అదీ కాకుండా మనం చెయ్యాల్సిన పనులు వేరే వున్నాయి. ఆలోచించి పనులు చెయ్యాలి. ఆర్థర్, మీరు వెళ్ళి రేపు ఉదయం రైలుకు అందరికీ టిక్కట్లు కొనండి. జోనాథన్, మీరు ఓడ ఏజంటు దగ్గరికెళ్ళి గలాట్జ్‌లో వున్న ఏజంటుకు ఉత్తరం రాయించుకు రండి — అంటే ఓడలోకి వెళ్ళి వెతకటానికి వీలుగా. మోరిస్, మీరు రాయబార కార్యాలయానికెళ్లి గలాట్జ్‌లో వున్న వాళ్ల మనిషి దగ్గర్నుంచి మనకీ తగు సహాయం అందేట్టుగా ఏర్పాటు చెయ్యమని చెప్పు. అన్నీ త్వరగా జరగాలి. జాన్ నాతో, మేడమ్ మినాతో ఇక్కడే వుంటాడు. ఇప్పటికే ఆలస్యమయింది. మీరు త్వరగా బయలుదేరితే, పనులు తొందరగా పూర్తి అవుతాయి. సూర్యాస్తమయ సమయంలో మినా దగ్గర్నుంచి వివరాలు రాబడతాను" అన్నాడు.

"నేను కూడా మీకు అన్ని విధాల సహాయపడటానికి ప్రయత్నిస్తాను. ఆలోచిస్తాను. ఇది వరకు లాగే రాస్తాను. ఏదో బంధం నుండి నేను విముక్తురాల్ని అవుతున్నట్టుగా అనుభూతి చెందుతున్నాను," అంది మినా.

ఆమె మాటలు విని వాన్‌హెల్సింగ్ తప్ప మిగతా ముగ్గురూ చాలా సంతోషించారు. నేనూ వాన్‌హెల్సింగ్ ఒకరి మొహాలు ఒకరు ఆందోళనగా చూసుకున్నాం. అయినా ఆ సమయంలో మేం ఏమీ మాట్లాడలేదు.

వాళ్లు ముగ్గురు బయలుదేరి వెళ్లినతర్వాత వాన్‌హెల్సింగ్ మినాను అడిగాడు — డ్రాకులా కోటలో వుండగా జోనాథన్ రాసిన డైరీ తాలుకు కాగితాలు తీసి ఇవ్వమని. అవి తీసుకు రావటానికి ఆమె గదిలోంచి వెళ్లింది. తలుపులు వేసేసాం.

"నీ ఉద్దేశం ఏవిటి చెప్పు!" అడిగాడు.

"ఏదో మార్పు బాగా కనిపిస్తోంది. ఆమె మాటలు విని మనం మోసపోతామేమో అనిపిస్తోంది" అన్నాను.

"అదే నిజం, జోనాథన్ రాసిన కాగితాలు ఎందుకు తీసుకురమ్మని అడిగానో తెలుసా?"

"తెలీదు. బహుశా మనం ఏకాంతంగా మాట్లాడుకోడానికా?" అడిగాను.

"అదికొంతవరకుమాత్రమే. నీకుఓవిషయం

జరిగిన కథ — 35 : డాక్టర్ సెవార్డ్, డాక్టర్ వాన్‌హెల్సింగ్, ఆర్థర్, క్విన్సీమోరిస్ మినా గదిలో జోనాథన్ క్రిందపడి ఉండటం చూస్తారు. మినా చేత తన రక్తాన్ని త్రాగిస్తున్న డ్రాకులాను చూసి వీరందరు భయభ్రాంతులవుతారు. వాన్‌హెల్సింగ్ మినాను అసలు ఏం జరిగిందో అడుగుతాడు. ఆమె తనకు జరిగిన భయంకరమైన అనుభవాన్ని చెపుతుంది. రెన్‌ఫీల్డ్ నేలమీద కుప్పలాపడి ఉంటాడు. అతడు మంచంమీద నుంచి క్రిందపడి చనిపోయినట్లు సర్టిఫికేట్ ఇవ్వటానికి నిశ్చయించుకుంటాడు డాక్టరు సెవార్డు. అందరు కలసి పిక ఢిల్లీలోని డ్రాకులా ఇంటిని వెదకాలని నిర్ణయించుకుంటారు. అందరూ కలసి డ్రాకులా ఇంటిలో ప్రవేశిస్తారు. వాన్‌హెల్సింగ్ జోనాథన్‌కు డ్రాకులా శక్తి, అతను చేసే ప్రమాదాల గురించి చెప్పసాగాడు. డ్రాకులా వీరి కోసం వెతుకుతున్నట్లు మినా టెలిగ్రాం పంపిస్తుంది. డ్రాకులా ఇంటిలోకి డ్రాకులా ప్రవేశించి వీరందరి బారినుండి నేర్పుగా తప్పించుకుంటాడు. మేడమ్ మినా తనను హిప్నటైజ్ చేయమని ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్‌ను కోరుతుంది. డ్రాకులా మిగిలిన పెట్టె, బంగారం, డబ్బులో ఓడలో పారిపోతున్నట్లు ఆమె ద్వారా కనుక్కుంటాడు వాన్‌హెల్సింగ్. డ్రాకులా ఊర్కొంచి పారిపోయాడని తెలిసి ఎంతో ఊరట చెందుతుంది మినా. డ్రాకులా 'వర్నా' చేరేదానికి ముందే జోనాథన్, మినాతో సహా అందరు 'వర్నా'కు ప్రయాణమయిపోవడానికి నిశ్చయించుకుంటారు. జరీనా కెథరిన్ ఓడ సముద్రంలో ప్రయాణం చేస్తున్నట్లు మినాను హిప్నటైజ్ చేసి తెలుసుకుంటారు. ఓడ తీరం చేరగానే అందరు దానిలో ప్రవేశించి చెక్కపెట్టెలోని డ్రాకులాకు మెలకువ వచ్చేలోగా అతన్ని హతమార్చలని నిశ్చయించుకుంటారు. జరీనా కేథరిన్ ఓడ 'గలాట్జ్' తీరం చేరుకున్నట్లు తెలుసుకొని అందరు నిశ్చేష్టులయ్యారు.


చెప్పాలోయ్ జాన్ ! చాలా భయంకరమైన పని ఒకటి నేను చెయ్యబోతున్నానోయ్.అది చెయ్యాలని నమ్ముతున్నాను. ఆమె అట్లా మాట్లాడగానే, ఇద్దరిలో ఒకటే భావం ఏర్పడింది కదూ ? మూడు రోజుల క్రితం డ్రాకులా తన ఆత్మను ఈమె దగ్గరకు పంపి, మనం ఇక్కడ వున్న సంగతి పసిగట్టి వుంటాడు. ఆమె బయటకు విషయాలు చెప్పేస్తుందని, ఆమె ఆత్మకు దూరమయ్యాడు. ఆ విధంగా మనల్ని తప్పించుకున్నాడు. ఇప్పటి పరిస్థితిలో ఈమె అవసరం డ్రాకులాకు లేదు.''

''ఇదిగో మేడమ్ మినా వస్తోంది. ఆమె గురించి మాట్లాడుకోవద్దు. ఆమెకు ఏమీ తెలియనీయకూడదు'' అన్నాడు వాన్‌హెల్సింగ్. అతను చాలా ఆందోళనగా వున్నాడు. లూసీ చనిపోయిన తర్వాత శ్మశానం నుండి వస్తుంటే ఎంత పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడో అట్లా చేస్తాడనిపించింది. కానీ మినా లోపలికి రాగానే, వెంటనే మామూలుగా కనపడటానికి ప్రయత్నించాడు. ఆమె వస్తూనే, టైపు చేసిన కాగితాలను అతని చేతిలో వుంచింది. వాటి వంక గంభీరంగా చూస్తూ చదవసాగాడు. అతని మొహంలో వెలుగు వచ్చింది.

''ఇతని చరిత్రచూస్తే, అప్పటి మానసిక పరిస్థితి పరిశీలిస్తే, అతను ఏదో ప్రాంతాన్ని జయించాలనుకుని వెళ్ళటం, అక్కడ ఓడిపోగానే, మళ్ళీ తిరిగి తన దేశానికివెళ్ళి, తర్వాత మరింతగా సిద్ధపడి అదే ప్రాంతాన్ని మళ్ళీ దండెత్తడం, ఓడగానే మళ్ళీ తిరిగిపోవటం, రావటం— యిదీ అతని మానసికస్థితి. ఇప్పుడు లండన్ వచ్చాడు.

వెళ్ళేరైల్లో కూర్చుని రాస్తున్నాను. గత సాయంత్రం అందరం కూర్చుని చర్చించాం అనుకున్నట్టుగా ఎవరిపని వారు చేసారు. గలాట్‌జ్ వెళ్లగానే ఏం చెయ్యాలో పథకం తయారుచేసాం. సూర్యాస్తమయ సమయంలో వాన్‌హెల్సింగ్ మినాను హిప్నటైజ్ చేసాడు. ఈసారి అతను ఎక్కువ ప్రయాస పడవలసి వచ్చింది. మామూలుగా ఆమె మాట్లాడేది ఈసారి వాన్ హెల్సింగ్ ఎక్కువ ప్రశ్నలు వెయ్యాల్సి వచ్చింది. మొత్తానికి ఆమె ఇట్లా చెప్పింది.

''నాకేమీ కనపడ్డంలేదు. అలలు ఓడను తాకుతున్న చప్పుడులేదు. కొంతమంది మనుషుల మాటలు వినపడుతున్నాయి. ఓడలో అవి ఇవీ



మన చేతిలో దెబ్బతిని తన దేశానికి ప్రయాణం కట్టాడు.'' అన్నారు.

''అవును నిజం'' అంది మీనా.

''ఏవోయ్ జాన్, అతను మనకు భయపడి తన వునికి మనకు తెలియకుండా వుండేందుకు ఇక్కడ సంబంధాలు తెంపుకున్నాడు. మనం ఇక ఎక్కడవున్నా అతనికి అక్కర్లేదన్నమాట. తన వునికి మాత్రం మనకి తెలియకూడదు. అదీ డ్రాకులా ఆలోచన.

మనం అతన్ని వెంబడించాలి. ఆగిపోకూడదు.'' అన్నాడు వాన్‌హెల్సింగ్.

అక్టోబర్, 29 : వర్నానుంచి గలాట్‌జ్ దొర్లిస్తున్న చప్పుడు వినిపిస్తోంది. ఎక్కడో తుపాకీపేలిన చప్పుడు వినపడింది. తాళ్ళు గొలుసులూ లాగుతున్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. ఆదిగో, ఏదో వెలుతురు కనపడుతోంది. గాలి నా మీదుగా వస్తోంది.''

అట్లాచెప్పి ఆగిపోయింది సోఫాలోంచి ఎవరో లేపినట్టుగా లేచి నిలబడింది. చేతులు ముందుకు చాపింది, ఏదో బరువు ఎత్తిపట్టుకున్నట్టుగా. వాన్‌హెల్సింగ్, నేనూ ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం. క్విన్సీమోరిస్ కళ్ళు పెద్దవిచేసి తీక్షణంగా ఆమెవంకచూశాడు.

జోనాథన్ చెయ్యి తన కత్తిమీదకు వెళ్లింది. చాలాసేపు మౌనంగా గడిచింది. తర్వాత ఆమె మాట్లాడలేదు. గభాల్ని ఆమె కూర్చుని కళ్ళు తెరిచింది.

"మీకెవరికీ టీ వద్దా ? బాగా అలిసిపోయినట్టున్నారు" అంది ఎంతో తీయగా. అందరం తల వూపాం. టీ తీసుకురావటానికి గదిలోంచి వెళ్లింది. అప్పుడు వాన్‌హెల్సింగ్ అన్నాడు —

"చూసారా ? డ్రాకులా తీరం చేరాడు. ఇంకా అతను ఒడ్డుకు రాలేదు. ఈ రాత్రికి ఎక్కడో దాక్కొని పడుకుంటాడు. కానీ అతన్ని ఎవరైనా ఒడ్డుకు తీసుకురాకపోయినా, ఓడ తీరం చేరకపోయినా అతను భూభాగంమీదకు రాలేడు. అట్లాంటి పరిస్థితిలో, రాత్రిపూట గాబట్టి, ఏదో రూపంలోకి మారిపోయి ఒడ్డుకు దూకేస్తాడు, ఇంతకి ముందు విట్‌బీలో చేసినట్టుగా. ఆ పని పగటి వెలుగు వచ్చేలోపు చెయ్యాలి. లేకపోతే, అతను వున్న చెక్కపెట్టెలో వుండీ, దాన్ని ఎవరైనా మోసుకొచ్చి ఒడ్డున పడేయాలి. లేకపోతే అతను తప్పించుకోటం అసాధ్యం. పెట్టె ఒడ్డుకు చేరిస్తే, కస్టమ్స్ అధికారులు దాన్ని తెరిచి చూస్తారు. కాబట్టే ఈ రాత్రికిగానీ, సూర్యోదయం లోపుగానీ అతను పారిపోయే పథకం వేస్తాడు. అట్లా చెయ్యలేకపోతే, ఒకరోజు వృధా అయినట్టే. అప్పుడు మనం వేళకి చేరుకుంటాం. పగలే గాబట్టి చెక్కపెట్టెలో వుంటాడు, దాన్ని మనం స్వాధీనం చేసుకోవచ్చు."

ఇక మాటలు ఆపేసాం. ఉదయం వరకు వేచివున్నాం — ఆ సమయంలో మినా దగ్గర్నుంచి మరికొంత వినవచ్చు అనుకుంటూ.

ఇవాళ ఉదయం హిప్నటైజ్ చేయబడిన మినా మాటలు ఎంతో ఆత్రుతగా విన్నాం. ఆ పరిస్థితిలోకి రావటానికి చాలాసేపు పట్టింది. ఓ పక్క సూర్యోదయం కాబోతోంది. మాకు ఎంతో నిరాశ కలిగింది. వాన్‌హెల్సింగ్ తన శక్తిని పూర్తిగా వినియోగించి ఆమెను హిప్నటైజ్ చెయ్యగలిగాడు. ఆ సమయంలో ఆమె ఇట్లా చెప్పింది —

"అంతా చీకటిగా వుంది. నీళ్ల చప్పుడు వినపడుతోంది. ఏదో కర్రను లాగుతున్న చప్పుడు వినబడుతోంది." ఆమె ఆగింది. ఇంతలో సూర్యోదయమైంది. ఇక రాత్రివరకు వేచి వుండాల్సిందే.

అందువల్లనే మేం గలాట్జ్ వెళుతున్నాం, చిగురంత ఆశతో. మామూలుగా తెల్లవారు జామున రెండు మూడు గంటల మధ్య రైలు చేరాలి. కానీ బుకారెస్టులోనే మూడు గంటలు ఆలస్యమయింది. కాబట్టే బాగా ప్రొద్దు ఎక్కేదాక మేం అవూరు చేరలేం.

తర్వాత : సూర్యాస్తమయమయింది. మినాను హిప్నటైజ్ చెయ్యటం జరిగింది. ఈ పూట కాస్త సులభమయింది. అప్పుడు రైలు కూడా ఒక స్టేషన్‌లో ఆగింది. డ్రాకులా వునికి కనిపెట్టే ఆమెకున్న సున్నితమైన శక్తి పోతుందేమోననిపించింది. ఆమె ఇట్లా అంది —

"ఏదో జరుగుతోంది. ఏదో చల్లటి గాలి తగులుతున్నట్టుగా వుంది. ఏవో కొన్ని శబ్దాలు వినబడుతున్నాయి. ఏదో భాషలో మాట్లాడుతున్న మనుషుల మాటలు వినపడుతున్నాయి. నీళ్ళు పెద్ద ధారగా పడుతున్న చప్పుడు, తోడేళ్ళ అరుపులు వినపడుతున్నాయి" ఆమె మాటలు ఆపేసింది. ఆమె వణికినట్టు కనిపించింది. ఆ వణుకు ఎక్కువయింది. అట్లా కొన్ని క్షణాలు వుంది. తర్వాత మాట్లాడలేదు. ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. హిప్నటైజ్ నుంచి తేరుకున్న తర్వాత బాగా అలసిపోయినట్టుగా కనిపించింది. మనిషి బాగా చల్లబడిపోయింది. అయినా ఆమె బుర్ర మాత్రం చురుకుగానే వుంది. ఏం చెప్పిందో ఆమెకు జ్ఞాపకం లేదు. తను ఏం చెప్పిందో తెలుప మన్నది అది చెప్పిన తర్వాత చాలాసేపు ఆలోచనలో మునిగిపోయింది.

అక్టోబర్, 30, (ఉదయం 7–00) : గలాట్జ్‌కు దగ్గరపడ్డాం. ఇక తర్వాత రాయటానికి సమయం వుండదు. అందరం సూర్యోదయం కోసం ఆత్రుతగా ఎదురుచూసాం. మినాను హిప్నటైజ్ చెయ్యటానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నందువల్ల, ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ తన పని తొందరగా మొదలుపెట్టాడు. ఆ సూర్యోదయానికి ఒక్క నిముషం ముందర ఆమెను హిప్నటైజ్ చెయ్యగలిగాడు. వెంటనే ప్రశ్నించాడు. జవాబుకూడా వెంటనే వచ్చింది.

"అంతా చీకటి. సుళ్ళు తిరుగుతున్న నీళ్ల చప్పుడు వినపడుతోంది. ఏదో దుంగలు లాగుతున్న చప్పుడు. పశువుల అరుపుల చప్పుడు దూరంనుంచి వినపడుతోంది. ఇంకో శబ్దం కూడా వినవస్తోంది. అది ఎట్లా వుందంటే" ఆమె ఆగింది. ఆమె మొహం బాగా పాలిపోయింది.

"చెప్పు. నేను ఆజ్ఞాపిస్తున్నాను, చెప్పాలి!" వాన్‌హెల్సింగ్ బాధతో కూడిన స్వరంతో పలికాడు. అతనిలో నిరాశ కనపడింది. సూర్యుడు పైకి వచ్చేసాడు. ఆమె కళ్ళు తెరిచింది. అందరం ఆశ్చర్యపోతుండగా అంది —

"ఓ ప్రొఫెసర్, నేను చెయ్యలేననుకున్న పని నా చేత ఎందుకు చేయిస్తారు ? నాకేమీ జ్ఞాపకం రావటంలేదు"

మా ఆశ్చర్యాన్ని గమనించి ఒక్కొక్కళ్లనీ అడిగింది -

"ఏవిటీ ? నేను ఏం చెప్పాను ? నేనేం జేసాను ? నాకు ఏం జరిగిందో తెలియటం లేదు. మగతగా ఇక్కడ పడుకోవటం తప్ప. చెప్పు, నేను ఆజ్ఞాపిస్తున్నాను, చెప్పాలి' అన్న మీ మాటలు మాత్రం వినిపించాయి. మీ మాటలు నాకు చాలా తమాషాగా తోచాయి, ఎవరినో చిలిపి అమ్మాయిని గద్దించినట్టుగా."

రైలు కూత వినిపిస్తోంది. గలాట్జ్ చేరుకుంటున్నాం. ఏం జరుగుతుందో అన్న ఆత్రుత మాలో ఎక్కువ కాసాగింది.

మినా డైరీ :

అక్టోబర్, 30 : మిస్టర్ మోరిస్ నన్ను హోటల్‌కి తీసుకెళ్లాడు. మాకోసం అక్కడ ముందే గదులు ఏర్పాటు చేయబడ్డాయి, టెలిగ్రాముల ద్వారా. మోరిస్‌కు వేరే భాష రాకపోవటం చేత అతన్ని వదిలేసి వెళ్లారు. ఎవరి పనులతో వారు విడిపోయారు. ఆర్థర్ మాత్రం రాయబార కార్యాలయానికి వెళ్లాడు. అతను 'ప్రభువు' గాబట్టి ఆ బిరుదుతో పనులు తొందరగా చేయించగలడు. జోనాథన్, ఇద్దరు డాక్టర్లతో కలసి ఓడ ఏజంటు దగ్గరికెళ్లారు — జరీనాకేథరిన్ ఓడ రాక గురించి వివరాలు తెలుసుకునేందుకు.

తర్వాత :

ఆర్థర్ తిరిగి వచ్చాడు. రాయబార కార్యాలయంలో రాయబార్రి లేడు. అతని తర్వాత మనిషి జబ్బు పడ్డాడట. అందువల్ల పనులు ఒక గుమస్తా చేత చేయించాడు.

జోనాథన్ డైరీ

అక్టోబర్, 30 : తొమ్మిది గంటలకు డాక్టర్ వాన్‌హెల్సింగ్, డాక్టర్ సెవార్డు, నేనూ మెస్సర్స్ మెకంజీ అండ్ స్టీన్‌కోఫ్ ఏజంటును కలిసాం. లండన్ నుంచి వాళ్లకు ఒక తంతి వచ్చింది. అది ఆర్థర్ పంపిన విజ్ఞప్తికి జవాబు. ఓడ ఎక్కడానికి అనుమతి ఇవ్వవలసిందిగా దాని సారాంశం. ఏజంటు మమ్మల్ని ఎంతో సాదరంగా ఆహ్వానించాడు. జరీనాకేథరిన్ ఓడను ఎక్కించాడు. ఆ ఓడరేవులో ఆగివుంది. అక్కడ కెప్టెన్ డోనెల్సన్ చూసాం. అతని ప్రమాణ విశేషాలు అడిగాం అంత సుఖంగా ఓడ ప్రయాణం ఎప్పుడూ జరగలేదని చెప్పాడు.

"లండన్ నుంచి నల్ల సముద్రం మీదుగా ప్రయాణం అంటే ఎంతో ప్రయాసతో కూడినది. అటువంటిది, ప్రయాణం ఎటువంటి ఆటకం లేకుండా జరిగింది. ఏదో దయ్యం వచ్చి మాకు సహాయం చేసినట్టుగా, ఓడ ప్రయాణం చకచకా జరిగిపోయింది" అన్నాడు.

డాక్టర్ వాన్‌హెల్సింగ్ మెచ్చుకోలుగా మాట్లాడాడు.

కెప్టెన్ మళ్ళీ ఇలా అన్నాడు —

"బోస్ఫరస్ దాటిన తర్వాత కొంతమంది రుమేనియన్‌లు నా దగ్గరకు వచ్చి, ఒక చెక్కపెట్టె వుంది, దాన్ని పైకెత్తాలని చెప్పారు.

నేను ఆ పెట్టెను చూసాను. అబ్బ! వాళ్లెంత మూఢనమ్మకస్తులో. మధ్యలో ఓడ ప్రయాణం సరిగ్గా సాగలేదు. మంచు పొగలో ఎటు వెళుతున్నామో తెలీలేదు. ఓడ గలాట్జ్ వైపు కాకుండా, ఎదురుగా వెళ్లటం సాగించింది. ఇదంతా ఆ పాడు చెక్కపెట్టెవల్లనే, దాన్ని ఎత్తి సముద్రంలో పారెయ్యాలి అన్నారు వాళ్ళు. అందుకు నేనొప్పుకోలేదు. ఓడలో ఎక్కించిన వస్తువు గమ్యం చేరేవరకు దాన్ని జాగ్రత్తగా చూడవలసిన బాధ్యత నాకుంది అని వాళ్లకు నచ్చజెప్పాను. అయినా వాళ్ళు దాన్ని ఎత్తిపారేయటానికి సిద్ధపడ్డారు. ఆ చెక్కపెట్టెమీద 'గలాట్జ్' చేరాలని వుంది, కానీ ఓడ ఆ తీరం వెళ్ళటంలేదు గాబట్టి, సముద్రంలో పారేస్తే నయం అన్నారు. నేను మొత్తానికి ఆ పనినుండి విరమింపజేసి, తీరం చేరినతర్వాత దాన్ని వదిలించాలనుకున్నాను. ఉదయం సూర్యోదయానికి గంట ముందరే ఒకతను వచ్చి, ఒక కాగితం చూపించి, ఆ పెట్టె 'డ్రాకులా' అనే ప్రభువుకి సంబంధించినదనీ, తను దాన్ని తీసుకోడానికి వచ్చాననీ చెప్పాడు. ఆ పెట్టె అతనికి ఇచ్చేసాం" అన్నాడు.

"అయ్యో! ఆ మనిషి పేరేమిటి?" డాక్టర్ వాన్ హెల్సింగ్ ఎంతో ఆతృతగా అడిగాడు.

"ఇప్పుడే చూసి చెపుతాను" అంటూ కేబిన్‌లోకి వెళ్ళి ఒక రసీదు పట్టుకొచ్చాడు. దానిమీద 'ఇమాన్యుయల్ హిల్డిషిమ్' అని సంతకం వుంది. బర్గెన్ స్ట్రెస్సీ—16 చిరునామా. కెప్టెన్‌కు అంతకంటే ఏమీ తెలియదని, అక్కడ్నించి బయలుదేరాం.

అక్కడ్నించి హిల్డిషిమ్ ఆఫీసు కనుక్కున్నాం. అది ఒక హాలుమాదిరి వుంది. అతనికి తెలిసింది చాలా కొద్ది అయినా, చాలా ముఖ్యమయినది. లండన్‌లో వున్న ఏజంటు ఇతగాడికి ఓ ఉత్తరం వ్రాసాడట — జరీనా కేథరిన్ ఓడలో ఒక చెక్కపెట్టె వస్తోంది, దానిని వీలయితే కస్టమ్స్ ఇబ్బంది లేకుండా తెల్లవారకముందే డెలివరీ తీసుకుని వుంచమన్నాడట. ఆ పెట్టెను అతను 'స్కిన్‌స్కి' అనేవాడికి అందజేయాలట. ఈ 'స్కిన్‌స్కి' అనేవాడికి స్లొవాక్స్ తెగతో సంబంధాలున్నాయి. ఈ పని అంతా చెయ్యటానికి చెక్కు ద్వారా డబ్బు ముట్టింది ఈ హిల్డిషిమ్‌కి. ఇతను 'స్కిన్‌స్కి'ని రేవుకు తీసుకెళ్ళి ఆ చెక్కపెట్టెను అప్పగించటం కూడా జరిగిపోయిందట.

స్కిన్‌స్కీ కోసం వెతికాం కానీ ప్రయోజనం లేకపోయింది. అతను వుండే ఇరుగుపొరుగు వాళ్లను వాకబు చేశాం. అతను రెండురోజులుగా ఇంటికి రావటంలేదని చెప్పారు. ఇది రాత్రి పది గంటల ప్రాంతంలో జరిగింది. ఇక ఏంచెయ్యాలో తోచక అక్కడి వాళ్లతో మాట్లాడుతూ నిలబడ్డాం.

అదే సమయంలో ఒకడు రొప్పుతూ పరుగెత్తుకొచ్చాడు. సెయింట్ పీటర్ చర్చి గోడల లోపల స్కిన్‌స్కీ మృతదేహం కనపడిందని చెప్పాడు. ఆ దేహం గుండె ఏదో జంతువు పనిలాగ చీల్చేసి వుందట. ఇది విని మాతో మాట్లాడుతున్నవాళ్ళు ఆ దారుణం చూడటానికి పరుగెత్తారు. 'ఇది ఎవరో స్లొవాక్ చేసిన పని' అని అరిచాడు వార్త మోసుకొచ్చిన మనిషి. మేం మాత్రం ఆ మృతదేహాన్ని చూడటానికి వెళ్లలేదు.

తిరిగి వచ్చేవరకు కూడా ఏంచెయ్యాలో ఒక నిర్ణయానికి రాలేకపోయాం. ఆ చెక్కపెట్టె తప్పించుకు పోయినట్టే అనుకున్నాం. అది నీటి మార్గాన్నే చేరవేయబడుతుంది. కానీ, ఎక్కడికి అనేది తెలీకుండా వుంది. భారమైన హృదయాలతో హోటల్‌కు చేరుకున్నాం.

ఇక మీనాను హిప్నటైజ్ చేసి మాట్లాడించాలి, అదెంత కష్టమయిన పని అయినా.

మినా డైరీ :

అక్టోబర్, 30 (సాయంత్రం) : వాళ్లంతా బాగా అలిసిపోయి, నిరాశా నిస్పృహలతో ఇంటికి చేరారు. ఓ అర్ధగంట విశ్రాంతి తీసుకోమని చెప్పాను. ఈలోపున నేను డైరీ రాయటం పూర్తిచేయాలి. ఈ 'ట్రావెలర్' టైప్‌రైటర్ కనిపెట్టిన వాడ్ని ఎంతో మెచ్చుకుంటున్నాను. దానిని నాకు ఇచ్చిన మోరిస్‌కు ఎంతో రుణపడి వున్నాను. ఈ డైరీ అంతా పెన్‌తో రాయాలంటే చెయ్యలేకపొయ్యేదాన్ని. ఈ టైప్‌రైటర్ వుండి ఎంతో ఉపయోగపడుతోంది.

జోనాథన్ని చూస్తే జాలి వేస్తోంది. పూర్వం అతనెంత బాధలకు గురి అయ్యాడో, ఇప్పుడూ అంతే బాధపడుతున్నాడు. సోఫాలో కదలకుండా పడుకుని వున్నాడు. చాలా నీరసంగా కనిపిస్తున్నాడు. మొహంలో బాధ కనపడుతోంది. ఎన్నో ఆలోచనల్తో నిండిపోయి వుంటాడు. వీళ్లకు సహాయం జరగాలంటే, నేనేంచెయ్యాలో నాకు తెలుసు.

డాక్టర్ వాన్ హెల్సింగ్‌ను కలిసాను. నేను చూడని కొన్ని పత్రాలను ఆయన నాకు చూపించారు. వాళ్ల విశ్రాంతి తీసుకుంటూ వుండగా, ఈ పత్రాలన్నీ చదివేసి, నేనొక నిర్ణయానికి రావాలి......

దేవుడి దయవల్ల విషయం కనిపెట్టాను. మ్యాపులు సంపాదించి వాటిని చూడాలి...

నేను అనుకున్నట్టే అవుతుందన్న నమ్మకం బాగా ఏర్పడింది. అందరి సమక్షంలో నా ఆలోచనలు, నా నిర్ణయం చదువుతాను. అది విని మంచి చెడులు వాళ్ళు నిర్ణయిస్తారు, ఇప్పుడు ప్రతి నిముషం విలువైనది.

మినా ఆలోచనలు (డైరీలో రాసినవి)

విషయం— డ్రాకులాకున్న సమస్య ఏమిటంటే, తన స్థావరానికి వెనక్కి తిరిగి వెళ్లటం

(అ) ఎవరో ఒకరి సహాయంతో అతను వెనక్కి తిరిగిరావాలి. ఒక విషయంమాత్రం తెలుసు— అతను మనిషి రూపంలోగానీ, తోడేలు రూపంలోగానీ, గబ్బిలాయి రూపంలోగానీ, ఏరో విధంగా గానీ వెళ్లగలరు. ఎవరైనా తనని గమనించినా, తన విషయంలో జోక్యం చేసుకున్నా కంగారు పడిపోతాడు. ఎందుకంటే సూర్యోదయం సూర్యాస్తమయ మధ్యకాలంలో అతను చెక్కపెట్టెలో చలనం లేకుండా పడివుంటాడుగాబట్టి ఆ సమయంలో ఎవరైనా ఏదైనా చెయ్యొచ్చు కదా.

(ఆ) అతన్ని ఎట్లా తీసుకెళ్ళతారు ? - ఒక్కొక్క దాని గురించి చర్చించి వదిలేస్తాను భూ మార్గం, రైలు మార్గం, జల మార్గం.

(1) భూమార్గం :— దీని వల్ల ఎన్నో చిక్కులున్నాయి. ముఖ్యంగా నగరంనుండి ఎవరూ గమనించకుండా బయటపడ్డం కష్టం.

(క) నగరంలో జనం వుంటారు. వాళ్లకి కుతూహలం ఎక్కువ. ఏమిటో సంగతి చూద్దాం అనుకుంటారు. చెక్కపెట్టెలో ఏముందో అన్న లేశమాత్రం సందేహం కలిగినా, అతనికి చావు మూడించన్నమాటే.

(ఖ) పైగా కస్టమ్స్ అధికారుల బెడద వుంటుంది. కొన్ని రోడ్లు ఆక్ట్రాయి ఆఫీసులు కూడా దాటి వెళ్లాలి.

(గ) డ్రాకులా గురించి తెలిసిన వాళ్ళు, వెంటపడటానికి అవకాశం వుంది. వాళ్లంటే అతనికి చాలా భయం ఈ విషయంలో. ఈ ఇబ్బందులన్నీ తట్టుకోవటానికి, ఎవరికీ తెలీయకుండా వెళతాడు.

(2) రైలుమార్గం : పెట్టెకు కాపాలా ఎవరూ వుండరు. రైలు మార్గం అయితే, ప్రయాణం ఆలస్యం అవటానికి అవకాశంవుంది. ఆలస్యమయితే, శత్రువులకు ఆచూకి తెలుస్తుంది. రాత్రిపూట అయితే తప్పించుకుని పారిపోవచ్చు. కానీ ఎక్కడో తెలియని ప్రదేశానికి వెళ్ళి చిక్కుపడితే ఎవరు సహాయం చేస్తారు? అందుకని అలా చేసివుండడు.

3. జలమార్గం : ఇది చాలా మంచి మార్గం, ఒక విధంగా. మరో విధంగా అయితే చాలా ప్రమాదంతో కూడుకున్నది. నీటిమీద ప్రయాణం చెస్తున్నప్పుడు, అతను అశక్తుడు— రాత్రిపూట తప్ప. ఆ రాత్రిళ్ళు కూడ మంచు పొగను, తుఫానును, మంచువర్షాన్ని, లేకపోతే

జీవన్ మృతులు

తోడేళ్ళను మాత్రం రప్పించగలడు. ఒకవేళ ఓడ మునిగిపోతే, అతనూ మునిగిపోతాడు. అతన్ని రక్షించేవారే వుండరు. కాబట్టి ఓడ ప్రయాణం సాఫీగా జరగాలి.

మనకి తెలిసినంతవరకు అతను జలమార్గాన ప్రయాణం చేస్తున్నాడు. కానీ అది ఎటువంటి జలమార్గం అన్నది తెలుసుకోవాలి. మొదట అతను ఇప్పటివరకు ఎట్లా ప్రయాణం చేసాడో తెలుసుకోగలిగితే, తర్వాత అతను ఎట్లా చేస్తాడో తెలుసుకోవచ్చు.

మొదట అతను గలాట్జ్ వెళదామనే అనుకున్నట్టు తెలుస్తోంది, కానీ మనల్ని తప్పుదోవ పట్టించటానికి చెక్కపెట్టె 'వర్నా' వెళ్ళాలని పత్రాలు రాయించాడు. గలాట్జ్‌లో మనుషులకు ముందే సూచనలు ఇచ్చాడంటే అర్థం అంతేకదా !

ఇప్పటివరకు అతని పథకం పారినట్టే. జరినా కేథరిన్ ఓడ అద్భుతంగా ప్రయాణం చేసింది, ఎటువంటి ఆటంకాలు లేకుండా. చివరి క్షణంలో అది 'వర్నా' వెళ్ళకుండా, మంచుపొగను సృష్టించి, దారి తప్పించి 'గలాట్జ్' వేపు ప్రయాణం జరిగేట్టు చేసాడు. ముందు చేసిన ఏర్పాట్ల ప్రకారం హిల్డిషీమ్ చెక్కపెట్టె డెలివరీ తీసుకున్నాడు. దాన్ని 'స్కిన్‌స్కి'కి ఇచ్చాడు. స్కిన్‌స్కి దాన్ని తీసుకున్నాడు. తర్వాత విషయం సరిగ్గా తెలీడంలేదు. మొత్తానికి ఆ చెక్కపెట్టె జలమార్గాన వెళుతూవుండాలి.

ఇకపోతే డ్రాకులా 'గలాట్జ్' చేరుకున్న తర్వాత ఏం చేసి వుంటాడో ఆలోచిద్దాం.

చెక్కపెట్టెను సూర్యోదయానికి ముందుగా స్కిన్‌స్కీ తీసుకున్నాడు. సూర్యోదయ సమయంలో డ్రాకులా తన నిజరూపంలో కనపడి వుంటాడు. అసలు 'స్కిన్‌స్కీ' ఇటువంటి పనికి ఎందుకు ఒప్పుకున్నాడో? జోనాథన్ తన డైరీలో రాసిన దాన్నిబట్టి 'స్కిన్‌స్కీ'కి స్లోవాక్స్ తెగతో సంబంధాలున్నాయి. కానీ వాళ్లతో అతనికి పడదు. అతన్ని వాళ్ళు చంపి వుంటారా? డ్రాకులా సూర్యోదయ సమయంలో తన నిజరూపంతో పెట్టెలోంచి బయటకు వచ్చి ఆ పెట్టెను 'స్లోవాక్స్'కు వప్పజెప్పే ఏర్పాటు పూర్తి చేయించి, ఇక అతనితో అవసరం తీరింది, పైగా విషయం బయటకు తెలియనివ్వకూడదు గనుక, వెంటనే అతని గుండె చీల్చి చంపేసి వుంటాడు.

తర్వాత స్లోవాక్స్ చిన్న పడవలో ఆ పెట్టెను తీసుకుని నది మార్గాన డ్రాకులా కోటవైపు తీసుకుని వెళ్ళి వుంటారు. మ్యాపును బట్టి డ్రాకులా కోటకు వెళ్లటానికి రెండు నదీ మార్గాలున్నాయి. మరి ఏ మార్గాన వెళ్లాడో ఇప్పుడు ?

(ఇంకా వుంది)

వారఫలం

15-7-1983 శుక్రవారం మొదలు **21-7-1983** గురువారం వరకు

♈ **మేషం**: వృత్తిలో పెంపు సాధించుటకు అనుకూల వారం. **నూతనంగా** ఉద్యోగరీత్యా చేసే ప్రయత్నాలు సత్ఫలదాయకాలు. **చిలిపి జగడాల ప్రసక్తి** ఉంటుంది, గమనించాలి. స్త్రీలకు వయసు మీరిన వారు **అనారోగ్యతకు** గురి కాగలరు. ఉద్యోగస్థులు లాభదాయకంగా అవకాశాలు పొందనున్నారు.

♉ **వృషభం**: **శక్తి** వంచన లేకుండా పాటుపడుతారు. అయినా **ప్రయోజనం** పైఇటురావలసిన ధనం చేతికందదు యివ్వవలసిన వారి నుండి **వత్తిడి** కలుగుతుంది. **ప్రయాణాల్లో ప్రమాదాలు** కూడా సంభవమే జాగ్రత్త. స్త్రీలకు: నూతన వస్తువులు సేకరించుకొంటారు బంధు సహాయం సమకూరుతుంది.

♊ **మిథునం**: వ్యాపారం యథావిధిగా జరగటం, గృహసంబంధమైన వ్యవహారం పరిష్కారం కావటం, **నూతనాంశాలు** తెలిసికోవటం, మిత్రుల **సహాయ** సంపత్తులు అందుకోవటం వార **విశేషం**. స్త్రీలకు: **యాత్రార్థం ప్రయాణించటం**, విద్యాభ్యాసంగం ఫలించటం **ముఖ్యాంశాలు**.

♋ **కర్కాటకం**: వ్యవహారం ఒకానొక**టి** చాల కాలంగా **పరిష్కారం** కానిది వారాంతంలో **ముగుస్తుంది**. ధన సంబంధంగా ప్రశాంతత చిక్కుతుంది. **రాబడి** వృద్ధి చెందటం గమనించగల్గుతారు. **స్త్రీలకు**: విలువగల **నగలు**, వస్తువులు సేకరించుకొనుటకు అవకాశ మున్నది.

♌ **సింహం**: ఆదాయంలో వృద్ధి, అనుకోకుండా **దగ్గఱ చుట్టాలు ఇంటికి** రావటం, అందుమూలాన అధికంగా ఖర్చు కావటం, నూతనాంశాలు తెలిసికొనుటకు **అవకాశం** గలవారం **స్త్రీలకు**: వస్తువాహనాలు సంపాదించుకొనుటకు, నూతన వ్యవహారాలలో జోక్యం ఏర్పడటం గమనిస్తారు.

♍ **కన్య**: ఆదాయం వృద్ధి నందగలదు. **పరిచితులతోనో**, పరాయి వారి**తోనో**, కడకు **మిత్రవర్గం**తోనో అనవసరంగా **ఘర్షణ రాగల** సూచన **ఉన్నది**. గ్రహించి మెలగాలి. **స్త్రీలకు**: కళారంగంలో ఖ్యాతి, అప్రయత్నంగా **ధనరాబడి** చెప్పదగిన అంశాలు.

♎ **తుల**: **నేల విడిచి సాము చేసిన నట్లుగా** ఒకానొక గృహ **సంబంధ** విషయంలో మెలగవలసి **రావటం** గమనించ గలరు. **శక్తికి** మించిన కార్యాలోచనలు ఉంటాయి. ఆదా**యాన్ని** మించిన ఖర్చులు **ఉంటాయి**. స్త్రీలకు: కళారంగంలో **ఖ్యాతి**, ధనాదాయం గలవారం.

♏ **వృశ్చికం**: వ్యవహార రంగంలో చిక్కులు రానున్నాయి. క్రయ విక్రయాలలో యిబ్బందులు తటస్థించ**నున్నాయి**. **రాబడి**లో కూడా ఆశాభంగం తటస్థిస్తుంది. **ఏమయినా నిశ్చలంగా**, **ఓర్పుతో** మెలగవలసిన వారం. **స్త్రీలకు** పెద్దల మూలాన, అధికారుల వలన **ఉపయోగకరము లైన పనులందు** విజయం సాధించుకో**గలరు**.

♐ **ధనుస్సు**: అన్ని రంగాలలో మీకు అభివృద్ధి చెప్పదగిన **వారం**. మీ కార్యక్రమం**లో** పరులు జోక్యం కలిగించు **కోవటం** వలన చికాకు ఏర్పడుతుంది, **అయినా ఓర్పు** వదల రాదు. **స్త్రీలకు**: ఉద్యోగమందు **నూతనావకాశాలు**, **నూతనాంశాలు** గ్రహించటం **చెప్ప**దగిన అంశాలు

♑ **మకరం**: **భూములో**, **ఇళ్లో** కొనుగోలు చేయగలరు అనుకొన్న **దాని కంటె** అధికంగా ఆదాయం వ్యాపార రంగాన **సాధించుకో** గలుగుతారు. **వివాదగ్రస్తమైన** ఒకానొక వ్యవహారం మీకు అనుకూలంగా పరిష్కరింప **బడ** గలదు స్త్రీలకు: ఆదాయంలో కించిత్తు అభివృద్ధి కనిపిస్తుంది

♒ **కుంభం**: వ్యాపార రంగాన చాల కాలంగా మీరు సాధింప రాని వ్యవహారం ఈవారం **అనుకూల** దాయకంగా **పరిష్కార మవుతుంది**. **వస్తువులు** కొనుగోలు **చేయ** గలుగుతారు చాల కాలంగా వ్యాపార సంబంధంగా నిలచిన అప్పులు **వసూలు** కావటానికి అవకాశ మున్నది. **స్త్రీలకు**: కళారంగంలో సదవకాశాలు లభిస్తాయి.


♓ **మీనం**: ఎంతో కాలంగా నిలచిన వ్యవహారాలు ఈ వారం ఒక **రేవునకు** రాగలవు. **పరిచితులలో మిత్రులలో** ఒకానొక వృత్తి వ్యవహారం **లో మీకు సాయపడ** నున్నారు. **చిలిపి జగడాలు తల ఎత్తుతాయి**, వాని జోలికి **పోబోకండి**. స్త్రీలకు: నూతనోద్యోగ ప్రయత్నాలు **ఫలించటం**, కొందరకు ఉద్యోగంలో ప్రమోషన్ లభించటం చెప్పదగిన అంశాలు గమనించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★


వ్యక్తిగతం



తాడేపల్లిగూడెం శాసన సభా నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, దేవాదాయ మంత్రి స్వర్గీయ శ్రీ ఈలి ఆంజనేయులు ధర్మపత్ని శ్రీమతి ఈలి వరలక్ష్మి కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి శ్రీ మైలవరపు రాజభాస్కరరావుని 30 వేల ఓట్ల పైగా మెజారిటీతో ఓడించి ఘనంగా గెలిచారు ..



పెద్దపల్లి లోక్ సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీ గొట్టె భూపతి 53 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి శ్రీ ఘంటా శ్రీహరిపై విజయాన్ని సాధించారు ఈ పోటీలో మిగిలిన ముగ్గురు ఇండిపెండెంట్లు డిపాజిట్ పోగొట్టుకున్నారు



జనతా పార్టీ అధ్యక్షుడు, ఒకప్పటి యంగ్ టర్క్ అయిన శ్రీ చంద్రశేఖర్ భారత యాత్ర పేరుతో జనవరి 6న కన్యాకుమారి నించి బొంబాయి మీదుగా న్యూఢిల్లీకి ప్రారంభించిన పాదయాత్ర ప్రధానోద్దేశ్యం ఈ దేశంలో సామాన్యులకి జరుగుతున్న అన్యాయాలని ప్రజలకి తెలియపరచడమేనని అన్నారు. అయితే కొందరు ఇది కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే అనీ, ఆయన తమ వ్యక్తిగతమైన ప్రతిష్టని పెంచుకోడానికి, వ్యక్తిపూజని ప్రోత్సహించడానికి దీనిని ప్రారంభించారని విమర్శించారు...

అవీ... ఇవీ... అన్నీ...

శ్రీరామ హృదయము

అనువాదకుడు : శ్రీ పురాణపండ రాధా కృష్ణమూర్తి. పేజీలు : 32. ప్రతులకు : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి, జ్ఞాన మహాయజ్ఞ నిర్వాహకుడు, జయశ్రీ టాకీస్ రోడ్, రాజమండ్రి–4 అన్న చిరునామాకు వ్రాసి ఉచితంగా ప్రతిని పొందవచ్చు.

అజ్ఞానం విజ్ఞానం

బాలల కొరకు. 20 పేజీలు. ప్రతులకు : నాస్తిక కేంద్రం, పటమట, విజయవాడ — 520006.

అవయవాల అజ్ఞాత సేవ

రచన : శ్రీ బి. జి. వి. నరసింహారావు. వెల : రు. 15/–. పేజీలు 228. ప్రతులకు: న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, ఏలూరు రోడ్డు, విజయవాడ–2.

అరుణార్ణవం

కవితా సంకలనం : 'భావన' మిత్రులు. వెల : రు. 3/–. 20 పేజీలు, ప్రతులకు : శ్రీ కె. వి. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి, 'భావన' (హేలాపురి సాహితీసుమం), ఏలూరు– 534 001.

పాట వెన్నెలమీద నడుస్తుంది

కవితలు : రచన అజ్ఞాత సూరీడు. వెల : రు. 3/–. 39 పేజీలు, ప్రతులకు : సృజన, హనుమకొండ– 506 001.

పరమార్థ వాణి

ఆధ్యాత్మిక మాసపత్రిక. నిర్వాహకులు : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి 43పేజీలు, వివరాలకు : నిర్వాహకుల పేర, జయశ్రీ టాకీస్ రోడ్, రాజమండ్రి– 4, అన్న చిరునామాకు వ్రాయాలి.

సద్దర్శనము

తెలుగు వ్యాఖ్యాత : డా॥ చాగంటి సూర్య నారాయణమూర్తి. వెల : రు. 10/–. ప్రతులకు : ఎం. నరసింహం, శ్రీ రమణ భక్తమండలి, 2 – 2 – 1130/8/1, న్యూ నల్లకుంట, హైదరాబాదు– 44.

తార

ఈ నవల రచన శ్రీమతి హజిరా. ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా వెలువడిన సీరియల్ నవల "తార". ప్రేమ మూర్తి, విశాలహృదయుడు,విప్లవమే అతని ఊపిరి, ప్రజలే అతనిప్రాణం, ఎందరో అభాగ్యుల, నిర్భాగ్యుల కోసం పోరాడి కన్నవాళ్లనూ, కట్టుకున్నవాళ్ళనూ ఎందర్నో అభాగ్యుల్నిచేస్తూ భయంకరమైన కాల్పులకు ఆహుతయిపోయిన అమరవీరుడు వెంకట్. అతని ఉద్యమానికి చేయూత నిచ్చి, అన్నిటా అతనికి చేదోడువాదోడుగా నిలిచిన స్త్రీమూర్తి, అతని భార్య తార జీవితమే ఈ నవల. వెల : రూ 18/–. పేజీలు : 335. ప్రతులకు : శ్రీ కవితా పబ్లికేషన్స్, విజయవాడ– 2.

ఎక్స్ రే

ఆధునిక కవితావేదిక. ఎడిటర్ : కొల్లూరి. సాలుచందా. రూ 6/ – పేజీలు : 14. ప్రతులకు ఎక్స్‌రే, కొల్లూరి హవుస్, అమలాపురం – 533202.

తెనాలి సద్గురు సంగీతసభ ఆధ్వర్యంలో ఇటీవల నాట్యప్రదర్శన ఇచ్చిన కుమారి పద్మశ్యామల



స్వాతంత్ర్యవీర సావర్కార్

(జీవిత చరిత్ర) రచన : శ్రీ. 'ఆర్. ఆర్.' వెల : రు. 5/–. 116 పేజీలు, ప్రతులకు. సాహిత్యనికేతన్, 3–4–852, బర్కత్‌పురా, హైదరాబాదు.

వెన్నెల వేడి

నవల. రచన : శ్రీ కొండముది శ్రీరామ చంద్రమూర్తి. యౌవన ప్రథమార్ధంలో, ఆదర్శాల కౌగిలిలో, కలల సయ్యాటలో కాలంగడిపే యువతీ యువకుల స్థితిగతుల చిత్రీకరణ ఈ "వెన్నెల వేడి" నవల. వెల : రూ 10–50 లు పేజీలు : 178. ప్రతులకు : శ్రీ కవితా పబ్లికేషన్స్, విజయవాడ– 2

ప్రేమ చక్రవర్తి

నవల. రచన : శ్రీమతి సరోజిని భీమరాజు అనాదినుండి కుహనా సంస్కారులకు, నిజమైన మానవతకు జరుగుతున్న ఈ అంతః సంఘర్షణకు అద్దంపట్టిన ఈ నవలవెల ఇరవై రూపాయలు. పేజీలు : 344. ప్రతులకు : శ్రీ కవితా పబ్లికేషన్స్, విజయవాడ–2.

స్త్రీలు – వ్యాధులు

రచన : డాక్టర్లు జి. మారు. వెల : ఐదు రూపాయలు. పేజీలు 80. ప్రతులకు : నాస్తిక కేంద్రం, పటమట, విజయవాడ–6.

చేత వెన్నముద్ద

వ్యాస సంకలనం : శ్రీ వాకాటి పాండు రంగరావ్. ఇది పాబ్లోనెరూదా, చార్లీ చాప్లిన్, లూంుూ పాశ్చర్, స్టీఫెన్ స్పెండర్, హెన్రీ మిల్లర్, అబ్రహాం లింకన్, మాక్స్‌ముల్లర్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, లుడ్విగ్‌వాన్, బీథోవెన్, ఆల్బర్ట్ ష్వాయిట్జర్, హెగువారా, మార్టిన్ లూథర్ కింగ్, ఇర్వింగ్ వాలస్ – ల జీవితానుభవాల సంపుటి. వెల : రూ 10/–, పేజీలు : 150. ప్రతులకు: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ–2.

ఊరు – వాడ

పంచాయతీ మాస పత్రిక. సంపాదకుడు : శ్రీ బరెంకల జయదేవులు, వెల : రూ 2/–, 48 పేజీలు. ప్రతులకు : ఊరు – వాడ, ఇం. నెం–11, 287/ఎ/1/2, బాపూనగర్, మున్సిపల్ మార్కెట్ వీధి, చిక్కడపల్లి, హైదరాబాదు–500 020.

దైవ సాక్షాత్కారము

1వ భాగం, 4వ భాగం. రచన : శ్రీ వి. టి. చంద్రశేఖర్, వెల : 1వ భాగం రూ 12/– (227 పేజీలు). 4వ భాగం రూ 8/– (76 పేజీలు), ప్రతులకు : శేఖర్ పబ్లికేషన్స్, సూర్యారావుపేట, విజయవాడ–2.

హైదరాబాద్ నోట్‌బుక్

శ్రీశ్రీకి శ్రద్ధాంజలి :


జూన్ 15 వ తేదీ రాత్రి ఏడుగంటలకు మద్రాసులో కన్ను మూసిన అభ్యుదయ మహాకవి శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుకు పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీ శ్రీ దీనులకోసం, పతితులకోసం బాధాసర్పదష్టులకోసం కలంపట్టిన వాడు. కొనఊపిరి వరకు నిర్నిద్ర కవితా విప్లవ శంఖారావంచేస్తూ నేను సైతం భువన భవనపు బావుటానై పైకి లేచాను — అంటూ తానే కాక తెలుగు కవితనూ పైకి, అంతర్జాతీయ స్థాయికి లేపిన కవితా సవస్వి శ్రీశ్రీ కదిలేదీ కదిలించేదీ మారేదీ మార్పించేదీ, పాడేదీ పాడించేదీ, పెనునిద్దుర వదిలించేదీ, మును ముందుకు సాగించేదీ పరిపూర్ణపు బతుకిచ్చేదీ—కవితకు సంపూర్ణ నిర్వచనం ఇచ్చిన వాడు శ్రీశ్రీ. నాటకానికి తగనిదంటూ ఏదీ లేదని భరతాచార్యుడు చెప్పిన దానిని శ్రీశ్రీ మరింత విస్తృతా కవితకు అగ్గిపుల్లా కుక్కపిల్లా కావాలోయ్ నవకవనానికి అని అన్నాడు. నేనొక్కణ్నే ధాత్రి నిండా నిండిపోయా, నాకు హూరుత శీకరాలే లోకమంతా జల్లులాడే ఆ ముహూర్తాలాగమిస్తాయి—అనే ఆత్మవిశ్వాసంతో పదండి ముందుకు, పదండి తోసుకు, పదండి పోదాం పైపైకి—అంటూ కవితను, మానవతను తనతోపాటే ముందుకు తీసుకు వెళ్లడానికి యత్నించినవాడు శ్రీశ్రీ. కాని; ఆయనే అన్నట్టు దేహి అంటేతప్ప మెతుకూ, పాహి అంటేతప్ప బతుకూలేని దొంగలంజకొడుకులసలే మెసలేధూర ప్రపంచంలో అతని వెంట నడిచే వారెందరు ? శ్రీశ్రీ 1910లో విజయనగరంలో జన్మించారు. మద్రాసులో పట్టభద్రులయ్యారు. భారత విమాన దళంలో కొంతకాలం పనిచేశారు. పిదప ఆంధ్రప్రభ, ఆనందవాణి మున్నగు పత్రికలలో పనిచేశారు. ఆయన మహాప్రస్థానం తెలుగు కవితకు అంతవరకు వున్న సాంప్రదాయికతను తెంచివేసి నూతన పథంలో మహాప్రస్థానమయింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో శాసన పరిషత్తుకు కమ్యూనిస్టుల పక్షాన 1952లో ఎన్నికయ్యారు. శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘం స్థాపించారు. పిదప తెలుగు విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షులయ్యారు. ఆయనను కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డుతో గౌరవించింది; ఆయన సోవియట్‌ల్యాండ్ అవార్డు పొందారు. ఆయన సోవియట్ యూనియన్ వున్నగు పెక్కు కమ్యూనిస్టు దేశాలలోను, చైనా, ఇంగ్లాండులలోను విస్తృతంగా పర్యటించారు. చలనచిత్రరంగంలో ప్రవేశించి పెక్కు చలనచిత్రాలకు గేయాలూ, సంభాషణలూ వ్రాశారు. పెక్కు గేయాలు చాల ప్రజాదరం పొందాయి. ఆయన రిపోర్టీలు, ఛలోక్తులు, సమాధానాలు, సంభాషణలు నానుడులై, సామెతలై, పలుకుబడులై తెలుగును సంపన్నం చేశాయి. ఆయన పారడీలు, ప్రాసక్రీడలు, తిమరిక్కులు పలువురికి వరవడి అయ్యాయి. ఆయన గొప్ప వ్యుత్పన్నుడు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య శాస్త్రాలను పూర్తిగా జీర్ణించుకొన్న వాడు. కనుకనే ఏ బాణి పట్టినా ఏ బాట మెట్టినా సహృదయులను, దీనహీనులను ఆకట్టుకోగలిగాడు. విషయాన్ని గుర్తుంచుకోవాలి. వ్యుత్పత్తిలేనిదే భావం స్పష్టంగా సుందరంగా అభివ్యక్తంకాదు. అదిలేని కవిత, రచన కేవలం ప్రచారపు కరపత్రమవుతుంది. ఆయన వ్యుత్పన్నుడు కనుకనే ఆయన చలనచిత్ర గేయాలూ కవితా ఖండాలుగా నిలుస్తాయి. దానికి తార్కాణం ఆయన అల్లూరి సీతారామ రాజు చిత్రంలో రచించిన 'తెలుగువీర లేవరా' అనే గేయం. ఇది జాతీయ స్థాయిలో ఉత్తమ చలన చిత్ర గేయ రచన అవార్డు పొందింది. ఇలాటి అవార్డు పొందిన తొలి తెలుగు కవి ఆయనే. శ్రీశ్రీ కాలధర్మానికి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు సంతాపం ప్రకటించారు. అట్టడుగున క్రమగ్గుతున్న బడుగువర్గాల ఆకలి కేకలు పరుసవేది వంటి ఆయన కలం సోకి అభ్యుదయ కవితా ఖండికలుగా అమరత్వం పొందాయని, తెలుగు కవితలో విప్లవ శకానికి నాంది పలికిన మహాకవి శ్రీశ్రీ అని,తెలుగు సినీ వాగ్గేయకారుడుగా ఆయన చేసిన సేవ చిరస్మరణీయమని, ఆయన మరణం వల్ల తెలుగుతల్లి తన ప్రియతమ పుత్రుణ్ని కోల్పోయిందని, ఆయన గొంతు మూగవోయినా ఆయన కవిత ముందుతరాలకు స్ఫూర్తినిస్తూ, అజరామరంగా వుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఒక్కటి మాత్రం నాకు విచారం కలిగిస్తున్నది. శ్రీశ్రీ వంటివాడు కన్నుమూస్తే చెన్నపట్నంలోని తమిళ రచయితలు కిమ్మనక పోవడం. ఆయన సరిగ్గా తరంకింద ఉమ్మడి మద్రాసు విధాన పరిషత్తు సభ్యుడుగా వున్నాడు గదా ! తమిళనాడు ప్రభుత్వ పక్షాన ఏ ఒక్కరన్నా అంత్యక్రియలకు రాకపోవడం.

విదేశాలలో మన నృత్యం, ఇంద్రజాలం :

కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ అధ్వర్యంలో ప్రముఖ ఇంద్రజాలికుడు శ్రీ బి. వి. పట్టాభిరాం, నర్తకి శ్రీమతి మద్దాళి ఉషాగాయత్రి, కవి ఆచార్య తిరుమల, గాయకుడు చలపతిరావు సింగపూర్, బ్యాంగాకాక్, కౌలాలంపూర్‌లలో ఇటీవల విజయవంతంగా ప్రదర్శనలిచ్చి తిరిగి వచ్చారు. అక్కడవున్న ప్రవాసాంధ్రుల సహాయంతో బయలుదేరిన ఈ బృందం ఏడు ప్రదర్శనలిచ్చి, ప్రవాసాంధ్రుల, స్థానికుల అభిమానం చూరగొన్నారు. ప్రొఫెసర్ పట్టాభిరాం మేజిక్, హిప్నాటిజం ప్రదర్శనం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. సింగపూర్‌లోని మెజీషియన్స్ అసోసియేషన్ వారు పట్టాభిరాంను ఘనంగా సత్కరించి 'కల్చరల్ ఎంబాసిడర్ ఆఫ్ ఇండియా' అనే బిరుదిచ్చారు ముఖ్యంగా పట్టాభిరాం మొట్టమొదటిసారిగా సింగపూర్‌లో హిప్నొటిజం శాస్త్రీయ ప్రదర్శనం జరిపి ఆ ఘనతను దక్కించుకొన్నారు. అంత వరకు హిప్నాటిజం ప్రదర్శించినవారెవరూ లేరట. భారతీయ ఇంద్రజాలికులంటే చులకనగా చూసే ఆ అసోసియేషన్‌లోని చైనీయులు కూడా ఎంతో ఆనందించి పట్టాభిరాంకు 'జ్ఞాపికలు' ఇచ్చి తమ అభిమానం చాటుకొన్నారు. నర్తకి శ్రీమతి ఉషాగాయత్రి కూచిపూడి నృత్యం, ఆమె శిష్యురాలు కుమారి శైలజ భరతనాట్యం కూడ ప్రేక్షకులను ప్రముఖంగా ఆకర్షించాయి

సింగపూర్‌లో జరిగిన మేజిక్ సదస్సులో ప్రఖ్యాత చైనా మెజీషియన్ పెక్సేలియాంగ్ ప్రొఫెసర్ పట్టాభిరామ్‌ని అభినందిస్తున్న దృశ్యం





హైదరాబాద నోటుబుక


ఉషాగాయత్రి అభినయించిన భామా కలాపం ఎన్నో వన్స్‌మోర్‌లను నోచుకుంది. సింగపూర్, బ్యాంగ్‌కాక్‌లలోని ప్రవాసాంధ్రులు వీరి ప్రదర్శనాలను వీడియోలకు ఎక్కించుకొన్నారు. ఆచార్య తిరుమల కవితాగానం ప్రేక్షకులను పరవశులను చేసింది ముఖ్యంగా ఆయన "తెలుగు తేనె" కవితా ఖండం విన్న ప్రతి తెలుగు హృదయం స్పందించింది. శ్రీ చలపతిరావు ఆలపించిన జానపద గేయాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కిన్నెర ఆర్ట్ థియేటర్స్‌వారి కార్యకలాపాలను చూచి ముచ్చట పడిన ప్రవాసాంధ్రులు బ్యాంగ్‌కాక్‌లోను, కౌలాలంపూర్‌లోను కిన్నెర శాఖలు నెలకొల్పడానికి అంగీకరించారు. బ్యాంగ్‌కాక్‌లో శ్రీ జి. వి పంతులు, కౌలాలంపూర్‌లో శ్రీ ఎస్.బి. రెడ్డి ప్రాంతీయ కార్యదర్శులుగా వుంటారు. ప్రతి సంవత్సరం కిన్నెర పక్షాన ఒక బృందాన్ని ఆహ్వానించి ప్రదర్శనం ఏర్పాటు చేయడానికి వారు అంగీకరించారు. ఈ బృందం పర్యటనలో విశేషంగా పేర్కొనదగింది ఒకటుంది. బ్యాంగ్‌కాక్‌లోగల ఒక సర్వ మత శాంతి సంఘం కిన్నెర కోర్కెపై ఒక ప్రదర్శనం ఏర్పాటు చేశారు. ఆ సంఘ సభ్యులెవరూ ఇంద్రజాలం గాని, నృత్యంగాని అదివరకు చూడలేదట. అవి ఎలా వుంటాయోననే భయం కూడా నిర్వాహకులు ప్రారంభంలో వ్యక్తపరచారు. ప్రదర్శనం చూచిన పిదప వారి భయం సంతోషంగా పరిణమించింది. కళాకారులను వారు తమ సాంప్రదాయకమైన దుస్తులు, పతకాలు ఇచ్చి గౌరవించారు ఈ ప్రదర్శనలన్నిటికీ కిన్నెర ప్రధాన కార్యదర్శి శ్రీ మద్దాళి రఘురాం నిర్వహించగా, శ్రీ నిష్మల వేంకటరావు నిర్దేశకుడుగా వ్యవహరించారు.

ఉపశ్రుతి :

ఏం సార్, ద్విభాషా సూత్రాన్ని పట్టుదలగా కొనసాగిస్తున్న తమిళనాడులో త్రిభాషా సూత్రం అమలుపరచారే మీరు ? — అని ఛలోక్తి విసిరారు ఉస్మానియా విశ్వవిద్యాలయం లింగ్విస్టిక్స్ శాఖలో రీడరు డాక్టర్ రామకృష్ణారెడ్డి. ఏమిటది ? — అని ప్రశ్నించారు మిత్రులొకరు. లోకసూత్రాణి అనే గ్రంథాన్ని సంస్కృతాంధ్ర, ఆంగ్లాలలో ప్రచురించి ఆవిష్కరించడం — అన్నారు డాక్టర్ రెడ్డి. డి. కె., డి. ఎం. కె., ఎ డి. ఎం. కె. నాయకులకు తక్కిన భాషలపై గౌరవం లేకనా, వారికి ఇతర భాషలు రాకనా ? భాష అనేది రాజకీయాధికారానికి ఒక ఆయుధం. అన్నిటికీ కొంత కాలం సాగుదల వుంటుంది — అన్నారు మరొక మిత్రులు.

— తిరుమల రామచంద్ర *

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna.


నాయకుడు కాదు
అసాధ్యుడు" లో
జయసుధ